ఆంధ్ర సచిత్ర వార పత్రిక

వెల 25 నయాపైసలు
2-8-61





చుంబనం

ఖజురహో శిల్పం

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

బహుమతి - రు. 350

ఈసారి క్రొత్తరకం పోటీ నిర్వహిస్తున్నామని తెలుపటానికి సంతోషిస్తున్నాము. రచయితలు మాతో సహకరించి ఈ పోటీ జయప్రదం చేయ ప్రార్థన.

నిబంధనలు

* కథావస్తువు ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినదై ఉండాలి. స్థూలంగా యదార్థమైనదిగా ఉండాలి.
* రచన 250 అరఠావు పేజీలు మించి ఉండకూడదు. ఒక్కవైపునే వ్రాయాలి.
* రచనలు మా కార్యాలయానికి 15-11-61 లోగా చేరాలి.

★

బహుమతి - రు. 350

మరొక సాంఘిక నవలలపోటీ నిర్వహిస్తున్నాము. రచయితలు ఈ పోటీని కూడా జయప్రదం చేయగలరని ఆశిస్తున్నాము.

నిబంధనలు

* కథావస్తువు నేటి తెలుగువారి జీవితానికి సంబంధించినదై ఉండాలి.
* రచనలు 250 అరఠావు పేజీలు మించి ఉండకూడదు. ఒకవైపునే వ్రాసి ఉండాలి.
* రచనలు మా కార్యాలయానికి 15-12-61 లోగా చేరాలి.
* పోటీలలో తుదినిర్ణయం సంపాదకులదే. ఈ విషయమై ఉత్తరప్రత్యుత్తరాలు ఏ సందర్భంలోనూ జరుపబడవు.
* నవలలు తిప్పిపంపటానికి రచయితలు తగు పోస్టేజి పంపాలి.

ఉత్తరాలు

ఆదర్శాలు—అంతర్యాలు

"ఆదర్శాలు—అంతర్యాలు" నవలను ఎన్నుకొనడంలో చాలా న్యాయము చేకూర్చారు. రచయిత శ్రీ సింగరాజు లింగమూర్తిగార్కి నా అభివందనములు. సంఘవిద్రోహక చర్యలను బయటపెట్టి సమాజ వికాసానికి అర్పకుడు, అనాథయైన పోలయ్య పాత్రచే ఈ కథ నడిపిస్తున్నందుకు నా ధన్యవాదములు.

టి. కె. విశ్వనాథ్ (కాకినాడ)

* * *

శ్రీ సింగరాజు లింగమూర్తిగారు వ్రాసిన 'ఆదర్శాలు—అంతర్యాలు' చాల బాగుంది. రచయిత మొదటి పది పదిహేను వాక్యాలలో పోలాయిని గురించి చక్కగా వర్ణించారు. ఆ వాక్యాలను చదివిన ప్రతి వ్యక్తికి మరో పదిసార్లు చదవాలని అనుపించు ననుటలో అతిశయోక్తి లేదు.

కొంపల్లి సుందర్రావు (గుంటూరు)

ఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణగారు వ్యంగ్యంగా వ్రాయాలనుకొని "గోపూజా ధురంధరులు అశోక్ హోటల్‌లో పాలు, వెన్న వినియోగాన్ని నిషేధించవలసిందని అడగవచ్చు" అని అన్నారు. గోపూజా ధురంధరులు (శ్రీ కృష్ణగారు వ్యాఖ్యానించినట్లు) ఇంతవరకు చేసిన విజ్ఞప్తుల్లో పాలు, వెన్న ఆ హోటల్లో కాని, వేరెక్కడా కానీ వినియోగించకూడదని తెల్పి ఉండలేదు. అసలు మన దేశంలో పాలు, వెన్న మొదలగు వాటి కొరతకు గోహత్య జరగటం కూడా ఒక కారణమని వారు విజ్ఞప్తులు చేసి ఉన్నారు. ఈ విషయం శ్రీ కృష్ణగారికి తెలియదు కాబోలు—పాపం! శ్రీ కృష్ణగారు తామేదో గొప్పగా, వ్యంగ్య ధోరణిలో వ్రాయాలనుకొని పనికిమాలిన వాక్యాలు వ్రాశారు.

పాపం! శ్రీ కృష్ణగారికి "గోమాంసం" అనే పదం కఠోరంగా కనబడి "గొడ్డుమాంసం" అని వ్రాశారనుకుంటా!

సిద్దలింగం (సంతూరు)

చిత్ర సమీక్ష

శ్రీ నాగరాజ్ కథకాని కథ "కన్నకొడుకు" మీద వ్రాసిన చిత్రసమీక్షలోని రెండవ పేరాలో "శారదామోహన్‌ల వివాహం నిశ్చయ మవుతుంది" అని వ్రాశారు. ఇది చాల అసందర్భమైనది. ఏవిధముగా సంపాదకులు దీనిని అచ్చువేశారో గాని న్యాయముగా "శారదాకుమార్‌ల వివాహము నిశ్చయ మవుతుంది" అని అచ్చువేయవలసినది.

కావున మీరు ప్రచురించే చిత్రసమీక్షలలో యికమీదట యిటువంటి లోపములు రాకుండా జాగ్రత్తతో ప్రచురించ కోరుచున్నాను.

ఎస్. రాధాకృష్ణమూర్తి (హైద్రాబాద్)

పొరబాటు

యథార్థమే

"రిక్షావాలా" వ్యాసం పాఠకులను ఎంతో ఆకర్షించింది. హాస్పిటల్ వెంకట్రావు లో ఇంటర్వ్యూలో ఎటువంటివాడైన ఒరేయ్ రిక్షా అని పిలుస్తాడు అని వ్రాశారు. కర్నూలు నివాసియైన నేను చాలాసార్లు విన్నాను. ప్రతిఒక్కడు 'ఒరేయ్ రిక్షా జనరల్ ఆస్పిటల్‌కు ఎంత తీసుకుంటావురా" అని గద్దించి అడుగుతాడు.

బాబురావు (కర్నూలు)

బంగారం-సింగారం

కబంకగాకరం — కసింకగాకరంకలో కగోకళం కతాకలుకకు కమకనుకష్టకలు కభాకష కబాకగుంకది. కరేకఖ కగాకరికకి కమాకలకభికవంకదకనకములు. కనకముకస్తే!

కకె. కసి. కచంకద్రకమోకహకన్
(కబెకజకవాకడ—3)

* * *

మీరు ఈమధ్య ప్రచురిస్తున్న 'రేఖ' చిత్రకథ "బంగారం—సింగారం" చాల బాగుంది. అందులో బంగారంగారి పిడకలవేట, సింగారంగారి కవిత్వం అద్భుతంగా ఉన్నాయి. రేఖగారికి నా అభినందనములు.

వాగం వెంకటగోపాలరావు (బందరు)

కార్టూను

19—7—1961 సంచిక ఆఖరు పేజీలోని కార్టూను చూశాము. చిత్రకారులు (పేరూ లేదు! ఊరూ లేదు!) కార్టూను వేసేప్పుడు తొందరపడ్డారేమో. పైల్‌వాను కుడిచేతికి ఎడమచేతికి భేదంలేకుండా ఉంది. రెంటికీ బొటనవ్రేళ్లు ఒకే వైపున ఉన్నాయి. కార్టూలు మొత్తంమీద నవ్వు పుట్టించింది.

ఎన్. నిర్మలాదేవి (మద్రాసు)

చిత్రకారుడు: శ్రీ భట్.

ప్రాంతీయ దృక్పథం!

శ్రీ తనికెళ్ల సూర్యప్రకాశరావుగారి (రాజాం) ఉత్తరంలో ఇటీవల కేవలం దక్షిణాదివారి రచనల ప్రచురణవల్ల, పత్రిక స్థాయి తగ్గిందనే అభిప్రాయం వెల్లడించారు.

ఉత్తరాది వారి రచనలేవో, దక్షిణాది వారి రచనలేవో, మీ పత్రిక పాఠకుడ నగు నాకేమో తారతమ్యం తెలియలేదు.

ఇలా రచనలకు కూడా ప్రాంతీయ దృక్పథంతో రాయలసీమ, కోసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణా అనే పేర్లు పెట్టి, వాటి విలువల్ని నిర్ధారణ చేయుటం మిక్కిలి శోచనీయమనీ, పాఠకులు నాతో ఏకీభవిస్తారనీ ఆశిస్తున్నా.

"కాశీరాజు" (హైద్రాబాద్)

* * *


శ్రీ తనికెళ్ల సూర్యప్రకాశరావు (రాజాం) గారి లేఖ నాకు చాలా బాధ కలిగించింది. వారి పత్రికలో కేవలం దక్షిణాదివారి రచనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని భావించటం ఆంధ్రులకే అవమానకరం.

ఎస్. హెచ్. ప్రసాదశర్మ (హైదరాబాద్)

నర్తకి


శ్రీ. సరోజినిగారు, "నర్తకి" లో నర్తకిగానే కాక అబలగా 'రేఖ', యిరువురు వ్యక్తులు తనను ప్రేమించినపుడు ఎలాంటి నిర్ణయానికి రాగలిగిందో సహజంగా చిత్రీకరించారు.

—దేవు శ్రీనివాసరావు (గుంటూరు—1) ★



పారూ, రేపటి పార్టీ విషయమే నాకు చాలా ఆందోళన కలిగిస్తున్నది. అదేమి ఖర్మోగాని, నా వంట ఎప్పుడూ బాగుండదు.
బంగారు వదకు వరసూ, నేను వచ్చి సహాయం చేస్తానుగా. ఈ లోపు వంటకు కావలసినంత తుషార్ తెప్పించి వుంచు.
మరునాడు పారూ చేసిన సహాయానికి ధన్యవాదాలు
మీ రిచ్చిన పార్టీకి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఆహార పదార్థాలన్నీ అమోఘంగా వున్నాయి.
చాలా సంతోషం మధురమైన వంటకాల తయారీలో గల రహస్యాన్ని పారూ నాకు నేర్పింది. అదే తుషార్.
తుషార్
విటమినులు కలిగియున్న వనస్పతి
(ఏ, డి, విటమినులను కలిగియున్నది)
శుద్ధీకరించిన తుషార్ నూనె
తుంగభద్రా యిండస్ట్రీస్ లిమిటెడ్, కర్నూలు.

ASP/TI-4 TEL



నాణ్యమైనవే కోరండి
యూనిటీ సేఫ్టీ పిన్నులనే కోరండి
Unity
REGISTERED TRADE MARK
STEEL SAFETY PINS
★ సాటిలేని నాణ్యత
★ తీరుగా చేయబడ్డ పైభాగం
★ సూది మొనలు
★ దట్టమైన పూర్తి నికెల్ ప్లేట్.
★ ఒకటోరకపు ఫినిష్
గెస్ట్, కీన్, విలియమ్స్, లిమిటెడ్
నెటిల్‌ఫోల్డ్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

★

సంపుటము 53
సంచిక 47

2-8-61
బుధవారం

ప్లవ సం॥ ఆషాఢ బ॥ షష్ఠి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.


విషయానుక్రమణిక

ముఖచిత్రం: 'ఎప్పుడూ ఇంతే'

శ్రీశైల ఆలయ ఉద్ధరణ నిధి

ముఖ్యమంత్రి విజ్ఞప్తిని మన్నించి, 'ఆంధ్రపత్రిక' సేకరిస్తున్న శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివారి ఆలయ ఉద్ధరణ నిధికి ఉదారంగా విరాళాలు పంపుతున్న భక్తాగ్రేసరులను అభినందిస్తున్నాము. జులై 22 వ తేదీవరకు ఈ నిధికి రు. 11,529-92 వసూలు అయింది. యథాశక్తి విరాళాలు ఇచ్చి, ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందని ప్రజలను, ప్రజాసంస్థలను విజ్ఞప్తి చేస్తున్నాము.


ఎన్నికలలో పోటీచెయ్యాలని
రాజాజీ ఉబలాట పడటం లేదు-
రంగాజీ ఉవాచ
రంగాజీ
ఎన్నికలకు
సిద్ధమవు
తున్నారు
పరాజయ
ప్రమాదం
ఎన్నికల
అగాధం
ఓరేయ్!
నీ పాఠ్యపుస్తకంలో
ఎన్నితప్పులున్నాయిరా?
నాదాంట్లో ఇరవై
లెక్కెట్టాను!
ఇంతేనా?
నాదాంట్లో వంద
లెక్కెట్టాను!
ఎంచక్కా
మనకు
పుస్తకాలే
లేవు!
OOMMEN



బ్రిటన్ వైమానికశాఖమంత్రి శ్రీ పీటర్ థార్నీక్రాఫ్ట్ ఇటీవల ఢిల్లీ వచ్చినప్పుడు శ్రీ నెహ్రూతో.

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ

కాంగ్రెసు టిక్కెట్ల కోసం గవర్నర్ల తాపత్రయం: పదేళ్ల బ్రహ్మాస్త్రం పాలిటపడే మందభాగ్యులెవరు?

అధికారంకోసం, ఎన్నికల్లో పోటీచేసేందుకు టిక్కెట్లకోసం అప్పుడే కీచులాట ప్రారంభమైంది. పార్లమెంటుకు ఎన్నికై మంత్రులు కావాలనే ఆడియాసతో ప్రస్తుతం గవర్నర్లుగా వుంటున్న నల్గురు పెద్ద మనుష్యులు టిక్కెట్లకోసం తంటాలు పడుతున్నట్లు పత్రికా వార్తలు తెల్పుతున్నై. శ్రీయుతులు ఎన్. వి. గాడ్గిల్, వి. వి. గిరి, పటాస్కర్, రామకృష్ణరావుగార్ల పేర్లు ఈ సందర్భంలో విన వస్తున్నవి. కేంద్రమంత్రుల మాట సరేసరి. వారిలో ఏ ఒక్కరిని మినహాయించే వీలు లేదు. వీరిలో కొందరినైనా తమ మంత్రివర్గంలో వుంచుకోవాలని శ్రీ నెహ్రూ కూడా అనుకుంటున్నట్లు కన్పిస్తోంది.

కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి బొత్తిగా ధాకచక్యంలేని పెద్దమనిషి. పదిసంవత్సరాలకు పైబడి శాసన సభా సభ్యులుగావున్న వారికి టిక్కెట్లు ఇవ్వరాదని ఆయన తమ అధ్యక్షోపన్యాసంలో సూచించి అనవసరమైన గొడవతెచ్చిపెట్టుకున్నాడు. ఈ సూచన బాగోగుల మాట ఎలావున్నా కాంగ్రెస్ సమావేశం దీనికి తీర్మానరూపం ఇవ్వలేదు.


ఇది ఇట్లా జరగటంలోవున్న కిటుకేమిటో తెలుస్తూనే వుంది. ఒక్క జపానులో మినహా ఏ దేశంలోను ఆత్మహత్య చేసుకునే సంప్రదాయం కన్పించదు. మనదేశంలో పార్లమెంటునే తీసుకోండి. బాబూ సత్యనారాయణసిన్హా, బాబూ జగజీవన్‌రామ్ 1946 సెప్టెంబరు 2 వ తేదీనుంచి పార్లమెంటు సభ్యులుగానే గాక మంత్రి పదవులు కూడా నిర్వహిస్తున్నారు. బాబూ జగజీవన్‌రామ్ ప్రధాన మంత్రిత్వ కిరీటం పెట్టుకోవాలని పగటి కలలు కంటున్నారు. కాంగ్రెస్‌పార్టీ ఉపనాయకుని ఎన్నిక ఇందుకు మొదటి మెట్టు.

శ్రీ నెహ్రూ అనంతరం ఏం జరుగుతుందో కళ్ళున్న ప్రతివారికి స్పష్టంగా కన్పిస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఉపనాయకుని ఎన్నిక సందర్భంలో జరిగిన కీచులాట వెనుకచూపు కల్గిస్తుంది. ఈ భాగోతంలో శ్రీ జగజీవన్‌రామ్ కేవలం నిమిత్తమాత్రులు. అసలు పోరాటం మొరార్జీదేశాయ్, కృష్ణమీనన్‌ల మధ్య జరిగింది. అంటే గాంధేయవాదులకు కమ్యూనిజంలో విలీనం కాగల వామపక్షవాదులకు మధ్య జరిగిన పోరాటమన్నమాట. శ్రీ కృష్ణమీనన్‌ను బలపరుస్తున్న పత్రికలు ఏ కోవకు చెందినవో పరిశీలిస్తే ఈ విషయం బాగా బోధపడుతుంది.

ఇప్పుడు కీచులాటంతా శ్రీ కృష్ణమీనన్ ఏ స్థానంనుంచి పోటీ చేయాలి అన్న విషయంమీద జరుగుతోంది. ఆయన్ను బలపరుస్తున్న పత్రికలనుబట్టి ఆయన ఏ కోవకు చెందినవారో తెలుస్తుంది. బొంబాయి నియోజకవర్గంలో కమ్యూనిస్టుల ఓట్లమీద శ్రీ కృష్ణమీనన్ ఆశ పెట్టుకున్నారు.

కేరళలో కమ్యూనిస్టు పరిపాలన మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్నప్పుడు రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ఒక పర్యాయం అక్కడికి వెళ్ళారు. వారికి బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. ఆ స్వాగతానికి వారు తబ్బిబ్బై దేశంలో సహజీవనానికి కమ్యూనిస్టు పరిపాలన గొప్ప నిదర్శనంగా వున్నదని అభివర్ణించారు. శ్రీ కృష్ణమీనన్‌ని గూర్చి కమ్యూనిస్టు పత్రికలు ఆ పార్టీయందు సానుభూతిగల పత్రికలు చేస్తున్న ప్రచారాన్నిబట్టి చూస్తే కేంద్ర మంత్రివర్గంలో శ్రీ కృష్ణమీనన్ ఉనికే సహజీవనానికి గొప్ప నిదర్శనంగా కన్పిస్తోంది.

(62-వ పేజీ చూడండి)


వల్లంపాటి వెంకటసుబ్బయ్య
రామనాధం
ట్యూషన్

ప్రశ్నపడుచు ప్రేమలా వెన్నెల కురుస్తోంది.
ఆకాశాన్ని సముద్రంచేసి, చంద్రుణ్ణి నావనుచేసి దేవతలు నౌకావిహారానికి బయల్దేరారు. సౌక్యం పట్టమీద కూచుని చంద్రుణ్ణి చూస్తున్నాను. నేను వినకపోయినా తన కాలేజీ ప్రేమవ్యవహారాల్ని మార్చి చెబుతున్నాడు బావమరిది సత్యం. ఈదురుగాలిలా సాగుతున్న సత్యం మాటలు ఆగాయి. నేను కూడా కించిత్తు సంతోషంతో తిరిగి చూశాను. ఎవరో ఒకతను గుట్టఎక్కుతూ వస్తున్నాడు... నాలుగంగల్లో మమ్మల్ని సమీపించాడు. కానీ సత్యాన్ని చూడగానే అతని ముఖం నిరాశతో నల్లబారింది.

"ఏమిటి మాస్టారూ?" అన్నాడు సత్యం.

"బాడ్ లక్! ఎవరో అనుకొనివచ్చాను. అన్నట్టు నువ్విప్పుడు కాలేజిలో చదువుతున్నావుకదూ? చాలా సంతోషం! అక్కడ నీకు ట్యూషనెవరు చెబుతున్నారు? అన్నట్టు నీకు ట్యూషనెందుకూ? తెలివైనవాడివి! తెలివంటే జ్ఞాపకంవస్తోంది. ఇప్పుడు నా దగ్గరో అబ్బాయి వున్నాడు ట్యూషనుకు. సత్యం! అంతటి బంకమట్టిబుర్రగాణ్ణి నేనింతవరకు చూడలేదనుకో! ఆఁ.....నేనెందు కొచ్చాను? ఓ! వీర్నిచూస్తే జ్ఞాపకం వస్తోంది. నిప్పుపెట్టెకోసం! సార్! కాస్త నిప్పుపెట్టెవుంటే యిస్తారా?" చెయ్యి చాచాడు.

వడగళ్ళవాన అకస్మాత్తుగా ఆగినట్లయింది. దీర్ఘంగా ఒక్కసారి వూపిరి పీల్చుకొని నిప్పుపెట్టె తీసియిచ్చాను. ఆయన సిగరెట్టు వెలిగించుకొని నిప్పుపెట్టె తిరిగి యిచ్చాడు.

"సత్యం! ఇంతకూ వీరెవరు?"

"వీరా మేష్టారూ! మా బావగారు. మా చెల్లాయి సుశీల లేదూ—ఆవిడగారి భర్తగారు. మదనపల్లి హైస్కూల్లో మేష్టారు!" అన్నాడు సత్యం.

ఆగంతకుడిలో ఒక్కసారిగా ఉత్సాహం పెల్లుబికింది.

"మీరింతకూ మా జాతివారేనన్నమాట! ఆనందం! పరమానందం! ఆఁ...మీరేమాత్రం సంపాదిస్తారు ట్యూషన్లలో?"

నేను ఆశ్చర్యపోయ్యాను అతని మొదటి ప్రశ్నకు.

"కనీసం మూడువందలైనా?"

నేను జవాబు చెప్పలేదు.

"పోనీ టూ హండ్రడ్?"

"ఒక్క కానీ కూడా లేదు" అన్నాను.


"ఆశ్చర్యం! పరమాశ్చర్యం! నేను.....నేను యిందాకా రెండువందలు సంపాదించేవాణ్ణి. ఇప్పుడు మూడొందలు—మూడొందలు సంపాదిస్తున్నాను."

"మూడువందలే! మేష్టారూ! అం.....త... డబ్బు యేం చేస్తారండీ?" ప్రశ్నించాడు సత్యం నావైపు చూసి కన్నుగిలుకుతూ.

అతని ముఖంలో ఆశ్చర్యకరమైన మార్పు వచ్చింది. ముఖం పాలిపోయింది. బాధతో పెదవులు ముడేసుకున్నాయి.

"ఏం చేస్తానా? ఆఁ.....ఏంచేస్తాను! ఉరిపోసుకుంటాను. సన్యాసుల్లో కలుస్తాను... ఈ రెండూ చెయ్యలేకపోతే పెళ్ళిచేసుకుంటాను. కానీ...ఈ ప్రశ్న

(59-వ పేజీ చూడండి)



ఔషధ లక్షణాలు కలనీరు, ఊటనుంచి ఉబుకుతున్న దృశ్యం.

బాడ్ నైన్ ఆర్


ఎన్. చెంగల్ రాజు

(వీరు ప్రస్తుతం పశ్చిమ జర్మనీలో ఉన్నారు.)

బాడ్నైన్ఆర్ (Bad Neunahr) అంటే జర్మన్ భాషలో 'కొత్త ఆర్ నది స్నానఘట్ట' మని అర్థం. ఇది ఒక వూట. ప్రఖ్యాత జర్మన్ పట్టణమైన కోలోన్ (Cologne) కి దక్షిణ్య ఎనభై మైళ్ళ లోపుగా ఉన్నది. ఈ వూట జలాలలో అవుషధా లెన్నో ఉన్నాయనీ, వాటివల్ల ఎన్నో రకరకాల జబ్బులు నయమవుతాయనీ అంటారు. అందుకని ఇక్కడికి ప్రపంచమంతటినుంచీ ప్రజలు వచ్చి పోతూఉంటారు.

ఈ వూట ప్రత్యేకత ఏమిటంటే, నీరు భూమి క్రింద 310 అడుగుల లోతునుంచి భూమిపైన 65 అడుగుల ఎత్తుకి లేస్తాయి. (అంటే మొత్తం 375 అడుగు లన్నమాట) ఈ నీటిలో వివిధమైన ధాతుసంపద ఉన్నది. పొటాషియం, సోడియం, కాల్షియం, మాంగనీస్ మొదలైనవన్నీ పరిశోధనవల్ల బయటపడ్డాయి. ఒక గ్లాసు ఖరీదు సుమారు రు. 1.05 ఉంటుంది. ప్రతిరోజూ కొన్ని లక్షల సీసాల జలం ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది.

ఇక్కడ రోగుల సౌకర్యం కోసం ప్రైవేటు గదులు నిర్మించారు. మనిషికి దినానికి సుమారు 115 రూపాయలు పుచ్చుకుంటారు. అయినా రోజు రోజుకీ ఇక్కడికి వచ్చేవారి సంఖ్య పెరుగుతున్నదే కాని తగ్గటం లేదు. ★



యాత్రికుల సదుపాయం కోసం అక్కడఉన్న ఒక పెద్ద హోటల్.



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

2-8-1961 బుధవారము మొదలు
8-8-1961 మంగళవారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

మీ పరిస్థితులు గతవారంకన్నా మెరుగుగా కనుపిస్తవి. ముఖ్యంగా ధనసంబంధమైన లావాదేవీలు సులభంగా పరిష్కరించుకోగలుగుతారు. వ్యవహారరంగంలో పేచీలు తీసుకొని వచ్చే మనుష్యులు తొలగిపోతారు. అన్ని విషయాలలోను లోగడ మీరు పెట్టిన పెట్టుబడికి తగినంత ఫలితం లభిస్తుంది. మిమ్ములను నలుగురిలో నవ్వులపాలుచేయటానికి చూచేవారికి తగిన సమాధానం చెప్పగలుగుతారు. వృత్తిలో మీ పనులు నిదానంగా జరిగినా నిరాటంకంగా అనుకూలిస్తవి. స్నేహితులను గురించి ఏర్పడిన ఆందోళన తొలగిపోతుంది. ఇతరులతో పోటీ తగ్గించుకొనటం వల్ల కార్యభారం తొలగి విశ్రాంతి లభిస్తుంది. 2, 3 తేదులలో బంధుదర్శనం, లాభవార్తలు, ప్రయాణము.

*   *   *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఎదటివారి కష్టాన్ని చూచి జాలిపడటంవల్ల ఈ సమయంలో అనవసరంగా మాటపడవలసి వస్తుంది. ధనాదాయం బాగానే ఉంటుంది. విశ్రాంతిలేకుండా ఏదో ఒక పని చేస్తూఉంటారు. స్నేహితులు అనేక సందర్భాలలో మీ మాటను అనుసరిస్తారు. వృత్తి, ధనార్జన మొదలైన విషయాలలో కొన్ని ప్రతిబంధకాలు కనిపించినా బుద్ధిబలంతో సమర్థించుకోగలుగుతారు. మాటకు విలువ బాగా పెరుగుతుంది. వాహనాలు, యంత్రాలు మొదలయినవి కొనే ప్రయత్నాలు సులభంగా అనుకూలిస్తవి. లాభకరమైన సలహాలు చెప్పేవారు లభిస్తారు.

> **గ్రహస్థితి**
>
> మిథునంలో శుక్రుడు, కర్కాటకంలో సూర్య, బుధులు, సింహంలో రాహువు, సింహ కన్యలలో అంగారకుడు, మకరంలో గురు, శనులు, కుంభంలో కేతువు, మీన, మేష, వృషభ, మిథునాలలో చంద్రుడు.

ముఖ్యమైన రికార్డు కాని, వస్తువులు కాని ఇతరుల చేతికి పోకుండా చూచుకొనటం అవసరం. 5, 6 లలో శుభకార్య ప్రసంగాలు, మిత్రులవల్ల కార్యసిద్ధి.

*   *   *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

యథార్థంగా శక్తి లేకపోయినా మాట పట్టింపు కోసం భారం పైన వేసుకొంటారు. రావలసిన డబ్బు అనుకున్నట్లుగా చేతికి రాదు. ఎప్పటికప్పుడు క్రొత్త మనుష్యులతో సంప్రదించవలసి వస్తూ ఉంటుంది. కుటుంబంలోనివారి ఆరోగ్యం సరిగా ఉండదు. సమయంలో అవసరమైన వస్తువులు లభించకపోవటంవల్ల ప్రారంభించిన పనులు తాత్కాలికంగా నిలుపుకొనవలసివస్తుంది. వినుగుదల అధికమవుతుంది. శుభకార్య సందర్భాలలో ఖర్చులు పెరుగుతవి. తూర్పుదిక్కునుంచి శుభవార్తలు తెలుస్తవి. అధికారులవల్ల జరుగవలసిన పనులు సకాలంలో నెరవేరుతవి. వారం రెండవ భాగంలో ఉష్ణాధిక్యంవల్ల అనారోగ్యంచేయగల అవకాశా లున్నవి. 7, 8 తేదులలో ఇష్టవస్తు ప్రాప్తి, మంచివారితో పరిచయం.

*   *   *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

భిన్నాభిప్రాయాలుగల మనుష్యులమధ్య మీరు చిక్కుపడవలసివస్తుంది. డబ్బు ఖర్చు అవుతుంది. కాని, సుఖం మాత్రం దక్కదు. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సాధ్యమైనంతవరకు ఆహారవిహారాలలో జాగ్రత్తగా ఉండి ఆరోగ్యం కాపాడుకొనటం అవసరం. వృత్తిఉద్యోగాలలో శ్రమకరమైన పనులు పైనపడగల సమయం. గతవారంలో కలిగిన ఆందోళన చాలావరకు తీరిపోతుంది. ఇతరులవద్దనుంచి ఎదురుచూస్తున్న సమాధానాలు శీఘ్రంగా అందకపోవచ్చు. అకస్మాత్తుగా ఉద్రేకంవచ్చే అవకాశా లున్నవి. డబ్బు అప్పుగా ఈయటం పుచ్చుకొనటం మొదలయిన విషయాలలో నిష్కర్షగాఉండటం అవసరం. వ్యవహారరంగంలో పట్టుదలలు పెంచుకొనదగిన సమయం కాదు. 4, 5 లలో వృత్తిలో గౌరవము, అభివృద్ధి కనిపిస్తవి. బంధుమిత్రులవల్ల కార్యసిద్ధి.

*   *   *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

పదిమందిలో గౌరవంపొందటానికి ఈ సమయంలో పటాటోపం అవసరం. మీ మాటలలో ఎదటివారికి పట్టుబడకుండా చూచుకొనండి. ఖర్చు అధికంగానే ఉంటుంది. సాటివారిలో మెప్పు పొందగలుగుతారు. ప్రత్యేకం అనారోగ్యం చేయదు కాని, విశ్రాంతిలేని పనులవల్ల అలసట అధికమవుతుంది, గౌరవం లభిస్తుంది. మీరు అనుకొన్నంతగా ప్రయోజనం పొందదగినసమయం కాదు. లోగడ మీరు ధన వ్యయంచేసి ఆరంభించిన పనులు ప్రస్తుతం ఒకరూపంపొంది ఫలితానికి వస్తవి. వారం మధ్యలో అధికారులతో మాట పట్టింపులు రాగల అవకాశాలున్నవి. అప్పులు చేయవలసిన అవసరాన్ని తగ్గించుకొనటం మంచిది. 3, 4 తేదులలో ధనలాభం, ధర్మ కార్యాలు.

*   *   *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

దైవబలంవల్ల అన్ని విధాలా ఉన్నత స్థితిని పొందగలుగుతారు. మొదట ప్రతిబంధకాలు తోచినా

మబ్బువిడిపోయినట్లుగా ఎక్కడివక్కడ తొలగి పోయి జయం పొందగలుగుతారు. ఉత్సాహం బాగుంటుంది. ఎదుటివారికి చెప్పిన మాట ప్రకారం మీ కర్తవ్యాన్ని నెరవేర్చుకోగలుగుతారు. కుటుంబంలో సుఖశాంతులు లభిస్తవి. వారం రెండవ భాగంలో మీచేత శ్రమ చేయించుకుని చివరకు పేచీ పెట్టే రకం మనుష్యులు తటస్థపడతారు. పుణ్యక్షేత్రాలకు ప్రయాణంచేయవలసిరావచ్చు. విశేషంగా డబ్బు పెట్టుబడిపెట్టే భారమైన పనులు ఆరంభించగల సమయం. ప్రశాంతంగా కార్యసిద్ధిపొందగలుగుతారు. చట్టా వ్యాపారంవంటి పనులలో ఉత్సాహపడతగిన సమయంకాదు.

తులం.

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

పెద్దమొత్తాలుగా ఆదాయం వస్తున్నట్లు కనుపించినా మధ్య మధ్య ఆటంకాలు వస్తూ ఉండటంవల్ల మీ ఖర్చులకు చాలనట్లే తోస్తుంది. అంతస్తుకుమించిన హోదా జరుపవలసివస్తుంది. వ్యవహారవిషయాలలో మీ మాట చలామణి అవుతుంది. పోటీ కూడా అధికంగానే ఉంటుంది. మీతో పని నెరవేర్చుకొనే నిమిత్తం దగ్గరచేరేవారుంటారు. మాటలలో ఇతరులకు చిక్కకుండా మర్యాదను నిలుపుకోగలుగుతారు. సందర్భానుసారంగా లోగడ మీరు వద్దు అని అనుకున్నపనులలో దిగవలసి వస్తుంది. దైవకార్యాలు సునాయాసంగా జరుగుతవి. విలువగలవస్తువులు కొనే ప్రయత్నాలు మానుకోవలసి వస్తుంది. 7, 8 తేదులలో అధికారుల వల్ల గౌరవము, స్థిరాస్తుల మూలంగా ఆదాయము.

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వృత్తి, వ్యాపారాలలో మీ గొప్పదనం పెరుగుతుంది. అప్పటి కప్పుడు నిర్ణయించుకుని ప్రారంభించవలసిరావటంవల్ల కొన్ని పనులలో పొరపాట్లు, అధికంగా ధనవ్యయం కనుపించగలవు. పదిమందిలో గౌరవప్రతిపత్తులు పెరుగుతవి. చాటున మిమ్మలనుగురించి హేళనగా మాట్లాడినవారే మీ పనులలో సహాయం చేస్తారు. అకస్మాత్తుగా ధనాదాయం పెరుగుతుంది. మధ్యవర్తిత్వంవంటి భారాలు పైన వేసుకొనతగిన సమయంకాదు. కుటుంబంలోనివారితో అభిప్రాయభేదాలు రాకుండా చూచుకొనటం అవసరం. దుబారాఖర్చులు అధికమవుతవి. 6, 7 తేదులలో సంఘకార్యాలు, విలువగల వస్తువులు కొంటారు. పిల్లలకు అనారోగ్యం.

* *

ధనుస్సు:

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)

మీకు ప్రత్యక్షంగావచ్చే చిక్కులకన్నా మీ భయమే మిమ్ములను బాధిస్తుంది. ఏ సమయంలో ఏది లభించదో దానితోనే అవసరము, ఆసక్తి అధికం అవుతవి. ఇతరులకు వ్రాసే ఉత్తర ప్రత్యుత్తరాలలో మృదువుగాఉండే మాటలను ఉపయోగించటం అవసరం. జ్ఞాపకశక్తి సరిగాలేకపోవటం వల్ల మిగిలిపోయిన పనులనుగురించి పశ్చాత్తాప పడవలసి వస్తుంది. వ్యవహారాలలో ఏదో ఒక విధంగా మాట దక్కించుకోగలుగుతారు. డబ్బు ఇబ్బంది చాలావరకు తీరి మనశ్శాంతి లభిస్తుంది. మాటలతో కాలంగడిపేరకం మనుష్యులను దూరంగా ఉంచటం అవసరం. 2, 3 తేదులలో వినోద కాలక్షేపాలు, వృత్తిలో మంచి మనుష్యులతో సంబంధం, ధనలాభం.

*

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

రక రకాల పనులలో మునిగి తేలుతూ ఉంటారు. ఫలితం మాత్రం ఏ విధంగాను పెద్దగా పెరిగే అవకాశాలు లేవు. అయితే ఆడంబరంమాత్రం పెరుగుతుంది. ముందు మీ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్తగా ఉండండి. జీర్ణకోశాలలోను, అవయవముల సంధులలోను బాధ కనుపించగల అవకాశాలున్నవి. స్వంత వృత్తివ్యాపారాలలో ప్రతిఫలం కన్నా మాట ప్రధానంగా భావించి శ్రమ పడవలసి వస్తుంది. మిమ్ములను ముందుగా దింపి వెనుకనుంచి తమాషా చూచేవారుంటారు. పడమర దిక్కునుంచి శుభవార్తలు తెలుస్తవి. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం అవసరానికి ఉపయోగిస్తుంది. నౌకరులతో అభిప్రాయభేదాలు వస్తవి. 5, 6 తేదులలో బంధువులవల్ల అనుకూలత, సంఘంలో గౌరవం, అధిక ఖర్చులు.

కుంభం:

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఒకప్రక్క సందేహం బాధిస్తున్నా అనుకోకుండా అవకాశాలు కలసివస్తూ ఉండటంవల్ల గతవారంకన్నా ఉత్తమస్థితికి పోగలుగుతారు. సాటివారిలో మీ మాటకు గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు సుఖంగాను, లాభదాయకంగాను జరుగుతవి. విలువగల వస్తువులు కొంటారు. మిమ్ములనుగురించి మీ అప్పులతో చాడీలు చెప్పే వారుంటారు. కాని, దైవబలంవల్ల మీకు ఏ విధంగాను అపకారం జరుగదు. కుటుంబంలోనివారి ఆరోగ్యం బాగుండదు. వృత్తిలో డబ్బు పెట్టుబడిపెట్టవలసిన అవసరం కలుగుతుంది. అధికారుల వల్ల కార్యం సాధించుకొనే ప్రయత్నాలలో ఆటంకాలు కనిపిస్తవి. స్నేహితుల నిమిత్తం మీ పలుకుబడిని వినియోగించవలసి వస్తుంది. 7, 8 తేదులలో పిల్లలకు అనారోగ్యం, ఉత్తర దిక్కునుంచి శుభ వార్తలు, వృధా ఖర్చులు.

* * *

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

పైవారివల్ల మాట వస్తుందనే భయం తొలగి పోతుంది. డబ్బు ఇబ్బంది క్రమంగా తగ్గుతుంది. శుభసంతోషాలతో కాలం గడుస్తుంది. ఎదురు చూస్తున్న వార్తలు సకాలంలో అందకపోయినా మీ కార్యక్రమాలకు ఆటంకం మాత్రం ఉండదు. మీ స్నేహితులకు మీ సలహా అవసరం అవుతుంది. సాధ్యమైనంతవరకు తప్పుకొనటంవల్ల సుఖం పొందగలుగుతారు. కుటుంబంలో మాటపట్టింపులు, అభిప్రాయభేదాలు వస్తూ ఉంటవి. విలాస వస్తువులకై ధనవ్యయం చేస్తారు. బంధువులవద్ద నుంచి కష్ట వార్తలు తెలుస్తవి. 5, 6 తేదులలో పిల్లలకు అనారోగ్యం, గౌరవార్థం ఖర్చులు.

★

ఈవారము ధరలు

బంగారం ధర వారం ఆరంభంలో తగ్గి 5, 6 తేదులలో పెరగగల అవకాశాలున్నవి. వెండి ధర మందీ వచ్చి వారాంతంలో నిలుస్తుంది. పసుపుధర వారాంతంలో పెరుగుతుంది. నూలు ధర బాగా పెరుగుతుంది. నూవుల ధర నిలకడగా ఉంటుంది. నూనె ధర కొద్దిగా తగ్గవచ్చు. వేరుశనగపప్పు ధర పెరుగుతుంది. నూనె ధరలలో పెద్ద మార్పు కనిపించవు. మినుములకు గిరాకి వస్తుంది. కందుల ధర కొద్దిగా తగ్గుతుంది. మిర్చి ధర క్రమంగా పెరుగుతుంది. ధనియాలకు ముందేరావచ్చు.

జీవితమంతా నానాకష్టాలూ పడి, ధనమంతా పోగొట్టుకుని, హీనాతిహీనమైన బ్రతుకు బ్రతికి - చివరికి ఒకవ్యక్తి చచ్చిపోయాడు. ఆ ఊరుజనం అతన్ని చూడడానికి వచ్చారు. అందరూ సానుభూతితో తలోమాటా అంటున్నారు. ఒకడిలాఅన్నాడు:

"పాపం... బ్రతికి నన్నాళ్లూ చచ్చే కష్టాలనుఅనుభవించాడు"

మరొకడు యిలా అన్నాడు:

"ఛ్ఛ... నిజంగా చచ్చిపోయాడు కాబట్టి బ్రతికిపోయాడు గానీ, నిజంగా బ్రతికేగనక ఉంటే; యీ కష్టాలతో వేగలేక చచ్చేవుండేవాడు."

నూజివీటి చాగయ్య

హరివంశము

సాందీపనిపర్వం - 22

"కంఠేకాళ కిరీట విటంక
గ్రారుచి చుళికితజల మణికర్ణిక,
మందాకిన్యంభోవేణీభర
మధ్య నాభిచక్రము మణికర్ణిక;
ఒక్క దానమును కోటి దానమ్మై
యొసగు ఫలము నరునకు మణికర్ణిక;
ఒక్క యాగమును కోటి యాగమ్మై
యొసగు ఫలము నరునకు మణికర్ణిక;
ఒక్క ధర్మమును కోటి ధర్మమ్మై
యొసగు ఫలము నరునకు మణికర్ణిక;
చక్ర పుష్కరిణియను నామమున ప్ర
శస్తి వహించిన యది మణికర్ణిక;
చక్రనేమి చంక్రమమున దిరిగెడు
సంసృతికిని విరుగుడు మణికర్ణిక;
శివు కాశీపతి విశ్వనాయకుని
సేవింపగ తలపెట్టిన యప్పుడు
నవరూపంబు పరిత్యజించి
వనితారూపము దాల్చును మణికర్ణిక;
ప్రత్యక్షంబై పుణ్యపురంధ్రీ
భావంబు భజించిన సమయంబున
నత్యంత మనోహరహారిహావ
భావాభిరామ యగు మణికర్ణిక;
నాలుగు భుజములు వాలిక కన్నులు
నయనాన్వితమగు
ఫాలభాగమును
బాలేందు కళా మధ్యంబున
సితభసితంబు ధరించును మణికర్ణిక;
కటకహార కేయూర మేఖలా
కంకణాది భూషణ భూషితయై
కుటిలాలకముల మీద
చిన్నిపువ్వు గుస్తరించు నచ్చుగ మణికర్ణిక;

ఆ కంఠము సాందీపనిది పోలె ఉన్నది. మహానందుడు తాను ఆ కంఠము వినవచ్చు దిక్కునకు పోయినాడు. సాందీపని పద్మాసనస్థుడై మణికర్ణికను ధ్యానించుచున్నాడు. ఆయనముఖమున బ్రహ్మవర్చసము సూర్యునికాంతిని పోని వైభవముతో వెల్గుచున్నది. మహానందునకు అనిపించినది. ఈ బ్రహ్మభూతుడేమి ! ఆయనకు ఈ పుత్రదుఃఖమేమి ! అతని నోటివెంట అప్రయత్నముగా ఈ మాటలు వెలువడినవి.

మణికర్ణిక చింతా మాణిక్యము
మణికర్ణిక బృందారక ధేనువు
మణికర్ణిక కల్పద్రుమ వాటిక
మణికర్ణిక సిద్ధరసస్యందనము
శ్రీ మణికర్ణిక అణిమాది
మహాసిద్ధి కారణము సేవకకోటికి.

సాందీపని సమాధిలోనికి పోయినాడు. ఆయన ముఖమున అమందమైన ఆనందము తాండవించుచున్నది. మహానందునకు ఇది అర్థముకాలేదు. మణికర్ణిక సాందీపనికి దర్శనమిచ్చినదో ! వికటపాటలజటామకుటకోటిసినద్ధ ముగ్ధచంద్రముడైన జగన్మోహనుడు, కంఠమూల కఠోర కాలకూట కళంక కజ్జలుడయిన అర్ధాంగీకల్పతరువు, కుటిల కుండలి రాజకుండలాలంకార మండితుడయిన ఆనతాఖండలుడు, భసిరధూళిచ్ఛటాపాళిసముద్ధూళితాఖిలాంగుడైన విశ్వాధికుడు, దర్శనం ఇచ్చినాడు! మహానందునకు తెలియలేదు. అంతలో సాందీపని కన్నులు తెరచినాడు. ఎదురుగా ఆయనకు మహానందుడు కనపడినాడు.

"మహానంద !"

"సాందీపని ! నన్ను జడుడా అనుట విస్మరించినావు."



సాందీపని గల్లున నవ్వినాడు. "మహానంద ! పద ! పద ! శివుని ఆజ్ఞ అయినది. మనవద్ద శిష్యత్వమునకు ఎవ్వరో మహాపురుషులు వచ్చుచున్నారట. వారికి ముందు శివుని ప్రతినిధులముగా మనము మర్యాదలు నడిపించవలెనయ్యా ! పద, పద! ఆలస్య మగుచున్నది" అన్నాడు.

మహానందుడు నవ్వినాడు. "సాందీపని ! ఎవ్వరో మహాపురుషులు శిష్యులుగా వచ్చుట యేమి ! గురువు నీవు మర్యాదలు చేయుట యేమి. నేను ఆ మర్యాదలు నడిపించెదను. నీవు ఆశ్రమమునకు పద."

మహానందుని మాటలు వినగా సాందీపనికి నవ్వు వచ్చినది. ఆయన అనినాడు : "జడుడా! పరమశివుడు దర్శనమిచ్చి, నావద్దకు ఎవరో మహాపురుషులు శిష్యులరై వత్తురు అనినాడు. మరి ఆ మహాపురుషు లెవరు ? వారిని ఎరుగుట ఎట్లు ? వారు ఎప్పుడు వత్తురు ? ఈ ఆలోచనము చేసినావటరా ! జడుడా ! నన్ను ఆశ్రమమునకు పద మనుచున్నావు. వారికి మన ఆశ్రమము తెలియునని, తెలియవలయునని ఎచ్చట నున్నది ! నేను మూర్ఖుడనురా ! భగవంతుని అడుగలేకపోయినాను. ఆ వచ్చెడి మహాపురుషులు ఎవ్వరు ? ఎట్టివారు అని". మహానందుడును ఆలోచనలోపడినాడు. "అవును ! సాందీపని ! అవును" అనినాడు. అంతలో అతనికి ఒక్క ఆలోచనము వచ్చినది. సాందీపనితో ఇట్లు లనినాడు : "సాందీపని ! నీ యీ విచారము అవిచార మూలకము. ఆ వచ్చెడువారు మహాపురుషులో, మరి యెవ్వరో, నీకు శిష్యులు. మరి వారు కాశిలో సాందీపని ఆశ్రమమునే తెలుసుకొనలేరా ! అట్టులు తెలియజాలనివారు నీ వద్దకు శిష్యులై ఎట్టులు వత్తురు ! నీవు ఆశ్రమమునకు పద. నేనును వచ్చుచున్నాను. నీకు అనుష్ఠానములు మెండాయెను. నేను అన్నియు వదులుకొన్నవాడను. నేను ఆశ్రమము వాకిటిలో కూర్చుందును. వచ్చెడి ప్రతి క్రొత్తవారిని "అయ్యా ! మీరు మహాపురుషులా ! సాందీపని శిష్యులా !" అని అడుగుచుందును. అట్టివారు రాగా, లోనికి తీసుకొని వత్తును. సరిపోయినదా !"

మహానందుని మధురహాస్యము ఇట్టులే ఉండును. సాందీపని వాని ఆ మాటలకు మందహాసముచేసి "సరియే పద ! ఆశ్రమమునకు పోదము" అని మరియు మణికర్ణికను సేవించి, బయలుదేరినాడు. దారిలో అతని మనస్సులో మణికర్ణికయే ఆడినది. ఆ మణికర్ణికను గూర్చిన అర్థములే ఆడినవి. మణికర్ణిక ఏర్పడి ఎన్ని కల్పములు గడచినవి ? ఇన్ని కల్పములు గడచినను మణికర్ణిక పదియును రెండు నిడుత చిన్నిప్రాయమున, జహజ్రహాద్విడమైన చేత స్ఫుటము వహించినట్లు ఒప్పుతూ ఉంటున్నది. కన్నులు మూసుకొనగా, మణికర్ణిక విచిత్ర రూపమును అంగీకరించి తనకు కన్పించుచున్నది. ఒకచేతిలో ఇందీవరమాలిక; మరియొకచేతిలో మాదీఫలము; ప్రకటితమగు దోర్ద్వయమున అంజలి బంధము వహించి కన్పించుచున్నది. ఆమె ముఖము పద్మముతో సమానముగానున్నది. పలువరుసలు పద్మరాగ మాణిక్యములతో సమముగా ఉన్నవి. ఆమె పడమరముఖమై నిల్చిఉన్నది. చూపును నిష్కంపముచేసి నాసాశిఖరముమీద నిల్పినది. ఆమె ఎవరిని వీక్షించుచున్నది ! సాందీపని అనుకొనినాడు. ఈమె శివునకు ప్రియురాలు. కాశిక శివునికి ఎంత ప్రియమో, ఈమె యన్నను అంతియే ప్రియము. నాసాగ్రకృతదృష్టియై ఆమె ఉడురాజకళాభరణుణ్ణి వీక్షించుచున్నదో ! సాందీపని మనస్సు మనస్సులో లేదు. ఈమె విఘ్నతీర్థము ! తనకు ఇట్టుల దర్శనము నిచ్చుచున్నదేమి ! పరమశివుని ఆజ్ఞను వివరించగా కన్పించుచున్నదా ! సాందీపని మణికర్ణికకు అవాగ్భాగమున నున్న పాశుపతతీర్థమును చేరినాడు. తత్పురోభాగమునన్న రుద్రావాస తీర్థమును దర్శించినాడు. ఆ తీర్థమునకు యామ్య దిగ్భాగము నందున్న విశ్వతీర్థమును చేరుకొనినాడు. విశ్వతీర్థమునకు సంగడిమోక్ష తీర్థము. సాందీపని అచ్చట కొంచెముసేపు నిలబడినాడు. మోక్షే

(55-వ పేజీ చూడండి)


హారీత శివశర్మ

శ్రీ కౌండిన్య

వచ్చే ఎన్నికలలో స్వతంత్రపార్టీ భవితవ్యం: ఉస్మానియా విశ్వవిద్యాలయ వ్యవహారాలు

రాష్ట్ర శాసనసభలో 181 స్థానాలకు, లోక్ సభలో 27 స్థానాలకు స్వతంత్రపార్టీ అభ్యర్థుల్నిపెట్ట నిశ్చయించిందని పార్టీ అధ్యక్షులు శ్రీ ఎన్. జి. రంగాగారు మొన్న హైదరాబాదు పత్రికావిలేఖరుల సమావేశంలో చెప్పారు. శాసనసభ మొత్తం స్థానాలు 301. లోక్‌సభలో ఆంధ్ర కున్న స్థానాలు 43. అనగా శాసనసభలోనూ, లోక్‌సభలోనూ సగానికిపైగా పోటీ చేయాలని సంకల్పించారన్నమాట. తీరా ఎన్నికలు దగ్గరపడే నాటికి ఈ ఆలోచనలు ఎలా తారు మారవుతాయో చెప్పలేము. ఎన్నికలంటే డబ్బుతో పని. తలా పాతిక, ముప్పై వేలు చేతిచమురు తగలనిదే ఏ అభ్యర్థి నెగ్గడు. తమది డబ్బులేనిపార్టీ అంటున్నారు. కాబట్టి చివరికి వచ్చేసరికి ఈ సంకల్పించిన అభ్యర్థులలో సగంమంది తగ్గి, ఆ సగంలోనైనా మూడో వంతును గెలిపించుకోడం గగనం కావచ్చు.

ఎన్నికలలో ఘనవిజయం పొందగలమన్న వెనుకటి ఉమ్మస్సు ఇప్పుడు లేదని, వాస్తవ పరిస్థితిని ఆకళింపుచేసుకుంటున్నామని శ్రీ రంగాగారే అన్నారు. యదార్థాన్ని దాచుకోకుండా నిర్మొగమాటంగా చెప్పినందుకు వారిని అభినందించాల్సిందే. రెండేళ్ళనాడు స్వతంత్రపార్టీ ఏర్పడ్డప్పుడు, ఇది మధ్యతరగతి ప్రజలకు, సన్నకారు భూస్వాములకు వరప్రసాదంలా ఉద్భవించిందని, కాంగ్రెస్ పరిపాలనలో అవతవకల నెదుర్కొనగల బలమైన ప్రతిపక్షంగా తయారు కాగలదనిగ అంతా ఆశించారు. కాని ఆ ఆశ అడియాసయైంది. పార్టీకి సరియైన కార్యక్రమంగాని, సిద్ధాంతాలుగాని రూపొందించలేకపోయారు. ప్లానింగ్ పనికిరాదంటూ, భూసంస్కరణలు బొత్తిగా తగవంటూ 19వ శతాబ్దం నాటి దృక్పథంతో తయారుచేసిన కార్యక్రమం ఎవరికీ నచ్చలేదు. పైగా కాంగ్రెస్‌ను, కాంగ్రెస్ నాయకులను అనునిత్యం తిట్టడమే ఈపార్టీ పని అని ఇంతకుమించి నిర్మాణాత్మకంగా చేస్తున్నది ఏమీలేదన్న అభిప్రాయం జనంలో ఏర్పడింది. కాంగ్రెస్‌కున్న మూకబలంగాని, కమ్యూనిస్టులకున్న కట్టుబడి బలంగాని—ఈ రెండింటిలో ఏ ఒక్కటీలేదు. నా అన్నవారులేకుండా కేవలం నాయకుల పార్టీ అయింది. సిద్ధాంతబలం కృషిబలం లేకుండా ఉపన్యాసాలబలంతో నెగ్గుకురాలేమని ఇప్పటికైనా గ్రహించగలిగితే సంతోషం.



శ్రీ కామరాజనాడార్‌కు జులై 15 ఎ తేదినాటికి 59 సంవత్సరాలు నిండాయి. వారి జన్మదినోత్సవాన్ని మద్రాసు నగరవాసులు మహోత్సాహంతో జరుపుకున్నారు. అఖిలభారత నాయకులలో ఒకరైన శ్రీ నాడార్‌కు దేశం నలుమూలలనుంచి ప్రముఖులు శుభాకాంక్షలు అందజేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చవాన్ స్వయంగా మద్రాసు వచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బలమైన ప్రతిపక్షం ఉండటం అవసరమే. ఎవరూకాదనరు. కాని అందుకు స్వతంత్రపార్టీ చేసిందిగాని, చేస్తున్నదిగాని ఏమున్నది. దక్షిణాదిన ద్రవిడకజగంతోనూ, ఉత్తరాదిన మతపక్షాలైన జనసంఘం, రామరాజ్య పరిషత్తులాంటి వాటితోనూ చేరితే పార్టీప్రతిష్ఠ పెరిగి బలపడుతుందనా? ఎన్నికలు వస్తున్నాయిగనుక ఆంధ్రలో కొన్ని పార్టీలతో పొత్తు కలుద్దామని రంగాగారు ప్రయత్నిస్తున్నారు. ఈమధ్యనే ప్రజాపార్టీ నాయకులైన విశ్వనాధంగారితో మంతనాలు జరిపారు. ఫలితం ఏమైందీ ఇంకా తెలియదు. ఇంచుమించు గతించి పోయిన ఈ ప్రజాపార్టీకి, తులసితీర్థంలా, నదీ జలాలవివాదం ఛాన్స్‌గా వచ్చింది. కాని తెప్పరిల్లకునే ఆశ ఏమీ కల్పించడంలేదు. పోతే సోషలిస్టు పార్టీ: ఆంగ్రేజీహటావ్ తప్ప దీనికి మరో గొడవలేదు. అదిగాక ఆంధ్రలో పి. వి. జి. రాజు గ్రూప్ కాంగ్రెస్‌తో కలవడంతో దీనికి నామం రూపం లేకుండా పోయింది. ప్రజాసోషలిస్టుపార్టీ పేరుకు మాత్రమే. జనసంఘం ఇత్యాదులు ఉన్నా లేనట్లే. కనుక "నానా గోత్రేభ్యః"గా ఉన్న ఈఅనామకపు పార్టీలతో స్వతంత్రపార్టీ పొత్తుకలసినా సాధించగలిగిందేమీలేదు. కాంగ్రెస్ తరువాత కొద్దో గొప్పో బలంవున్న కమ్యూనిస్టులతో ఈ పార్టీ ఎలాగూ కలవదు.

కాబట్టి, స్వతంత్రపార్టీ వచ్చే ఎన్నికలలో కేవలం స్వతంత్రగానే నెగ్గాల్సివస్తుంది. ఆ బలం ఎంత—ఎంతమటుకు నెగ్గుకురాగలదు అన్నదిఖచ్చితంగాఎవరూ చెప్పలేరు. కాని ఇప్పటి అంచనాలు తారుమారవడం తప్పదని చెప్పవచ్చు. స్వతంత్ర పార్టీకి కొద్దో గొప్పో బలంఉన్న జిల్లాలు ఆంధ్రలో శ్రీకాకుళం, గుంటూరు, చిత్తూరు, నెల్లూరు, వెనుకటి లోక్ పార్టీ బలం అంతా స్వతంత్ర పార్టీకి లభించిందనడానికి లేదు. ఏ అరడజనుమందో తప్ప తతిమ్మా స్థానిక నాయకులంతా విడిగా ఉన్నట్లే కన్పిస్తోంది. కనుక ఈ మూడు నాలుగు జిల్లాలలోనైనా, ఆ యా వ్యక్తులకున్న బలమే పార్టీబలం.

కనుక రంగాగారి వాస్తవిక దృష్టి ఈ యదార్థ పరిస్థితిపై మళ్ళితే మంచిది. అంతేగాని గొప్పకోసం 180 మందినిపెట్టి, డిపాజిట్లు పోగొట్టుకొంటే, పార్టీ అసలు బండారం పూర్తిగా బయటపడిపోతుంది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు పదివేలమంది జీతాలు పెంచినందుకు ఇప్పటికి రెండు వారాలుపైగా సమ్మెచేస్తున్నారు. చిలికి చిలికి గాలివానగా మారినట్లు, ఇన్నాళ్ళూ ప్రశాంతంగా సాగుతున్న సమ్మె ఇప్పుడు ఉధృతమై పోలీసు లాఠీ ఛార్జీ దాకా వెళ్ళడం, పలువురు విద్యార్థులు గాయపడటం జరిగింది. ఇంతకుముందే విద్యార్థులు దౌర్జన్యచర్యలకు దిగుతున్నారని రిజిస్ట్రార్ హెచ్చరిక చేయడంతో ఇలాంటి ఉపద్రవమేదో జరుగుదనే అనిపించింది. ఈ సమ్మెలో రాజధానిలోని హైస్కూలు విద్యార్థులు కూడా చేశారు. ఇంకా జిల్లాలలోని కాలేజీలకు ఆశ్లే ప్రాకలేదు. అది కూడా అయితే ఇక చెప్పాలా?

అసలు ఉస్మానియాలో ఏదో ఒకరకమైన గొడవ ఎప్పుడూ ఉండడం అలవాటైనట్లుంది. డి. ఎస్. రెడ్డిని ఉపాధ్యక్షుడుగా నియమించినప్పుడు ఆరంభమైన ఆందోళన ఏదో రూపంలో తలఎత్తుతూనే ఉంది. కొన్నాళ్ళు విద్యార్థులు, కొన్నాళ్ళు విశ్వవిద్యాలయ సిబ్బంది, ఇప్పుడీ సమ్మె అయిన తర్వాత రేపు ఆగస్టులో సిబ్బంది ఉద్యమం, తయారుగా ఉంది.

కాలేజీలలో టరం జీతం బాగా పెంచారని ఈ భారం భరించలేరని విద్యార్థుల వాదం. విశ్వవిద్యాలయం ఆర్థికస్థితి బాగా లేదని, ఈ జీతాల పెంపకంవల్ల లక్షరూపాయలు అదనంగా వస్తుందని, ఇతరరాష్ట్రాలతోనూ రాష్ట్రంలో నివిగతా విశ్వవిద్యాలయాలతోనూ పోల్చితే ఇక్కడ విద్యార్థుల జీతాలు తక్కువేనని, అదీగాకప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ మొత్తం పెంచితేజీతాలు పెంచడం విరమిస్తామని విశ్వవిద్యాలయం అధికార్ల ప్రత్యుత్తరం.

జీతాలు పెంచితే బాధపడాల్సింది తలిదండ్రులు. వారి తరపున వకాల్తా పుచ్చుకొన్నారే అనుకుందాం. దానికి ఇంత పెద్దఎత్తున ఆందోళన చేయడం, ఒక వైపు ముఖ్యమంత్రి తానీవ్యవహారం సర్దుబాటుచేస్తానని విద్యామంత్రి విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఒక పరిష్కారం కుదురుస్తారని హామీ ఇచ్చినప్పటికీ, సహనం కోల్పోయి దౌర్జన్యాలకు దిగడం విద్యార్థుల తప్పు. ఇదివరలో లక్నో, బనారస్ విశ్వవిద్యాలయాల మాదిరిగానే ఇప్పుడు జంట నగరాల విద్యాలయాలన్నీ మూసివేశారు. దీనివల్ల బాధపడాల్సి వచ్చేది విద్యార్థులేగదా! జీతాల గొడవ

(58-వ పేజీ చూడండి)

మనమూ మన దేహస్థితి

డా॥ గాలి బాలసుందరరావు

కంఠవ్యాధులు

గత వ్యాసములో నాలుకనుగురించి, దాని నిర్మితీ ధర్మమును వ్యాధులనుగురించీ తెలుసుకున్నాము. నాలుక వెనుక భాగమునుండి ఫేరింక్సు (Pharynx) ప్రారంభం అవుతుంది. ఇది గరాటీ వంటి ఆకారముగల నిర్మితి. ఇది వెడల్పయిన ముందు వైపున, నాసికారంధ్రముల వెనుక భాగముతోను, క్రింద బుగ్గల మధ్యనవుండే నోటితోనూ కలిసి వుంటుంది. తోకవంటి క్రింది భాగము, ముందున్న (Trachea) ట్రాకియా అనే శ్వాసనాళముతోనూ ఈసొఫెగస్ (Oesaphagus) అనే నాళముతోనూ కలిసివుంటుంది. నోటితోనూ, నాసికా రంధ్రముల ద్వారానూ పీల్చబడిన గాలి ట్రాకియా ద్వారావూపిరితిత్తులలోకి పోతుంది. నోటిలో నమలబడిన ఆహారం ముద్ద అయి మింగబడి, ఈసొఫెగస్ ద్వారా ఉదరములోవున్న కడుపులోకి పోతుంది. ట్రాకియా మొదటి భాగము శబ్దపేటిక (Larynx) నిర్మితిని గురించి యిదివరకే కొద్దిగా తెలుసుకున్నాము. శ్వాసకోశరోగములను గురించి చర్చిస్తున్నప్పుడు ఫేరింక్సు వ్యాధి విశేషములను మళ్ళీ విపులంగా చర్చిస్తాను.

మింగడం అన్నది చాలా సంక్లిష్టమయిన కార్యము. ఫేరింగ్సు ముందువైపున, దానిపై అంచునుంచి కొండ నాలుక వ్రేలాడుతూ వుంటుంది. పెలెట్ అనే అంగిలి వెనుక భాగము, ముందువైపు కఠినంగా వుంటుంది. వెనుకవైపు మెత్తగా వుంటుంది. ఈ మెత్తని ప్రదేశములో కొన్ని కండరములు ఉన్నవి. ఈ భాగమే ఫేరింగ్సుముందు భాగంతో కలిసి వుంటుంది. ఈ మెత్తని ప్రదేశమును క్రమ్మివుండే మ్యూకస్ మెంబ్రేను పెరుగుదలవల్లనే కొండ నాలుక యేర్పడుతుంది.

ట్రాకియా నోటిని 'గ్లాటిస్' అంటారనీ, దానిమీద వుండే మూతవంటి నిర్మితిని 'ఎపిగ్లాటిస్' అంటారనీ ఇదివరకే చెప్పను. ఆహారం ముద్ద ఫేరింగ్సు వెనుకవున్న ఈసొఫెగస్‌లోకి పోయేటప్పుడు పైనవున్న నాసికారంధ్రముల వెనుక ద్వారంలోకీ, క్రిందవున్న గ్లాటిస్ లోకీ పోవడానికి వీలుంటుంది గదా. ఇల్లా జరగకుండా కొండ నాలుక మెత్తని పేలెట్ వెనుకభాగము (Soft Palate) నాసికారంధ్రములను మూసివేస్తుంది అల్లాగే ఎపిగ్లాటిస్‌ను గ్లాటిస్‌ను మూసివేస్తుంది గ్లాటిస్ మీదగా ముద్ద క్రిందికి జారిపోతుంది.

శిరోనరములనుగురించి యిదివరకే వివరించాము. ఈ నరములు మెడుల్లా అబ్లాంగేటా అనే మెదడు క్రింది భాగమునుండి ఆరంభిస్తవని చెప్పను. నాలుకకూ, ఫేరింక్సుకూ పోయే గ్లాసొఫెరింజయల్ శిరోనరం ద్వారానూ, కొద్ది ట్రైజెమినల్ అనే 5 వ శిరోనరం ద్వారానూ ఫేరింగు, ఫేలెట్ భాగములలోవున్న కండరముల సంకోచ వ్యాకోచములు జరుగుతవి. ట్రైఫాయిడ్, మెనింజైటిస్, పోలియో మయెలైటిస్‌వంటి విషజ్వరములలో ఈమెడుల్లా అబ్లాంగేటా అనే మెదడు భాగము వ్యాధిగ్రస్తమైనప్పుడు మింగడం సాధ్యంకాదు. కొండ నాలుక నాసికా రంధ్రములను మూయదు. ఎపిగ్లాటిస్ గ్లాటిస్‌ను మూయదు. నోట్లో పోసిన ఆహారం ముక్కులలో నుంచి వస్తుంది. లేక ట్రాకియా ద్వారా వూపిరితిత్తులలోకిపోయి దగ్గు అయినా వస్తుంది. దగ్గులేని స్థితిలో నెమోనియా అయినా వస్తుంది. అల్లాగే డిఫ్తీరియా అనే వ్యాధిలో ఒక పొర అడ్డంపడి, ఈసొఫెగస్‌లో కండలుగాని, ఫేరింగ్సు చివర భాగంలో కండరములుగాని బిగుసుకుపోయినప్పుడు ఆహారం ఎగదన్ని ముక్కువెంట నోటివెంట తిరిగివస్తుంది. ఎపిగ్లాటిస్ గ్లాటిస్ మూయడమే కాకుండా, లేరింగ్సులోవున్న శబ్దరజ్జువులు కూడా ఒకదానితో ఒకటి ఆనుకుని అన్ని కణములను శ్వాసకోశంలోనికి పోనీయకుండా ఆపుతవి.

పైన కొండనాలుక, క్రింద నాలుక వెనుక భాగము దగ్గరనుంచి ఆరంభమై లేరింక్సు క్రింది భాగము, ఈసొఫెగస్ ప్రారంభము వరకు వున్న ప్రదేశం అతి ముఖ్యమైనది. జీవిత కార్యక్రమానికి అతి ముఖ్యములయిన ఆహారసేవనము శ్వాస కార్యక్రమము ఈ ప్రదేశం ద్వారానే జరిగిపోతవి.

ఫేరింక్సులో పై నిర్మితులేకాక, ఇంకా కొన్ని నిర్మితులు కూడా వున్నవి.

నోరు తెరిచి నాలుకచాచివున్నప్పుడు నోటి వెనుక భాగంలో, నాలుకకు వెనుక భాగానికి రెండు ప్రక్కలా, నాటక రంగంలో సైడ్‌కర్టెన్లలాగా రెండు మ్యూకస్‌మెంబ్రేను పొరలూ, వాటి మధ్యనవున్న ఖాళీ ప్రదేశంలో ఎండు ద్రాక్షపళ్ళవంటి రెండు నిర్మితులూ కనిపిస్తవి. ఈ నిర్మితిని టాన్సిలు అంటారు.

టాన్సిలు లింపు గ్రంథులలోవుండే టిష్యూవంటి వస్తువుచే యేర్పడ్డది. ఒకే రకమయిన జీవకణముల సముదాయమును టిష్యూ అంటారనియు యిదివరకే చెప్పను. ఈ లింఫాయిడ్ టిష్యూ ప్రధాన ధర్మము శరీరానికి హానికరము అయిన వస్తువులూ, క్రిములూ శరీరంలో ప్రవేశించినప్పుడు, వాటిని జల్లించి అరికట్టడం, కాలువకు అడ్డంగావున్న వలలో చేపలు ఇరుక్కుని పోయినట్టు లింపు గ్రంథులలోనూ, ఇటువంటి వస్తువుతోనే యేర్పడి ఇతర నిర్మితులలోనూ క్రిములు, హానికర పదార్థములూ యిరుక్కుని వికృతి పొంది, విసర్జించబడతవి. ఈ లింఫాయిడ్ టిష్యుతో తయారయిన నిర్మితులు శరీరంలో చాలా చోట్ల వున్నవి. ఫేరింగ్సులో 5, 6 ప్రదేశములలో ఈ వస్తువు ముద్దలుగా కనిపిస్తుంది. టాన్సిలు కనిపించే చోట వున్నది. ఇతర లింపాయిడ్ నిర్మితులు కంటికి కనుపించవు. వాటిని చూడాలంటే కొంత శరీర పరిజ్ఞానమూ, కొన్ని పరికరముల సహాయమూ కావాలి. చెవి, ముక్కు, కంఠం వ్యాధులలో నైపుణ్యం సంపాదించిన వారికిగాని ఈ భాగములను చూడడం పరిశీలించడం సాధ్యంకాదు.

నోటిలో కనిపించే అతి ముఖ్యమైన లింఫాయిడ్ నిర్మితి. టాన్సిల్ కొండనాలుక వెనుక వైపున నాసికా రంధ్రముల ప్రక్కన లింపాయిడ్ ముద్దలు వున్నవి. వీటినే 'ఎడినాయిడ్సు' అంటారు.

టాన్సిలును దాచివుంచే మూకస్ పొర తడిక వెనుక నుంచి, మధ్య చెవినీ, ఫేరింక్సునూ కలిపివుంచే ఈ 'యూస్టేషియన్' నాళము ద్వారము వున్నది. ఈ ద్వారమును చుట్టి మరొక లింఫాయిడ్ ముద్ద వున్నది. నాలుక వెనుక భాగములో, దానిపై పొర క్రింద కొన్ని ముద్ద లున్నవి. ఇవికాక, నాలుక వెనుక భాగంలో కొండనాలుకక్రింద, బుడిపెలు బుడిపెలుగా లింఫాయిడ్ టిష్యూముద్దలు వున్నవి. ఫేరింక్సు వెనుక గోడను క్రమ్మివున్న మ్యూకస్‌పొరలోనూ, కొద్దిగా ఈ ముద్దలు వున్నవి. ఇవన్నీ వలయాకృతిగల నోటి అంతర్ద్వారమును చుట్టి, ఉంగరంలాగా వుంటవి. వీటిని వాల్డేయర్ అనే శాస్త్రజ్ఞుడు కనుక్కున్నాడు. అందుకని ఆ లింపాయిడ్‌వలయమును ఆ శాస్త్రజ్ఞుడి పేరిట వాల్డేయర్ వలయము అంటారు.

ఈ లింఫాయిడ్ నిర్మితులన్నింటిలోనూ టాన్సిలులు ఎడినాయిడులు చాలా ముఖ్యములైనవి.

టాన్సిలులో ఒక్క లింపోయిడ్ టిష్యూ

(58 వ పేజీ చూడండి)

"తెలుగు వెలుగు" పోటీ బహుమతి వ్యాసం - రు. 50/-



తెలుగు వెలుగులు-76

సంఘ సంస్కర్తలనగానే రాజరామమోహనరాయ్, వీరేశలింగం పంతులు వీరిద్దరి తర్వాత చెప్పుకోవలసినవాడు గిరీశమేనేమో ననుకుంటాను నేను. కాకపోతే విధవా వివాహాలనుగురించి, 'ఏంటీనాచ్ ప్రాబ్లెమ్' గురించి దంచేసి తెగ ఉపన్యాసాలివ్వడంలో అర్థమేమిటనిపిస్తుంది.

'జగమెరిగిన బ్రాహ్మణునకు జందెం బేల' అన్న సూక్తి తెల్సికూడా జందెప్పోగు మెడలో ఉంచుకున్నాడంటే ఎందుకు 'పొటోగరావు' డబ్బుకు వచ్చిన బంట్రోతుతో అబద్ధమాడి గాయత్రిని సాక్ష్యం ఉంచడానికి కాకపోతే?

"వాణినారాణి" అని చెప్పుకున్న కవి తర్వాత "నాతో మాట్లాడమే ఒక ఎడ్యుకేషన్' అని చెప్పుకు తిరగ్గలిగిన మొగాడేడీ, గిరీశం తప్పితే?

తెల్లపంచీ, తెల్లలాల్చీ, తలమీద 'సైకిల్‌కాప్' పెట్టి అనిపించకుండా, పొడుగుకాకుండా సన్నమే ననిపించుకునే ఆ రూపంలో ఎంత ఆకర్షణ లేకపోతే 'బండముండ' పూటకూళ్ళమ్మ, 'గాజుపూస' మధురవాణి 'ప్యూర్‌డయమెండ్' బుచ్చమ్మల కెందుకంత వ్యామోహం? సమ్మోహం? రామప్పంతుల్లాంటి వాళ్ళెప్పుడో 'గిరడు, గిర్త' డంటూ, పిలిస్తే పిలిచేగాక, గిరీశం పంతులుగార్కి ఎంత పేరు, ఎంత ప్రతిష్ఠ! అందుకేగా హైద్రాబాద్ నవాబుగారు నెలకి వెయ్యి హాళిసిక్కా లిస్తామని హమేషా తమతో ఉండమని ఆహ్వానించారు? మిన్ను విరిగి మీదపడ్డా చలించని ఈ మేరు సమధీరుడికి మధురవాణి మంచకిందదాక్కోడం ఒక లెక్కా! పతివ్రత పూటకూళ్ళమ్మ చీపురు దెబ్బలు తనకు తగలవలసినవి రామప్పంతులుకి అంటింపజేసి తన బుద్రనిశితమని నిరూపించుకున్నాడు. 'ఇలాంటి లంజల్ని నన్నడిగితే పాతిక మందిని కన్యాదానం చేతును' అంటాడు మంచకింద రామప్పంతులుతో. అంతకు తగినవాడేననిపిస్తుంది. వెంకుపంతులుగారి చేత దేహశుద్ధి, పూటకూళ్ళమ్మచేత చీపుర: దెబ్బలు, మధురవాణివల్ల చివాట్లు తప్పించుకుందుకు మొహం వేలేసిన 'షేక్స్పియర్'తో చదువు మిషపెట్టి విజయనగరం వదలి కృష్ణరాయపురంలో తిష్ట వేసినాడు. ఇంతకన్నా అవకాశవాది ఎవరైనా ఉన్నారా అని నా అనుమానం.......పొగడక తప్పదు కూడా.

'మీ కిష్టమైనదేది' అని ఏ పత్రికా విలేఖరేనా ప్రశ్న వేశాడా, గిరీశంగార్ని—చిన్న మాట విసుర్తారంతే. 'ఎయంగ్ బ్యూటిఫుల్ విడో'. దేవీకొట్టు మిటాంఖుకన్నా, మధురవాణి అధరంకన్నా, మధురం అయినది మరొకటిలేదు. ఆయన జీవిత సర్వస్వం దానికే అంకితం చేస్తాడేమో అనిపిస్తుంది. తన టొబాక్కో పనిషత్తులో 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అని శాసించారు. చమకాన్ని సులువుగా తయారు చేసి; 'చేగోడీచమే! గేదె పెరుగూచమే!' అని వల్లించ గలిగినారు వీరి కాలంలో......

'మనవా శ్శుట్టి వెధవాయలోయ్!' అన్న గిరీశం గారి వాక్యం ఏనాటికి నిజంకాదు? ప్రభుత్వం మొదలు ప్రజలదాకా ముఠాతత్వాలు రాజుకుంటున్న ఈ ప్రజాస్వామ్యంలో గిరీశం వాక్యం కావ్యంగా మారుతుంది.

సెలవల్లో వెంకటేశం పాఠాలమాట దేవుడెరుగుకానీ, బుచ్చమ్మకు ప్రేమ పాఠాలు మాత్రం చెప్పాడు నిస్సందేహంగా. తన 'లవ్‌ఫీవర్' కోసం ఏ కాలేజీ కుర్రాడు చొరవగా నూతిలోకి దుంకి వెంకమ్మను రక్షించినట్లు రక్షించగలుగుతాడు? ఊహా లోకంలోకి ఎరగడంలో యూరీ గగారిన్‌ను మించిపోతాడు మన గిరీశం. ఆలూలేదు, చూలూ లేదు కొడుకుపేరు సోమలింగం అన్నట్లు ఇంకా విధవా వివాహాల ప్రయోజనమే తల కెక్కని బుచ్చమ్మకు, వాళ్ళ పిల్లల్ని వెంకటేశం బండిమీద పెట్టి ఆడించటం బహుషోగ్గా వర్ణిస్తాడు 'ఆశావాది' గిరీశం.

పెళ్ళికి తరలి వెళ్ళినప్పుడు సమయం చిక్కించుకుని బండి మార్చుతోవ పట్టిస్తాడు బుచ్చమ్మతో సహా. పాపం! చివరకంతా అభాస అయింది! అయినా చెక్కు చెదరడు గిరీశం. 'ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్ఝగింపరు' అలాగే గిరీశానికి ఫలితంకాదు కావలసింది. చివరకు 'నిరాశావాది'గా మారక, 'డామిట్ కథ అడ్డం తిరిగింది......" అని నిష్క్రమిస్తాడు.

ఇదే ఏ శరత్తు నవలలోని పాత్రో అయితే, తాగుడు మొదలైన దురభ్యాసాలు అలవర్చుకోవడం, చివరకు ఏ రోగంలోనో అంతమవడం మనకు తప్పనిసరిగా అవుపిస్తుంది. వీటికి అతీతుడు గిరీశం. ఫలితం గురించి ఆశించక పాటుపడడం ఎంత గొప్ప! అటువంటి వాళ్ళిప్పుడు లేనేలేరు.

అందుకే పొగలు "ఏంటీనాచ్" రాత్రి 'ప్రోనాచ్' అయినా, అప్పుడప్పుడు పూటకూళ్ళమ్మతో చీపురుకట్ట సరసంలో ఇరుక్కున్నా, మధురవాణి ఇంట్లో మంచంకింద దాక్కున్నా, బుచ్చమ్మ ప్రేమ విషయంలో కథ అడ్డం తిరిగినా, గొప్పవాటు మహర్షి, జ్ఞానీ, శిష్యుల్ని సురేంద్రనాథ్ బెనర్జీ అంత వాళ్ళని చెయ్యగల్గినవాడూ అవటం వల్ల తెలుగు వెలుగుగా దీపిస్తాడు గిరీశం నామనో పథంలో.......

★

శ్రీ ఎం. వి. రాఘుస్వామి
(చింతపల్లి)

నిస్వార్థంగా అర్పించుకున్నాను

శ్రీమతి ఆచిలద్లాపం



త్రలుపు తెరుస్తూనే మ్రాన్పడిపోయింది. చైతన్యమే నశించింది. సర్వలోకమూ శూన్యమై, కటికచీకటై, ఆ చీకట్లో ఆ రెండుకళ్ళూ మాత్రమే ప్రకాశిస్తున్నాయి—

ఆమె సంభ్రమానికి చకితుడయ్యాడు—అమాయకంగా దిగ్భ్రమతో నిండిన ఆ కనుల లోతు అతనికి అందలేదు—అరవాలిన ఆ కనులలోని అందాలు మాత్రమే గతంలోని అనుభూతులను, స్ఫురణకు తేగా, చిరునవ్వుతో "నేను వచ్చాను" అన్నాడు—

ఆ కంఠస్వరానికి ఆమె ఈ లోకంలోకి వచ్చింది. నెమ్మదిగా అడుగులు వెనుకకువేస్తూ "రా!" అంది. కూర్చున్నాడు—

ఆమె తల వంచుకుని ఎదురుగా నిల్చుంది.

మాటలే కరువైనాయి. తలఎత్తి ఎదురుగా చూడటానికికూడా భయం—

భయమా? కాదు— చూడాలనే బలీయమైన కాంక్షని అణచివేస్తూ తన తలని పైకి ఎత్తనీయని ఈ భావానికి ఏమని పేరుపెట్టాలో?

"నువ్వు ఇలా అవుతావనుకోలేదు"—

అతని సానుభూతి—ఆమె తెల్లనివస్త్రాలు అతని హృదయాన్ని కలచి వేసాయి. ఏదో ఆశతో ప్రతీక్షతో ఆమె కనులలోకి చూశాడు—ఆ చూపు లామెహృదయానికి గుచ్చుకొన్నాయి. ప్రయత్నంమీద కనులను ప్రక్కకు త్రిప్పింది.

"అవును! చాలా ఆలస్యంగా వచ్చావు—"

ఈ మాట లతనికి కొరడాదెబ్బలు—తల ఎత్తలేని సవాలు— తనలో దాగిన పిరికితనాన్ని వెక్కిరిస్తున్నాయి—

అతని చెక్కిళ్ళు ఎర్రనయ్యాయి. రోషాన్ని అణచుకుంటూ, తల పైకెగురవేసి "దయచేసి గతాన్ని తవ్వకు—"అన్నాడు—జాలిగా ఆమె ముఖం లోకి వెతుక్కుంటున్నట్లు చూశాడు—

ఆమెమూర్తి గంభీరమయింది. స్థిరంగానే సమాధానమిచ్చింది.

"ఆ ఉద్దేశం నాకు లేదు. నే నెప్పుడూ వర్తమానంలోనే జీవిస్తాను"—

అతనికి సరిగా అర్థంకాలేదు—

తన ఎదురుగా విరాగినిలానిలుచున్న ఆ తరుణిలో అలనాటి పదహారేళ్ళ చిలిపిమరదలి ఆకారమే అతనికి కన్పిస్తూంది—

ఒక్కసారి ఆమెను తనహృదయానికి గాఢంగా హత్తుకుని తనలో లీనం చేసుకోవాలన్నంత ప్రబలమైన ఆవేశం కలుగుతూంది.

అయినా ఆమె తనచుట్టూ తానేదో గిరిగీసుకుని నిలబడినట్లూ ఆ గిరి తాను దాటలేనట్లూ భావన కలుగుతూంది.

"కొంచెం మంచినీళ్ళియ్యి శారదా!"

చివరకు మాట్లాడగలిగిం దది. దాహమయి కాదు—అంతకంటె ఏం మాట్లాడాలో తెలియక—ఆ వంకతోనయినా తనకు దగ్గిరగా వస్తుంది కదా అన్న ఆశతో—

ఆమెచేతి వేళ్ళను కావాలనే తాకుతూ మంచినీళ్ళందుకున్నాడు—

శారద అలవోకగా నవ్వుకుంటూ తన చేతిని వెనక్కు తీసుకుంది—

మట్టిగాజులకు నోచుకోని ఆమె పచ్చని చేతిమీద బంగారుగాజులు తళుక్కుమన్నాయి. ఆ సన్నని వేళ్ళు ఒకనాడు తనజుట్టుతో అప్యాయంగా ఆడుకున్నాయన్న స్మృతి అతనిహృదయంలో చెయ్యిపెట్టి కెలికినట్లయింది—

ఆపరాని కాంక్ష అతనికళ్ళలో వెలిగింది.

ఒక అడుగు ముందుకు పడింది.

కాని, శారదకళ్ళు అతని నక్కడే ఆపేశాయి.

"కూర్చో బావా!" అతని ప్రయత్నం గమనించి శారద ప్రశాంతంగా అంది.

అత వింక సాహసించలేకపోయాడు. అయినా శారద కంఠస్వరమూ, ఆమె మూర్తీ, అతనికి పదేపదే ఎవరో శారద తనదేనని చెప్పినట్లయింది.

లోకంలో సర్వసాధారణంగా జరిగే విషయమే శారదవిషయంలోనూ జరిగింది.

శారద కలవారింటిబిడ్డ కాదు. ఆ కారణంగానే స్వంత మేనత్తకొడుకైనా వాసుని పొందలేకపోయింది — ఊహలు తెలిసిననాటినుండి పెంచుకున్న మమతలూ, అనుబంధాలూ ఒక

శారద కనులలో సుడులు తిరుగుతున్న నీరును చూసి వాసు అదిరిపడ్డాడు. అప్పటికైనా అతడు ఆమెను అర్థం చేసుకున్నాడా?

నొక దుష్టముహూర్తంలో విచ్ఛేదమయి, ఎవరికి వారుగా, ఏమీకానివారుగా—అయిపోయారు.

అప్రయత్నంగా కొంగుతో శారద కళ్ళు తుడుచుకుంది—

అది గమనించిన వాసుమనసు ఉయ్యాల లూగింది. గబాలున అనేశాడు.

"హమ్మయ్య! నా ఉనికిని నీ మనసు ఇప్పటికి గుర్తించిందన్నమాట!—"

"బావా!" చాలాసేపటికి శారద అన గలిగింది. "నీ ఉనికిని నాహృదయ మేనాడూ ఏ క్షణమూ మర్చిపోలేదు. అక్కడ నీ ఉనికి ఎప్పుడూ స్థిరంగానే ఉంది" వాసు సంతోషంతో తలక్రిందులయ్యాడు.

"నాకు తెలుసు శారదా! ఆ ధైర్యంతోనే ఇవాళ మళ్ళీ నీ దగ్గరకు రాగలిగాను"—

శారద సమాధానం చెప్పలేదు. కాస్త తటపటాయించి మళ్ళీ వాసే అన్నాడు—

"ఇంక నాతో వచ్చెయ్యి శారదా! అంటే నన్నపార్థం చేసికోకు—నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

శారద ఉలిక్కి పడింది. ఆశ్చర్యంగా వాసు కళ్ళలోకి చూసింది.

"ఏమిటి వాసూ! ఇప్పుడా!? ఇప్పుడు నన్ను పెళ్ళిచేసుకుంటావా? మతిపోయిందా?"

"కాదు శారదా! నిజంగానే చెపుతున్నాను నువు లేకుండా బ్రతకలేను—నా మాట విను శారదా! నిండు వయసులో ఉన్నావు. జీవితాన్ని వ్యర్థం చేసుకోకు—పాతపగలు మనసులో పెట్టుకోకు"

ఆవేశంతో చెప్తున్న వాసుకు శారద మధ్యలోనే అడ్డుపడింది.

"పగా!? పగ ఎవరిమీద వాసూ? నేను హిందువుల పిల్లని. కర్మసిద్ధాంతంమీద నాకు నమ్మకం ఉంది. నా కర్మకు నేను ఎవరినీ నిందించను. ఇక నువ్వు చెప్పింది కూడా అసంభవం"

వాసు అదిరిపడ్డాడు. అతని అభిమానం గాయపడింది.

"అసంభవమా? ఎందుకని?"

"ఎందుకేమిటి? నేను బాల్యవితంతువునా? లక్షణంగా అయిదేళ్ళు కాపురం చేశాను. ఆయన్ని మనసారా గౌరవించి ప్రేమించాను. ఆ స్మృతులు నాలో ఇంకా చెరిగిపోలేదు. ఇంకొకరి భార్యగా నన్నూహించుకోవటమే నాకు బాధగావుంది. ఆ ప్రసక్తి ఎత్తకు వాసూ!....."

శారదనోటినుండి ఈ మాటలు వినడం వాసుకి చాలా కష్టమనిపించింది. రోషంగా వెళ్ళిపోయాడు.

శారద బరువుగా నిట్టూర్చి ఒక్కసారి కళ్ళు తుడుచుకుంది—వెళ్ళిపోతున్న వాసుతో "అప్పుడప్పుడు కనిపించు బావా!" అంది.

ఆ క్షణంలో రోషంగా వెళ్ళాడేకాని, తనమనసుని నిగ్రహించుకోలేకపోయాడు. అనుక్షణమూ "ఎప్పుడైనా కనిపించుబావా!" అన్న శారద ఆహ్వానం అతని చెవులలో గింగురుమంటూనే ఉంది.

ఉండబట్టలేక మళ్ళీ శారదను కలుసుకున్నాడు. శారద ఆప్యాయంగా మాట్లాడింది. అన్నీ చేసింది. కానీ పెళ్ళిప్రసక్తి రాంగానే మూతి ముడుచుకు కూర్చుంది. ఇలా నాలుగైదుసార్లు జరిగింది. వాసు అభిమానం పూర్తిగా గాయపడింది. వాసు అవమానింపబడ్డట్లుగా భావించుకున్నాడు. ఇక శారదముఖం చూడకూడదని ఒట్టుపెట్టుకున్నాడు. ప్రలోభాలని అణచుకుని ఆ చాయలకు పోకుండా తననుతాను నిగ్రహించుకున్నాడు.

శారద ఇంచుమించు ప్రతిరోజూ వాసుకోసం ఎదురు చూస్తూనేఉంది. శ్రీరామునికోసం శబరిలా.

శబరి పళ్ళూ నీళ్ళూ రోజూ సిద్ధంగా ఉంచుకుని గుమ్మంలో నిలబడిఉండేదట—ప్రతీక్షతో....

తనూ.....

రోజులూ వారాలూ నెలలూ గడిచి పోతున్నాయి. ప్రతిరోజూ శారద వాసుకోసరం ఎదురు చూస్తూనే ఉంది.

వాసు రాడు. నిరాశతో కళ్ళు మూస్తుంది.

ఒకనాడు శారదహృదయ మెందుకో కీడును శంకించింది. వాసును చూడాలనేకోరిక తీవ్రతరమైంది—వాసు రూంకి వెళ్తే!?......తన ఆలోచనకి తనే ఉలికిపడింది. గుండెలు దడదడలాడాయి.

అయినా ఆరాటాన్ని అణచుకోలేక రూంకే బయలుదేరింది.

అక్కడ కనబడిన దృశ్యానికి శారద మ్రాన్పడిపోయింది.

గది అంతా చిందరవందరగా మురికిగా ఉంది. ఒక మాసిన పక్కమీద నీరసంగా వాసు పడుకుని ఉన్నాడు.—బహుశా ఏ జ్వరమైన వచ్చి ఉండవచ్చుననుకుని దగ్గరకు వెళ్ళి నుదుటిమీద చెయ్యివేసింది. నుదురు కాలిపోతోంది. ఆమె స్పర్శకు వాసు కళ్ళు తెరిచాడు—

"శారదా!" అన్నాడు ఆశ్చర్యంగా—

దాచుకోవాలన్నా దాగని ఆనందం అతని కన్నులలో కదలాడింది.

కాని వెంటనే గత స్మృతులు స్ఫురణకురాగా ముఖాన్ని గంభీరంగా మార్చుకుని "నువ్వెందుకు వచ్చా విక్కడికి?" అన్నాడు—

"నిన్ను చూడాలని" అంది శారద—

వాసు కొంచెం లేవడానికి ప్రయత్నిస్తూ శారదముఖంలోకి చూస్తూ "నన్ను చూడ

(47-వ పేజీ చూడండి)

టి. వి. సీతారామమ్మ

గారాబం

“ఎవరైనా వృద్ధిలోకి వచ్చారంటే వారిని చూచి ముఖ్యంగా ఆనందించేది వారి తల్లిదండ్రులు. ‘ఏవమ్మోయ్ మావాడికి నెలకు రు. 400 లు జీతం” అని సగర్వంగా నలుగురితోనూ చెప్పి సంతోషిస్తుంది ఆ తల్లి. ‘ఒక్కడైనా మాణిక్యంలాంటి వాడు’ అని అందరూ మెచ్చుకుంటారు. తన బిడ్డ దురభ్యాసములకు లోనైనాడని తెలిస్తే తండ్రికంటే ఎక్కువగ పరితపించేది అతని తల్లి. కష్టపడి కని, పెంచిన తల్లి, తన బిడ్డలు వృద్ధిలోకి రావాలని, గొప్ప పేరు సంపాదించాలని, ఉద్రూతలూగుతుంటుంది. ఆమె కోర్కె సఫలం కావడం, కాకపోవడం అనేది వారి పెంపకం మీద ఆధారపడి ఉంటుంది.

‘కనంగానే సరిపోయిందీ, పెంచారు చూడు ఆ పిల్లలను—ఛీ, ఛీ, ఉత్త గడుగ్గాయి వెధవలు—ఒక్కడికీ పొట్ట పొడిచినా అక్షరం ముక్క రాదు. ఎందుకూ పనికిరాని చవటలు ....’ ఇత్యాది దూషణ (భూషణ) లు మనము తరచు వింటూనే ఉంటాం.

చిన్నతనంలో పిల్లలు బుద్ధిమంతులని గాని, పోకిరివాండ్లని గాని, పేరు సంపాదించారంటే ఆ గౌరవం ముఖ్యంగా వారి తల్లికే చెందుతుంది. తండ్రి మటుకు అందుకు బాధ్యుడుకాడా అంటే అతడు కూడ బాధ్యుడే కాని అది కొంతవరకు మాత్రమే. అతడు ఇంటి యజమాని, పోషకుడు. కుటుంబ పోషణకై పనిచేసి డబ్బు సంపాదించి, తన విధ్యుక్తధర్మాన్ని నిర్వహిస్తాడు. అటువంటివానికి రోజులో తన బిడ్డలతో గడిపే కాలం చాల కొద్ది. ఆ కాస్సేపూ, వాళ్లతో సరదాగా గడపడానికి సరిపోతుంది. ఆ కొద్ది సేపటిలోనైనా అతడు తన పిల్లల తప్పులను దిద్దడానికి ప్రయత్నించాలి. అది చేతకాకపోతే కనీసం వాళ్లకు చెడ్డ అలవాట్లు నేర్పకపోతే మేలే. కొంతమంది పిల్లలు తుంటరిపనులు చేస్తుంటే చూచి ముచ్చట పడుతుంటారు. ఆ ముచ్చటే వాండ్లు పెద్దయిన తరువాత వీరికి శోక కారణంగా పరిణమిస్తుంది.

‘ఒరే బుజ్జీ, అమ్మను కొట్టు. వాళ్ల అబ్బాయిని తిట్టు’ అని చిన్నపిల్లలకు చెడ్డ అలవాట్లు నేర్పే తండ్రులను చూస్తూనే ఉంటాము. ఈ విధంగా పెరిగిన పిల్లలకు తల్లిదండ్రులపై గౌరవము ఉండదు. తత్కారణంగా వీరు తమ తల్లిదండ్రులను కడు హీనంగా చూస్తారు.

పిల్లలు చెడిపోవడానికి ముఖ్యకారణము గారాబమే. పిల్లలను గారాబంగానే పెంచాలి. కాని అది హద్దుమీరినట్లయితే కొంప మునుగుతుంది. ఎవరి మీదైతే గంపెడాశ పెట్టుకొని కడు గారాబంగా పెంచుతారో తుదకు వాండ్లే ఎందుకూ పనికిరాని తుంటరులుగా తయారవుతారు.

చిన్నతనంలో పిల్లలు చేసే తప్పులను వెంటనే సరిదిద్దాలి. పసిపిల్లలులే, వాళ్లకేం తెలుసు అని అశ్రద్ధచేస్తే అవే క్రమంగా పెద్దవై వారి జీవిత పతనానికి కారణభూతములు అవుతవి. ‘ఏమండోయ్ మీ అబ్బాయి మా చంటివాణ్ణి కొట్టాడండీ” అనిన పితూరీ విన్నప్పుడు తల్లి ఆ పిల్లవాడికి బుద్ధి చెబితే మరల వాడు ఆ పని చెయ్యడు. అట్లుగాక ‘లేకలేక మాకొక్క నలుసు పుడితే ఎందుకమ్మా మావాణ్ణి చూస్తే కండ్లల్లో నిప్పులు పోసుకుంటావు? మా వాడసలే నోరూ వాయీ లేనివాడు. బొత్తిగా ఒకరి జోలికి వెళ్లనే వెళ్లడు’ అని సపోర్టు చేసిందా, ఆ పిల్లవాడు తల్లి గారాబంవల్ల తుంటరిగా తయారవుతాడు.

పిల్లలు సాధారణంగా పెద్దలవద్ద కన్న, వారి స్నేహితుల వద్దనే ఎక్కువ విషయాలు నేర్చుకుంటారు. మనం స్వయంగా మన పిల్లలకు చెడ్డ అలవాట్లు నేర్పకున్నా వారు తమ స్నేహితులవద్ద నేర్చుకొన్నవాటిని త్వరలో పోగొట్టాలి. వీలయినంతలో మన పిల్లలను ఇతరుల ఇండ్లకు పోనివ్వకుండా ఉంటే మంచిది. అట్లని వాండ్లకు ఇల్లు ఒక జైలులాగా తయారు కాకూడదు. వాండ్లు ఆడుకోడానికి తగిన ఆటవస్తువులు వగైరా మనం కొని ఇవ్వాలి.

చిన్నపిల్లలకు బడికి వెళ్లేటప్పుడు డబ్బులు ఇవ్వడం కొన్ని ఇండ్లలో అలవాటు. పిల్లలకు డబ్బులు ఇవ్వడంమూలాన వారికి మనం కొన్ని దురభ్యాసాలు నేర్పుతున్నట్లవుతుంది. అందువల్ల వారికి డబ్బులు బొత్తిగా ఇవ్వకూడదని కాదు. మనము ఇచ్చిన డబ్బులవల్ల బిడ్డ చెడిపోకుండా కడు జాగ్రత్త తీసుకోవాలి. అతడు ఆ డబ్బులను ఏవిధంగా ఖర్చు చేసిందీ కనుక్కోవాలి. తనతోటి విద్యార్థి బీడీ త్రాగడం చూచి వీడుకూడ, అది ఎలా ఉంటుందో చూద్దామని ఒక బీడీ త్రాగుతాడు. క్రమేపీ బీడీలు అలవాటు అవుతవి. తదనంతరం సిగరెట్లు కూడా. చిన్నతనం నుండి పొగ త్రాగుట అలవాటయితే ఆ పిల్లవాడు ఎంత ఆరోగ్యంగా ఉంటాడు? ఏమాత్రం అభివృద్ధిలోకి రాగలుగుతాడు?

గారాబం కొందరిని నిరక్షరాస్యులనుగా చేస్తుంది. ‘నెయ్యి కారెట్లు పెట్టాలి .... కారెట్లు కొట్టాలి’ అంటారు. దండించవలసినపుడు నిష్పాక్షికంగా దండించాలి. ‘మా నాయనే, మా బుజ్జే’ అని నెత్తిన ఎక్కించుకోవడం పొరపాటు. సాధారణంగా పిల్లలు బడికి వెళ్లడానికి మారాం చేస్తారు. ‘అబ్బ. పోనిద్దూ, వాడు ఇప్పటినుంచీ చదివి, ఏం ఎమ్మే ప్యాసవుతాడా? చాల్లే నాముందు వాడిని కొట్టవద్దు. ఒరేయ్ అమ్మ కొడితే నాతో చెప్పు. నేను చూచుకుంటాలే’ అనే తలితండ్రులు చాల మంది ఉన్నారు. తత్కారణంగా పిల్లవాడు చదువు దొంగ అవుతాడు. కొన్నాళ్ల తర్వాత తండ్రే స్వయంగా చదువుకోమనినా వాడు చదవడు. నానా హంగామా చేస్తాడు. ఇక వాడిని కొట్టవలసి వస్తుంది. పిల్లలు తుంటరులై వారి భావి జీవితాలు నాశన మవుతున్నా వారిని దండించే సామర్థ్యం లేక అట్లా గాలికి వదిలేసి ‘పోనీ ఎవడి ఖర్మ వాడిది’ అని మెట్టవేదాంతం మాట్లాడుతుండే తల్లిదండ్రులను మనం అనుదినమూ చూస్తూనే ఉంటాము.

కొందరు తల్లిదండ్రులు, గారాబంచేత, తమ పిల్లలకు చదువు చెప్పలేక ట్యూషనుకు టీచరును కుదురుస్తారు. ఆ మేష్టరుకు కొన్ని షరతులు పెడతారు. ఆ పిల్లవాడి తల్లి, ‘మేష్టారూ, వీళ్ల నాయన నేను ఏది చెప్పినా వినిపించుకోడు. చూడండి ఈ పసి వెధవకు ఎందుకు చెప్పండి ఇప్పటినుంచే ఈ చదువు. వీడంటే నాకు పంచప్రాణాలూను. వీడిని చూస్తుంటే మా నాన్న జ్ఞాపకం వస్తుంటాడండీ. వెధవచదువు రాకపోతుందిట గానీ, వాడిని మట్టుకు కొట్టకండి’ అంటుంది తన కొడుకుమీద ప్రేమ ఒలకబోస్తూ—వాడి భావిజీవితంలో నిప్పులు పోస్తున్న విషయం గమనించకుండా. ఇటువంటివాండ్లు అసలు ట్యూషను పెట్టించడం దేనికి? ఇదొక స్టంటు. ‘మావాడికి ట్యూషను కూడా చెప్పిస్తున్నాము’ అని గర్వంగా నలుగురితోనూ చెప్పుకోడానికి మాత్రమే. పెద్దవాండ్లకు పిల్లల సైకాలజీ అర్థంకాకపోయినా, పిల్లలు మటుకు పెద్దవాండ్లను సులభంగా అర్థం చేసుకోగలరు. తల్లి సపోర్టువల్ల, పిల్లవాడు ట్యూషను టీచరుమీద చాడీలు చెపుతాడు. బిడ్డమీది గారాబంకొద్దీ, ట్యూషనుమాస్టరు బర్తరఫ్ చేయబడుతాడు. ఈ విధంగా పెరిగిన పిల్లలు ఎంతమాత్రం అభివృద్ధిలోకి వచ్చేదీ ఊహించవచ్చు.

పిల్లలు బడికి పోతున్నామని ఎక్కడనైనా ఆడుకొనడానికి వెళ్లుతుంటారు. ఆవిధంగా చెడు సహవాసములపాలవుతారు. కనుక తల్లి, పిల్లవాడు బడికి వెళ్లినది లేనిది, ఆరోజు బడిలో ఏమి చెప్పినది వానిచేతనే చెప్పించాలి. అప్పుడు ఆమె ప్రతిపక్షపు లాయరు, పిల్లవాడు ముద్దాయి అవుతారు.

తల్లి కాస్త తీరిక చేసుకొని రోజుకు కనీసం ఒక గంటసేపైనా వాడివద్ద కూర్చుని చదివించాలి. చదువు విషయమై పిల్లవాడికన్నా, వాని తల్లి ఎక్కువ శ్రద్ధ చూపాలి. నిజంగా ఆ గంటసేపూ, తను నేర్చుకుంటున్నట్లు నటించాలి తల్లి. (ఇది తండ్రికైనా అనువర్తిస్తుంది.) అంతేగాని ఆమె రేడియో పెడుతూనో లేక పక్కింటి పిన్నిగారితో ఆమె కోడలి ముచ్చట్లు మాట్లాడుతూనో ‘ఒరేయ్. చదవరా వెధవ. పెద్దవాళ్ల ముచ్చట్లతో నీకేం పని. ముచ్చట్లంటే సరి చెవి కోసుకుంటావు. ఆ శ్రద్ధ చదువుమీద చూపరాదూ’ అని ఏ ఇరవైయేండ్ల కుర్రాడితోనో చెప్పినట్లు చెపితే వాడు చదువుతాడా? ఇది అయ్యేదేనా? ముచ్చట్లంటే ఎవరికి ఇష్టం ఉండదు? అందులోనూ పసిపిల్లలకు మరీ జాస్తి. కనుక తల్లులు పిల్లల చదువు విషయమై ఈ జాగ్రత్త తీసికోవడం చాల అవసరం.

పిల్లలను సాధారణంగా విసుక్కోకూడదు. వారిని రాత్రిపూట పక్కలో పడుకోబెట్టుకొని రామాయణ భారతములలోని కథలూ, నవ్వు పుట్టించే చిన్నిచిన్ని కథలూ అవీ చెబుతూ ఉండాలి. ఆవిధంగా చేయడంవల్ల పిల్లలకు తల్లిదండ్రులమీద ఎనలేని ప్రేమ, గౌరవము కలుగ్తవి. అపుడు వారి తల్లిదండ్రులను కాదని అడుగు ముందుకు వెయ్యలేరు. వారి చెప్పుచేతల్లో నడుస్తారు. వాళ్ళు అభివృద్ధిలోకి వచ్చి, చిన్ననాటి నుండి తమకోసం కష్టపడిన తల్లిదండ్రుల కష్టానికి తగిన ఫలితాన్నిచ్చి వారిని ఆనందవీధుల గ్రుమ్మరునట్లు చేస్తారు. ★



వనితా వాణి

చిలకా—గోరింక

వేమూరి సుబ్బలక్ష్మిగారు వ్రాసిన "చిలకా—గోరింకా" అనే వ్యాసం చక్కగాఉంది. మాదీ అన్యోన్య దాంపత్యమే. మావారు ఇంటివిషయాలు ఏవీ పట్టించుకోరు. అలా అని వూరుకోరు. వారు చేస్తే నాకెంతో తృప్తి ఆనందం వుంటాయి. కాని వారిని షాపింగుకి వెడదామన్నా, సినిమాకు వెడదామన్నా ఇష్టపడరు. ఏమిటో మనస్తత్వం అర్థంకాదు. సుబ్బలక్ష్మిగారు వ్రాసినట్లు ఎంత అన్యోన్య దాంపత్యమైనా "దీపపు క్రీనీడల్లాగ" చిన్న చిన్న అసంతృప్తులు వనితలను వెన్నాడతాయి. సుబ్బలక్ష్మిగార్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

శ్రీమతి ద్విభాష్యం బాలాత్రిపురసుందరి (విశాఖపట్నం)

*　　*　　*

వేమూరి సుబ్బలక్ష్మిగారు వ్రాసిన చిలకా—గోరింకా వ్యాసము చాలా బాగున్నది. రచయిత్రి మగవారి మనస్తత్వాలు గురించి విపులంగా వ్రాసారు. వారు వ్రాసినట్లు మగవారు స్నేహితులతోటి సినిమాలుకి షాపింగుకి, వెళ్ళుతారు. అదే ఆడవారు తీసుకొని వెళ్ళమంటె వారి పురుషత్వానికి భంగం అన్నట్లు మాట్లాడుతారు. ఆడవారికి కూడా కొన్ని సరదాలు వుంటాయని మగవారు గ్రహించిననాడు ఈ భేదాభిప్రాయాలు రావు.

డి. వి. లక్ష్మి (అమసాం)

*　　*　　*

వేమూరి సుబ్బలక్ష్మిగారు వ్రాసిన "చిలక—గోరింక" అను వ్యాసము చాలా బాగుంది. రచయిత్రి వ్రాసినట్లు సినిమా అంటేనే మగవారికి ఎందుకో అంత చిరాకు. మనముందర 'ఊ' అనేసి సమయానికి రారు. సుబ్బలక్ష్మిగారు మగవారికి బుద్ధి వచ్చేటట్లు వ్రాశారు. వారికి నా కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.

వి. కన్యాకుమారి (పెరంబూర్)

*　　*　　*

సోదరి వేమూరి సుబ్బలక్ష్మిగారి 'చిలకా—గోరింక' వ్యాసము చదివాను. బాగానే ఉంది. సుబ్బలక్ష్మిగారి తండ్రి తమ్ముడి పిల్లలకు రకరకాల చీరెలుకొని, తల్లికివివస్తువుతేలేదంటేనేనమ్మలేకుండా ఉన్నాను. చిలకా—గోరింకలలా సంసారం గడవాలంటే సుబ్బలక్ష్మిగారి తల్లిగారు ఆమె భర్తను ఒక చీర కొనితెమ్మని ఎందుకు అడగలేదు?

కె. లలితకుమారి (వేటపాలెం)

*　　*　　*

శ్రీమతి వేమూరి సుబ్బలక్ష్మిగారు వ్రాసిన "చిలకా—గోరింకా" కేవలం రచయిత్రిగారి స్వానుభవాన్ని చాటుతోందే గాని, తోటి వనితలకు విజ్ఞానం కలిగించేదిగా లేదు. "ఒక బుద్ధిమంతుడు భార్యను సినిమాహాలుదగ్గర దిగబెట్టి, మళ్లా సినిమా పూర్తయ్యేవేళకి వెళ్లి తీసుకువస్తాడుట" ఇది ప్రత్యేకంగా వ్యాసంకోసం కల్పించబడ్డట్టుంది. సినిమాహాలుదగ్గర దిగబెట్టి, మళ్లా హాలు దగ్గర నుంచి తీసుకురాగలిగిన భర్త హాలులో మూడు గంటలసేపు కూర్చోలేక పోడు. పోనీ హాలులోకి వెళితే స్నేహితులు ఎగతాళి చేయవచ్చనుకుంటే, ఇంటినుంచి హాలుకి వెడుతుంటే ఎగతాళి చేయరా!

ఎం. పద్మజ (విజయవాడ)

*　　*　　*

మావారితో సినిమా కెళ్లటమంటే ఒక గొప్ప ఘనకార్యాన్ని సాధించినట్లే. అటువంటిది నిన్న కోరిందే తడవుగా మావారు సినిమాకి బయలుదేరారంటే నా ఆశ్చర్యానికి అంతులేదు. తర్వాత తెలిసింది అందుకు కారణం శ్రీమతి వేమూరి సుబ్బలక్ష్మిగారి "చిలకా—గోరింకా" వ్యాసం అని. అందుచేత మన వనితాలోకంలో ప్రచురించే వ్యాసాల ప్రభావము చిలకలమీదకంటె గోరింకల మీదే ఎక్కువగా పనిచేస్తున్న దన్నమాట. రచయిత్రికి నా ధన్యవాదాలు.

ఎం. ప్రమీల (మానికొండ)

*　　*　　*

వేమూరి సుబ్బలక్ష్మిగారి చిలక—గోరింకలు బాగున్నాయి. కాని, రచయిత్రి ఒక పొరపాటు చేశారు. తనమీద అలిగిన భర్తను ఆధారంగా చేసుకొని మొత్తం మగవారి కందరికీ ఇల్లంటే బందిఖానాలాగ ఉంటుందని వ్రాశారు. తప్పుదారులు తొక్కుతున్న యువతీ యువకులను సరిదిద్దవలసిన బాధ్యత నేటి రచయితలమీద ఉంది. వారి రచనలన్నీ ఇందుకొరకై ఉపయోగపడాలే కాని, న్యూనతపరిచేవిగా ఉండరాదు. పైగా రచయిత్రి అన్యోన్యంగా ఉంటున్న ఆలుమగల్లో తీరని కోరిక లుంటాయనుల్లేఖించారు. అది పొరపాటు. ఆలు మగలు ఎంతో అన్యోన్యంగా ఉంటున్నప్పుడు వారి కోరిక లెందుకు తీరవు? రచయిత్రి నా అభిప్రాయాలతో ఏకీభవిస్తారని ఆశిస్తాను.

ఎస్. ఎ. ఎస్. రాధ (రాజమండ్రి)

అభిమానం

బోయిన కనకదుర్గగారి అభిమానం అనే వ్యాసము అసభ్యముగా ఉన్నది. ఇటువంటి వ్రాతలు ఎందుకు అచ్చువేసి పాఠకులను విసిగిస్తారో తెలియటంలేదు. బి. వీరమ్మ (చల్లపల్లి)

*　　*　　*

బోయిన కనకదుర్గగారు వ్రాసిన "అభిమానం" అనే వ్యాసం నాకు నచ్చింది. ఆ వ్యాసంలో వారు వివరించిన కొన్నివిషయాలు చాల సమంజసంగానే వున్నాయి. దురభిమానంగలవారికి ఈ వ్యాసం గుణపాఠం కాగలదు. శ్రీమతి వి. లక్ష్మి (గొల్లపాలెం)

*　　*　　*

బోయిన కనకదుర్గగారు వ్రాసిన "అభిమానం" అను వ్యాసము చాలా బాగుంది. ప్రస్తుతం జరుగుచున్న విషయాలు కళ్ళకు కట్టినట్లు వ్రాసినారు.

కిషోర్, జహీర్, చిష్టి (ఆకివీడు)

వంటయింటి ప్లాను

శ్రీమతి యశోదాదొరస్వామిగారు ఇచ్చిన వంటఇంటిప్లాను బాగానే వుందిగాని, పాల అల్మారు, పాత్రలబల్ల వంటగదిలోఉంటే బొగ్గులబూడిద ఎగిరి ఆ వస్తువులలో పడతాయి. గనుక భోజనాలగదిలో కంచాలు, పాత్రల బల్ల, పాలబీరువా ఉంటే మంచిది. వంటఇల్లు రెండుపూటలా కడుగుతూ వుండాలి గనుక సామాను చాలా తక్కువగా వుంచుకోవాలి. డబ్బాలుకూడా వేగం మాసిపోతాయి. అటూ ఇటూ తిరుగుతూ వంట చేస్తే ఆరోగ్యానికి మంచిది. పొట్ట పెరగదు. మంచి వ్యాయామం. గనుక భోజనాలగదిలో అవుసరమైన సామాను వుంచుకోవాలి. రుబ్బురోలు వంటఇంట్లోఉంటే తేమ చేరుతుంది. పప్పులు రుబ్బితే నీరు నిలువ అయి కంపుకొడుతుంది. సూర్యరశ్మి తగిలేచోట రుబ్బురోలుండాలి. కుళ్ళిన టమాటో వగైరా వేయుటకు తొక్కులడబ్బా పెట్టమన్నారు. ఆ డబ్బా కొంతచోటు ఆక్రమించుటే కాక, తొక్కులు వంటఇంట్లో కూడబెట్టుట ఎల? నిలబడి తిన్నెలపై వంట చేయగలిగినవారు ఏప్పటి తొక్కులు అప్పుడు పారవేయలేరా? ముఖ్యంగా గమనించవలసిందేమంటే వంట చేయునప్పుడు అవుసరమైన సరుకు కొల్తగా తెచ్చుకొని ఆ డబ్బాలు మూతపెట్టి యధాస్థానంలో ఉంచాలి. వంట అయిన వెంటనే ఎక్కడి సామగ్రి అక్కడ సర్దిపోయి, ఇల్లు కడిగి ముగ్గులు పెడితే కన్నులకింపుగా ఉంటుంది. మంచి అలవాటు.

కర్రి కమలమ్మ, బిలాస్పూర్, (మధ్యప్రదేశ్)

*　　*　　*

ఆమధ్య "లావు, సన్నాల"ను గురించి తెగవ్రాస్తే నిజంగా ఎవరయినా సలహా ఇస్తారనుకుంటే ఎవరూ ఇవ్వకుండానే ఆ శీర్షిక ఆపేశారు. దయచేసి యిప్పుడయినా సోదరీమణులు మాలాంటివారికి సలహాలిస్తారని ఆశిస్తాం.

పి. పద్మజ, కమల, లీల (విజయవాడ)

★



ఆదర్శాలు అంతర్యాలు

సింగరాజు లింగమూర్తి

జరిగిన కథ

పోలయ్య అంటే ఆ ఊళ్ళో చాలా మందికి అభిమానం, గౌరవం. కొంతమందికి అతనిపై అయిష్టం కలగడానికి కూడా కారణం లేక పోలేదు. నరసింహప్ప చలమయ్య ఒకరినొకరు సాధించుకోవాలని ఎత్తులు వేస్తూ ఉంటారు. నరసింహప్ప పోలయ్యను తన పక్షంలో చేర్పించటానికి ప్రయత్నిస్తాడు. పోలయ్య రాజారావుని తప్ప మరెవ్వరినీ లెక్క చెయ్యడు. రాజారావు అతనికి చదువు చెబుతూ ఉంటాడు.

5

ఆ రోజు ఆగస్టు పదిహేను!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన శుభదినం! వాడ వాడలా దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలు జరుపుకొంటున్నారు.

నరసింహప్ప ఆ సంవత్సరం జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షుడిగా ఎన్నిక కావడంవల్ల ఊళ్లో స్వాతంత్ర్య దినోత్సవం మరింత కన్నులపండువుగా జరిగింది.

ఊరంతా జాతీయపతాకాల తోరణాలు కట్టారు. దాదాపు అన్ని ఇండ్లమీద భవనాలమీద మువ్వన్నెల జండాలు రెపరెపలాడుతున్నాయి.

ఊళ్లో జరిగే బహిరంగసమావేశానికి అధ్యక్షులుగాను, ఉన్నత పాఠశాలలో జరిగే 'స్కూలుడే' ఉత్సవానికి ప్రారంభకులుగాను మంత్రిగారిని ఆహ్వానించారు.

ప్రభాతసమయంలోనే పతాకారోహణం జరపాలి కాబట్టి మంత్రిగారు కారులో క్రిందటి రాత్రే వచ్చి నరసింహప్పకు అతిథిగా ఉన్నారు.

స్వాతంత్ర్యోత్సవం ప్రభాత భేరీతో ప్రారంభమైంది.

మంత్రిగారు వచ్చారుకాబట్టి తెల్లవారేప్పటికి పోలీసుబందోబస్తు కూడా వచ్చింది.

అక్కడ జరిగే ఉత్సవాల ఫోటోలు తీయడానికి ఒక ప్రభుత్వ ఫోటోగ్రాఫరుకూడా వచ్చాడు.

ఎనిమిదిగంటలకల్లా జండావందనం ప్రారంభమైంది. మంత్రి జాతీయపతాకను ఎగురవేశారు. ఉన్నత పాఠశాల బాలికలు 'జనగణమన' గీతం పాడారు.

జాతీయపతాక విశిష్టతనుగూర్చి మంత్రి క్లుప్తంగా వివరించారు.

సాయంత్రం జరిగే బహిరంగసమావేశంలో మంత్రిగారు ముఖ్యవిషయాలపై ప్రసంగిస్తూ

రనీ, అందరూ తప్పకుండా రావాలనీ నరసింహప్ప అక్కడ చేరినవారికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలో జరిగే ఉత్సవానికి మంత్రిగారితోపాటు నరసింహప్ప కారులో బయలుదేరాడు.

పాఠశాల తరఫున మంత్రికి, జిల్లాకు పార్టీ అధ్యక్షుడైన నరసింహప్పకు ప్రధానోపాధ్యాయుడు స్వాగతం చెప్పి వేదికమీదకు ఆహ్వానిస్తూ "శ్రీ రాజారావుగారుకూడా దయచేసి వేదికమీదకు రావాలి" అన్నాడు.

నరసింహప్ప ముఖం వెలతెలపోయింది. ప్రధానోపాధ్యాయుడిని పక్కకు పిలిచి "నాకు ముందుగా చెప్పలేదేం — అతనుకూడా ఉపన్యాసమిస్తాడని" అన్నాడు.

"ఆయన మొదట్లో ఒప్పుకోలేదు. మంత్రిగారు వస్తారో రారో, రాకపోతే వారి స్థానంలో మిమ్మల్ని ఉంచి రాజారావుగారిని ఉపన్యాసకులుగా ఉంచవచ్చునని బలవంతం చేసేప్పటికి ఒప్పుకున్నారు. తీరా ఇప్పుడు వద్దంటే ఏం మర్యాదగా ఉంటుందండీ" అన్నాడు.

ఇంకేమీ మాట్లాడలేకపోయాడు నరసింహప్ప.

రాజారావును చూసేప్పటికి మంత్రిగారు సంతోషంతో లేచి "నీవా రాజారావ్ .... ఇక్కడ ఉంటున్నావా ? నీ ఇల్లు బంగారంకాను, ఒక్క ఉత్తరం ముక్కయినా వ్రాసేవుకావేం ?" అన్నారు.

"మీకు ఎన్నో వ్యవహారాలుంటాయి. నా ఉత్తరాలతో మీ సమయాన్ని పాడుచేయడం ఎందుకనుకున్నాను" అన్నాడు రాజారావు.

"నాన్నగారు కులాసా ?"

తలూపాడు రాజారావు.

వాళ్ల సంభాషణ వినేప్పటికి నరసింహప్ప ముఖం మారిపోయింది. కొందరికి రాజారావుమీద గౌరవం ఇనుమడించింది.

పతాకారోహణం జరిగాక ప్రధానోపాధ్యాయుడు వేదికమీదకు వచ్చాడు.

"ఈరోజు మనకెంతో సుదినం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పర్వదినం. మరొక ముఖ్య విశేష మేమిటంటే ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ మంత్రిగారు మా విజ్ఞప్తిని మన్నించి స్కూలు దినోత్సవాన్ని ప్రారంభించడానికి రావడం, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులైన నరసింహప్పదొరవారు ఈ సమావేశానికి అధ్యక్షత వహించడానికి అంగీకరించడం, మాధ్యమికపాఠశాలను ఉన్నత పాఠశాలగా చేయడానికి ఎంతో కృషిచేసిన విద్యాభిమానులు, దేశాభిమానులు అయిన రాజారావుగారు అడగంగానే ఉపన్యసించడానికి అంగీకరించడం. విద్యార్థులు, విద్యార్థినులు, తదితర గ్రామస్థులు నిశ్శబ్దంగా కూర్చోమని కోరుతూ, శ్రీ నరసింహప్పగారిని అధ్యక్షస్థానం వహించవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అంటూ ప్రధానోపాధ్యాయుడు నరసింహప్పకు, మంత్రికి, రాజారావుకు పుష్పమాలలు వేశాడు.

సమావేశం అయినతరువాత మంత్రి రాజారావును తనతోపాటు కారులో రమ్మనడంతో నరసింహప్పకు ముఖంలో నెత్తురుచుక్క లేకుండాపోయింది. మునసబు రాజారావు వంక చురచుర

(43 వ పేజీ చూడండి)



వంశీధార

రాటకొండ వసుంధరాదేవి

రవళివినినంత బరువెత్తు ప్రమద లెవరో?
యమున యొడ్డున బర్హిశిఖావతంసు
శ్యామసుందరు గొల్వగ సంభ్రమమున
వెడలు జ్యోత్స్నాభిసారికల్ వీరె కారొ!

కోపములు నవ్వులును సం
తాపము లావేశములును తరుణుల లావ
ణ్యాపగలో వీచికలై
గోపాలుని ప్రేమజలధిఁగోరి చెలంగున్.

జఘన భారము పదముల సొగసీక
అర్ధపథమున హత్తిన అడుగులును, వి
లాస వేణీ కుసుమ భార్యలౌల్యములును,
నిండుకుండలు తొణికిన నీటి బొట్లు
ప్రేమ రూపమ్ములై, నాకు దృశ్యమౌను!

* * *

వంచిన వంశి వలెన్ పై
పించియము నటింప నీరువిడిచెడు యంత్ర †
మ్మొంచి పడంతుల్ పరువిడ
వంచనమో యిది, 'యథార్థ' భావమ్మగునో!

† కుళాయి.

కవితా కింకిణి

బహుమతి పొందిన కవిత

పద్మశ్రీ

ఎడ్వాన్సు బుకింగు

వనితాలోకం వ్యాసం

ఏమిటే ఎడ్వాన్సు బుకింగు? రైల్వే బెర్తులకా, సినిమాలకా? కాదు కొన్ని మనువులకు, నిండు జీవితాలకే ఎడ్వాన్సు బుకింగు జరుగుతుంది. ఈ విషయంమీద చాలా రోజులనుంచి వ్రాయాలనుకుంటున్నా గాని, నచ్చనివారు విరుచుకుపడే ప్రమాదం శంకించి ఊరుకున్నా! 26—4—61 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో శ్రీమతి అన్నపూర్ణ గారి "సన్నిహిత బంధువర్గంలో వివాహాలు" వ్యాసం చూశాక నాకూ వ్రాయాలనిపించింది. అన్నపూర్ణగారు "దగ్గర" సంబంధాలు అని ఇతర విషయాలు ఆలోచించకుండా "కట్టబెట్టడం" మంచిదికాదు—అనిమాత్రమే చాలా సున్నితంగా సూచించారు. నేను దానినే నెగటివ్‌గా ఎక్స్‌ప్రెస్ చేయాలంటాను—ఎంతో సమర్థనీయమైన కారణాలుండీ, వధూవరులు తమంతట తాము నచ్చితేనే తప్ప దగ్గరసంబంధాలు చేయనే కూడదు—అని. అయితే అనాదిగా వస్తూ ఉన్న ఈ సాంప్రదాయం అంతటి అవాంఛనీయమైనదా—అని కొందరడుగ వచ్చు. దానికి ఒకటే సమాధానము—ఒకప్పుడు ఆదర్శప్రాయంగా భావించబడిన సతీ సహగమనం, బాల్యవివాహాలు ఇప్పుడు నిషేధింపబడ్డాయి. ఒకప్పుడు నిషేధింపబడిన వితంతువివాహాలు ఇప్పుడు ఆమోదింపబడుతున్నాయి. కాలానుగుణంగా సాంఘికాచారాలు మారుతూ ఉండాలి. అలాగే "దగ్గర సంబంధాలు" అనబడే ఈ నిర్బంధ వివాహబంధాలు కూడా ఇప్పుడు ఒక దురాచారం అయి కూర్చున్నాయి అని నిరూపించడమే ఈ వ్యాసం యొక్క లక్ష్యం.

మామ్మలు, బామ్మలు ఊసుపోక అడ్డాలలో బిడ్డలకుకూడా వరుసలు కల్పించి, 'ఇదిగోవే నీ మొగుడు" అనో, "హరి నీ ఇల్లు బంగారం గాను! పెళ్ళాం గిల్లేస్తే ఏడుస్తూ కూర్చున్నావటరా! నాలుగు తన్నక?" అనో, ఏ వయసుకి తగినట్టు ఆ వయసులో వాళ్లను ఆడిస్తూ "మొగుడూ, పెళ్ళాం" అనే భావన వారిలో అజ్ఞాతంగా నూరిపోస్తారు. ఇలాంటి ఊహలలోనే, పాపం ఆ పసివాళ్ళు ఆటలాడుకునేటప్పుడు, స్కూలుతో చదువుకునేటప్పుడు, ఇంకా కొంచెం పెరిగి జ్ఞానం వచ్చాకకూడా, అనేక మానసిక దుష్ప్రభావాలకు లోనవుతారు. వాళ్ళ మనసులు కలియకపోయినా, ఆటపాటల్లో ఓడిపోయినా, స్కూలులో పరీక్షలు తప్పినా, మంచిపేరు సంపాదించినా, చివరకు తమతమ స్నేహితులతో సన్నిహితంగా తిరిగినా, ఒకరిపై నింకొకరికి ఈర్ష్య, జుగుప్స, విముఖత ఏర్పడి చిరస్థాయిగా వర్ధిల్లుతాయి. ఇలాంటి యువతీయువకుల దాంపత్యం ఏవిధంగా సాగుతుందో వేరే వివరించ నవసరం లేదు. చిన్నతనంనుంచి కలసి మెలసి తిరగటంచేత ఒకరి లోటుపాటులు ఇంకొకరికి బాగా తెలియటంచేత, వాళ్లల్లో భార్యాభర్తలకు ఉండవలసిన సహజాకర్షణ, సహనం, క్షమ, గౌరవభావం లోపించి ఉడుకుబోతుతనం, చులకన భావం దెప్పిపొడుపులు, మొండితనం పెరుగుతాయి.

ఇక ఆర్థికఫలితాలు చూసుకున్నా ఇలాగే ఉంటాయి. ఇంటి ఆడుపడుచే ఆ ఇంటికి వియ్యపురాలైతే రెండు వైపుల పదునైన కత్తిగా చలామణి అవుతుంది. తనవాళ్ళకదా అని కట్నంలో ఏమాత్రం కన్సెషన్ చూపకపోగా సాధింపుల్లో పైవాళ్లకంటే పదిరెట్లు మించిపోతుంది. "ఒరే తమ్ముడూ! నువ్వేమో వాడికి (అల్లునికి) సైకిలు కొనిపెడ్తానని ఇంకా ఇవ్వలేదటగా! అందుకు వాడేమో జీతం అంతా ఖర్చుపెట్టేసి, ఏమిరా అని అడిగితే 'ఆఫీసు చాలా దూరం. సిటీ బస్సులకు, కాఫీ ఖర్చులకు జీతం అయిపోయింది' అని అంటాడురా. నేనెలాగ చచ్చేది? నీ ఇబ్బందులు ఎప్పుడూ ఉన్నవే! ఎక్కడో అప్పోసప్పో చేసి ఆ సైకిలుకాస్తా వాడి మొహాన పారేద్దూ" అని సానుభూతి చూపుతుంది. లేదా, "నువ్విస్తానన్న రేడియో ఇవ్వలేదని రోజూ అర్ధరాత్రివరకూ ఇల్లు చేరడు. ఏమని అడిగితే పబ్లిక్ పార్కులో పాటలు వింటూ కూర్చున్నా నంటాడు. ఈ మిష మీద వాడెన్ని తిరుగుళ్ళు తిరుగుతున్నాడో అని నా కొకటే బెంగ. అసలే చిక్కుల్లో ఉన్నావు. అలాంటివాడివి రేడియో ఇస్తానని ఎందుకు అన్నావు చెప్పు? వాడిప్పుడు నెత్తెక్కి కూర్చున్నాడంటే వాడి తప్పులేదు. ఏ నగో నట్రో పద్దుపెట్టు ఆ వైర్ల డొక్కు (రేడియో) ఒకటి వాడి మొహాన కొడ్తే నా బాధ పోగొట్టిన పుణ్యం నీకు దక్కుతుంది" అని బతిమాలుతుంది. లేదా, "ఆరువందలు డిపాజిట్ కడ్తే వాడికి మూడొందల జీతం వచ్చే ఉద్యోగం ఎవరో ఇస్తారన్నారట. సుజాతపెళ్లికి ఏమైనా నిలవచేసి ఉంటావు. దానిలోంచి సర్దుబాటు చేద్దూ! పెద్ద ఉద్యోగం అయితే నీ కూతురేగా సుఖపడేది?" అని హెచ్చరిస్తుంది. లేదా, "చూడవచ్చినవాళ్లంతా ఒకటే సొద—కోడలి ఒంట్లో వచ్చగా పది తులాలైనా లేవే—అని. నా మేనగోడలే అని చెప్పాలంటే నాకే చిన్నతనం కాదా? పోనీ నీవు చేయించే వరకు, ఒదిన చంద్రహారాలు దాని (కోడలి) మెడలో వేస్తే సరి. నేనేమైనా తినేస్తానాఏంటి?" అని సలహా ఇస్తుంది. ఇంకా వ్రాయాలంటే ఇలాంటి వెన్నో చాపకింద నీరులాంటి సాధింపులు. ఇక పెట్టిపోతల్లోకూడా అమ్మాయి ఒక్కర్తెకూ పెడ్తే సరిపోదు. ఆవిడ అత్తగారికి కూడ పెట్టాలి. ఇవి స్వల్పవిషయాలుగా పైకి కనిపించినా, మధ్యతరగతి కుటుంబాలు శాశ్వతంగా శిథిలమైపోవడానికి ఇవే కారణాలు.

సాధారణంగా ప్రతి ఇంట్లోను ఆడపిల్లల పాలిట ఎవరో ఒకరు దాపురించే ఉంటారు. తల్లి తమ్ముడో, అక్క మరిదో, ఒదిన అన్నదమ్ముడో మేనత్తకొడుకు సరేసరి. వీళ్ళెవరూ లేకపోతే తండ్రి స్నేహితుని కొడుకైనా ఉంటాడు ఎడ్వాన్సుగా బుక్ చేయడానికి. చావబోయే బామ్మ తృప్తి కోసమో, నూతిలో పడి చస్తానని బెదిరించే తల్లి

కోసమో, "చిన్ననాటి నుంచి ఇచ్చిన మాట తప్పేదిలేదు." అనే తండ్రి పట్టుదల మూలం గానో నోరులేని ఆడపిల్లలు దీనికి బలి అవుతారు. ఇవి కేవలం పెద్దవాళ్ల సెంటిమెంట్లమీదనే జరుగుతాయి. ఇతర విషయాలు ఆలోచించే ప్రసక్తే ఉండదు. తీరా ఆ పిల్లలు పెరిగి పెద్దవాళ్లయి, అనుకోనివిధంగా తయారైతే ఆ సంబంధం విడదీసుకొనడానికికూడా ఆ సెంటిమెంటే అడ్డు వస్తుంది. మేనరికాలు ఉంటుండగా పై సంబంధాలు చేయుదలుచుకుంటే మేనత్తలే కాకుండా, అమ్మలక్కల సంఘం కూడా ఒప్పుకోదు. ఎలాగో ఆ పై సంబంధాన్ని చెడగొట్టే సన్నాహాలు జరుగుతాయి. నిర్బంధం అనేసరికి సహజంగా ఎవరికైనా తిరుగుబాటుతత్వం పుడుతుంది. సరిగ్గా నా విషయంలో కూడా అలాగే జరిగింది.

నేను 8 వ తరగతి చదువుతున్నప్పుడే వరసకి మామయ్య అయ్యే అతనికి ఇచ్చి చెయ్యాలని నిశ్చయించుకున్నారట. ఆ "మామయ్య" పండుగలకు, శెలవులకు తరచుగా మా ఇంటికి వచ్చి పోతుండేవాడు. ఎందుకో (నన్నుచూసి ఓర్వలేక గాబోలు) నన్నెప్పుడూ విమర్శించి, ఉడికించి, ఏడ్పించేవాడు. నేను సంగీత పాఠాలు సాధనచేసుకుంటుంటే "చాలిద్దూ—నీ గంధర్వగానం, చెవులు చిల్లులైపోతున్నాయి" అని చీదరించుకునేవాడు. మోటుసరసం ఆడి నాచేత తిట్లు కూడా తినేవాడు. "ఒసేవ్, గిసేవ్" అంటుంటే నా వళ్ళు మండిపోయేది. మా "ముచ్చటలు" చూసి మా అమ్మ, నాయనమ్మ, మురిసిపోయే వారేమో గాని నాకు మాత్రం ప్రాణసంకటంగా నుండేది. నేను పెద్దదాన్నయాక కొంచెం తగ్గాడు గాని నన్ను మింగేసేటట్లు చూసేవాడు. మొదట్లో నేను అంతగా పట్టించుకోకపోయినా, రానురాను అతనిపై ఏవగింపు పుట్టింది; అకారణంగా, నాకు తెలియకుండానే !

నేను మెట్రిక్ పూర్తిచెయ్యగానే నామూలంగా ఇంట్లో ఒకమోస్తరు అంతర్యుద్ధం లేచింది.—పై చదువులకు వెళ్తానని నేను, అలాగ వీలు లేదు పెళ్లిచేస్తామని అమ్మ, నాయనమ్మ. నాన్నగారు ఒక చక్కని ఎత్తువేసి తగువు తీర్చారు. "మామయ్య" వాళ్లమ్మ ఒప్పుకుంటే చదివిస్తానన్నారు. మామయ్య ఒప్పుకుంటాడని ఆశ ఉన్నా వాళ్ళమ్మ సంగతే అనుమానంగా నుండేది. వాళ్లెలాగూ ఒప్పుకోరు కదా అని మా అమ్మ, నాన్నమ్మ సంతోషించి వూరుకున్నారు. నేను నాన్నగారిదగ్గరకు వెళ్లి "చదివించడానికి మీకు అభ్యంతరం లేనప్పుడు పై వాళ్ల 'పర్మిషన్' మనకెందుకు నాన్నగారూ ? నేను చదివి తీరుతాను. లేదా నాకీ పెళ్లే అక్కరలేదు." అని తెగించి చెప్పేసరికి నాన్నగారు "నీ కెందుకమ్మా ఆ చింత ? నేను పోయి వాళ్లను ఒప్పిస్తాను సరేనా ?" అని హామీ ఇచ్చారు. మా ఊరికి దగ్గర్లోనే ఒక కాలేజీ ఉంది. అందులో నా స్నేహితురాలు చదువుతూంది. అక్కడి కాలేజీ జీవితంగురించి కలలు కంటుండగా నాన్నగారు వచ్చారు. "వాళ్లను ఒప్పించాను గాని అమ్మా ! ఫలానా వూరిలోనే నీవు చదవాలని మామయ్య షరతు పెట్టాడు. నీవూ రైతే నేమిలే సరేనన్నాను" అన్నారు. (ఆ ఫలానా ఊళ్లో అతను బి. ఏ మూడవ సంవత్సరం చదువుతుండేవాడులెండి) ఎలాగో నా చదువు సాగుతుంది కదా అని సంతోషించాను. తర్వాత తెలిసింది అతని ఉద్దేశం ఏంటంటే, వాళ్లమ్మను అక్కడ పెట్టి సంసారం పెట్టి నన్ను కూడా వాళ్లింట్లో నుంచాలని అట. దీనికి మాత్రం నేను ఒప్పుకోలేదు. గరల్సు హాస్టలులో చేరేసరికి తన ఎత్తు మార్చుకొని హాస్టల్ దగ్గరగానే ఒక లాడ్జి తీసుకొని బస పెట్టాడు. అస్తమానం నన్ను కనిపెడ్తూ నన్ను ఎంత వెంబడించేవాడో నేను అంత తప్పించుకు తిరిగేదాన్ని. ఒకనాడు ఏమీ తోచక పార్కుకి పోయి కూర్చున్నాను. (మా రూం మేట్సు సినిమాకు వెళ్లారు.) అతను అక్కడికి దాపురించాడు. నేరుగా వచ్చి నా ప్రక్కనే కూర్చున్నాడు. నాకు ఎన్నడూ రానంత కోపం వచ్చేసినా, తమాయించుకొని, సాధ్యమైనంత సరళంగానే అన్నాను. "ఇదిగో మామయ్యా ! రేపట్నుంచి కాలేజీ గోడలమీద మన పేర్లు కనబడాలని సరదాగా ఉందా ? ఏమిటీ వేషం ?" "ఓస్ పోవే ! స్టేజెక్కి తైతక్క లాడితే లేని తప్పు, కాబోయే మొగుడితో కాసేపు కాలక్షేపంచేస్తే వచ్చింది కాబోలు" అన్నాడు తనవంక మూతి వెటకారంగా తిప్పుతూ ! (మా హాస్టలు వార్షికోత్సవంలో నేను వయొలిన్‌లో బహుమతి అందుకున్నాను. దానికి ఈ ఏడుపు). "గొప్ప మొగుడివే గాని, అయినప్పుడు చూసుకుందాంలే" అని చరచర వచ్చేశాను. అంతే ! అదే మావాళ్ళ చిన్నప్పటి నుంచి నిశ్చయించిన వివాహబంధానికి భరత వాక్యం. తర్వాత అదృష్టవశాత్తు మా వారితోనాకు పరిచయం కలగడం, పెళ్ళిజరగడంఅంతా కథల్లోలాగ, మా అమ్మా, నాన్నమ్మల కలతలతో కొంచెం కన్నీటితో, తర్వాత పన్నీటి జల్లులతో పూర్తి అయింది. మా సంబంధం చెడగొట్టాలని మా వారికి చాలా ఆకాశరామన్న ఉత్తరాలు నామీద వచ్చాయుట. (ఎవరు వ్రాసినవో వేరే చెప్ప నక్కరలేదు.) కాని, అన్ని సంగతులు నేను వారికి ముందుగానే తెలియజేశాను గనుక ఆయన ఇలాంటి ఉత్తరాలో, తగువులో వస్తాయని ఎదురు చూసేవారట.



ఇంతకూ నేను చెప్పబోయేది—అన్ని మేనరికాలూ ఇలాగే ఉంటాయని కాదు. నిజానికి మేనరికాల్లో ఎన్నో చక్కని సంసారాలుగా శోభిల్లినవి ఉన్నాయి కూడా ! ఈ వ్యవస్థమీద నాకున్న నిశ్చితాభిప్రాయాలు, నాలాగ ఇంకెవరికైనా ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు నా హాస్టలు మేట్సు అందరితో చర్చించాను. వాళ్లలో గురు మాత్రం ఈ వ్యవస్థలో చిక్కు వాళ్ళు. ఈ ఆరుగురిలో ఒక్కతె తప్ప త అయిదుగురూ "ఆఁ పోనిద్దూ! ఏం పెళ్లిళ్ళు ఏం సంబంధాలు ? మన ప్రారబ్ధం అప్పుడే పోయిందిగా ! ఏదో సుఖపడిపోతా మనుకో దేనికి ?" అన్నట్లు మాట్లాడేవారు.

అయితే ఇది కేవలం నిరర్థకం, అరిష్టదాయ అని నా ఉద్దేశం కాదు. ఎవరో ముకు మొహం తెలియని పరాయివాళ్లకంటే అం వాళ్ల కిచ్చుకుంటే అన్నివిధాల మేలు అని ము ళ్లంటారు. అది నిజమే ! గాని, వచ్చిన చిక్కం ఎక్కడంటే—కేవలం "అయినవాడు" సాకుతో ఎలాంటివాడైనా లెక్క చెయ్యకుం నిర్బంధంగా కట్టబెడ్తేనే !—ఇది మొదటి అనర్థ

ఇక రెండవది—ఎడ్వాన్సు బుకింగు. పిల్లల జ్ఞానం రాకముందే పెద్దవాళ్లు (తమ విలా కోసం, స్వంత ప్రయోజనాల కోసం) వాళ్ల వై హిక జీవితం నిర్ణయించేసి కూర్చోవడం. దీనివ ఎక్కువ నష్టపోయేది, బాధపడేది ఆడపిల్లలే ఎందుచేతనంటే మగవాడు తలిదండ్రుల నిర్బం నికి తలఒగ్గక ఎదిరించి తన ఇష్టంవచ్చిన అమ్మాయిని చేసుకోగలడు. కాని అలాగ చేయగలిగిన ఆ పిల్ల లెందరున్నారు ? అదీకాక, నిర్ణయించి సంబంధం ఉందికదా అని ఆడపిల్ల తలిదండ్రుల వేరే సంబంధప్రయత్నాలు చెయ్యక, పెళ్ళి రోజు కోసం కాసుక్కూర్చుంటారు. తీరా ఏదో ఒక కారణంచేత అది కాస్తా తప్పిపోతే ఇ చూడాలి వాళ్ల పాట్లు ! "అయిన సంబంధం ఉందికదా అది ఎందుకు తప్పిపోయింది ?" అని ఆకొత్త సంబంధంవాళ్లు సందేహంగా సాగదియ్యడం ఇంతలో ఆ అమ్మాయి వయసు మించడం నానా రభసకు పాల్పడుతుంది.

అందుచేత, శ్రీమతి సి. అన్నపూర్ణగారు వ్రాసినట్టు సన్నిహితబంధుత్వంమే ప్రధానాంశంగా తీసుకొని వధూవరుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా కట్టబెట్టకూడదు. కావలసిన యోగ్యతలు కలిగి, అన్నివిధాల తగినవాళ్లు అయినప్పుడు, పరస్పర అంగీకారం ఉంటే, అయిన సంబంధం చేయడం మంచిదే ! కాని ఇలాంటి సన్నిహిత సంబంధాలు మాత్రం పై సంబంధాల వలెనే పెళ్లివయస్సు వచ్చిన తర్వాతనే నిశ్చయించాలిగాని, వాళ్లకు జ్ఞానం రాకముందు కాదు. వధూవరులు వివేచనాపూర్వకంగా ఆలోచించి, పరస్పరాకర్షణకలిగి, సంసారసాంగత్యానికి తహతహలాడే తన్మయ తరుణంలో పెళ్లిమాటలు జరపాలి గాని, 'పుట్టుకతోనే నాకీ పీడ దాపురించి ఉంది' అని బాధపడి, కట్టబడడం వాళ్లకే కాక, వాళ్ల సంతానానికి, సమాజానికి కూడా శ్రేయస్కరం కాదు.

అందుకే—"ఇప్పటికీ నిలిచియున్న సాంఘిక దురాచారాలలో ఎడ్వాన్సు బుకింగ్ ఒకటి" అన డానికి సాహసిస్తున్నాను. ★



"కత్తిపట్టిన రైతు"లో పద్మిని, నంబియార్.



యం. యస్. యం. మూవీస్‌వారి
"కొరడావీరుడు"లో జానకి.

సంక్షిప్త వార్తలు

మరాటీ చిత్రాలకు రాష్ట్రస్థాయి బహుమతులు

ప్రతి యేడూ మరాటీ చలన చిత్రోత్సవం జరిపి వాటిలో ఉత్తమ చిత్రాలకు బహుమతులు రాష్ట్రస్థాయిలో ఇచ్చే పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం తమ తృతీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చినట్లు తెలుస్తోంది.

ఈ పథకంక్రింద మరాటీ చిత్రాలను ప్రదర్శించి నిపుణుల నిర్ణయానుసారంగా ఉత్తమ చిత్రానికి, దర్శకుడికి, ప్లేబాక్ గాయకునికి, రికార్డిస్టుకు, ఛాయా దర్శకుడికి, ఎడిటరుకు, కళా దర్శకునికి బహుమతులను ఇస్తారు.

రు. 250,000 లు ఖర్చు కాగల ఈ పథకం 1961—62 చిత్రోత్సవంతో ప్రారంభం కాగలదని తెలుస్తోంది.

జఫ్‌చాండ్లర్ మృతి దర్యాప్తు

జూన్ 18 న శస్త్రచికిత్సానంతరం మరణించిన ప్రసిద్ధ హాలివుడ్ నటుడు జఫ్ చాండ్లర్ నిర్యాణంపట్ల దర్యాప్తు జరిపించవలసిందిగా 150 మంది హాలీవుడ్ నటీ నటులు 'స్క్రీన్ ఎక్స్‌ట్రాస్ గిల్డును' కోరారు. టెలివిజన్ నటుడు శ్రీ ఫ్లింట్ వాకర్ నాయకత్వాన వీరు గిల్డుకు సమర్పించిన వినతి పత్రంలో ఇలా పేర్కొన్నారు.

" చాండ్లర్ మృతికి కారణాలు అశ్రద్ధ, అసమర్థత, పొరబాటులేనా? ఈ విషయమే నిజమైతే దీనికి తగిన చర్య తీసుకోవలసిందిగా గిల్డును అభ్యర్థిస్తున్నాం."

శ్రీ చాండ్లర్ అత్యవసర శస్త్ర చికిత్స చేయించు కున్నాడు. ఈ సందర్భంలో 55 పింట్ల రక్తాన్ని ఆయనకు ఎక్కించారు. నెత్తుటిలోకి విష ప్రయోగంవల్ల శ్రీ చాండ్లర్ మరణించారు—ఇది విజ్ఞప్తిదారుల వాదం.

తను శాయ శక్తులా శ్రీ చాండ్లర్‌ను రక్షించాలని ప్రయత్నించామని, ఈ పట్నంలో దొరికిన ప్రతి అధునాతన వైద్య సౌకర్యాన్ని శ్రీ చాండ్లర్‌కు కల్పించామని ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ అన్నారు.

సెన్సారుపై ఫిర్యాదుల దర్యాప్తు

చలనచిత్రాల సెన్సారు కట్టుదిట్టంగా



జగపతివారి "ఆరాధన" ప్రారంభోత్సవదృశ్యంలో సావిత్రిగణేశన్.

శీఘ్రంగా జరిగే విధానం గూర్చి తాము పరిశీలిస్తున్నట్లు కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ కేస్కర్ అన్నారు.

ఇటీవల పత్రికా విలేఖర్ల సమావేశంలో ప్రసంగిస్తూ సెన్సారింగ్ పద్ధతి గూర్చి వచ్చిన ఫిర్యాదులను విచారించే నిమిత్తం ఢిల్లీలో ప్రవీణులతో గూడిన ఒక సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కూడా డాక్టర్ కేస్కర్ వెల్లడించారు.

పాటలను పరిశీలించే నిమిత్తం హిందీ, ఉర్దూ భాషల్లో పండితులను సెన్సారుబోర్డులో నియమించటం సమాచార శాఖామంత్రి సంకల్పించిన చర్యలలో ఒకటిగా ఉంది.

చలనచిత్రపారిశ్రామిక ప్రతినిధులతో కేంద్ర మంత్రి, సెన్సారు విధానాన్ని గూర్చి జరిపిన చర్చలు సఫలం కాగలవన్న ఆశాభావంతో ఉన్నారు.

సెన్సారుబోర్డులో ఫిలిం పరిశ్రమకు చెందిన వారిని ఒకరిని నియమించే విషయం కూడా ఆలోచనలో ఉన్నట్లు డా. కేస్కర్ చెప్పారు.

చలనచిత్రపరిశ్రమ ప్రస్తుతం చిక్కుల్లో ఉన్నమాట వాస్తవమేనని, అయితే దీనికి కారణం సెన్సారు నిబంధనలే అనటం సరికాదని సమాచారశాఖ మంత్రి చెప్పారు.

పరిశ్రమలో ఉన్న ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని గూర్చి విచారణ జరిపించే విషయం కూడా ప్రభుత్వం ఆలోచించవచ్చునన్నారు.

చిత్ర వాణిజ్యమండలి సభ్యుల సౌహార్ద యాత్ర

దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి సభ్యులు జులై 30 వ తేదీనుండి, శ్రీలంకలో సౌహార్ద పర్యటన చేయబోతున్నారు. భారతదేశంలో తయారయ్యే సింహాళీ చిత్రాల నిషేధంవల్ల ఏర్పడిన పరిస్థితిని గూర్చి అక్కడి అధికార్లతో చర్చిస్తారట. ఈ యాత్రా బృందానికి శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్ నాయకత్వం వహిస్తారని తెలుస్తోంది.

దర్శక-నిర్మాత జంపన నిర్యాణం

సుప్రసిద్ధ దర్శక—నిర్మాత, రచయిత శ్రీ జంపన చంద్రశేఖరరావు జులై 4 వ తేదీన మద్రాసులో వారి స్వగృహంలో, హృద్రోగంవల్ల ఆకస్మికంగా మరణించారు. శ్రీ జంపన వయస్సు 49 సంవత్సరాలు.


శ్రీ జంపన 'వాలి సుగ్రీవ' చిత్రంతో తెలుగు చలన చిత్ర రంగానికి దర్శకులుగా పరిచయమయ్యారు. జంపనా పిక్చర్స్ అన్న సంస్థను స్థాపించి 'మేనరికం' చిత్రం నిర్మించి దర్శకత్వం వహించారు. నందీ పిక్చర్సు పక్షాన 'సౌభాగ్యవతి' చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇవిగాక రాజ్యం పిక్చర్సు 'హరిశ్చంద్ర', 'కృష్ణలీలలు', పి. వి. వి. యస్. యం. వారి భట్టి విక్రమార్క మొదలైన చిత్రాలు శ్రీ జంపన దర్శకత్వ ప్రతిభా విశేషాలకు నిదర్శనాలు.

చిత్ర రంగంలో ప్రవేశించక పూర్వం శ్రీ జంపన కళాశాల అధ్యాపకులుగా వుంటూ, కవితా వ్యాసంగంలో పేరు పొందారు.


కవిగా, కథాభిమానిగా, ఉత్తమ దర్శకుడుగా ప్రశస్తిగాంచిన శ్రీ జంపన ఆత్మకు శాంతి కోరుతూ వారి కుటుంబానికి మా సానుభూతి అందజేస్తున్నాం.



జై రామ్ ప్రొడక్షన్స్ సాంఘిక చిత్రంలో గుమ్మడి.



సారథీవారి ''కలసి ఉంటే కలదు సుఖం'' చిత్రంలో రామారావు, సావిత్రి.



పెద్దిభొట్ల సుబ్బరామయ్య

జరిగిన కథ

కాళిదాసు ఇంటి వరండాలో ఆరోజు తెల్లవారుజామున ఎవరో నెలన్నార నిండని పసిపిల్లవాణ్ణి విడిచి వెళ్ళారు. ఆ పిల్లవాణ్ణి చూచిన కాళిదాసుకు ఏమీ పాలుపోక తనమిత్రుడు పార్థసారధినిపిలిపించి, సలహా అడుగుతాడు. ఆ అనాథబాలుణ్ణి పెంచే భారం కాళిదాసునే వహించమని అతడు సూచిస్తాడు. వృద్ధురాలైన తల్లి తప్ప వేరేదిక్కులేని కాళిదాసు అందుకు మొదట సంకోచిస్తాడు. కాని ఆ మీదట అందుకు పూనుకోనక తప్పదు. ఆ నెత్తురుగుడ్డును అతడు పనిమనిషి అప్పలమ్మకు అప్పగిస్తాడు.

కాళిదాసు స్కూలు ఆవరణలో అడుగు పెట్టే సరికి బడిగంట 'గణగణ'మని మ్రోగింది. అంత వరకూ పిల్లల గోలతో, కేకలతో మార్మ్రోగుతున్న బడి అంతటా నిశ్శబ్దం వ్యాపించింది. క్లాసులలో హాజరు తీసుకుంటున్న టీచర్ల గొంతులు మాత్రం వినిపిస్తున్నాయి.

కాళిదాసు రిజిస్టరులో సంతకంచేసి 'టీచర్స్ రూమ్'లోకి వెళ్ళాడు. పనివున్నవారందరూ క్లాసులకుపోగా మిగిలిన కొద్దిమంది అక్కడ విశ్రాంతిగా కూర్చుని కబుర్లాడుకుంటున్నారు. కొందరు తర్వాతగంటలలో చెప్పవలసిన పాఠాలు చూసుకుంటున్నారు.

కాళిదాసు గదిలో అడుగుపెట్టగానే కిటికీ పక్కగా నుంచుని సిగరెట్టు కాలుస్తున్న పట్నాభి "రండి మహానుభావా! తమ రాకకోసమే ఎదురు చూస్తున్నాం" అన్నాడు. కాళిదాసు నవ్వి "ఏదన్నా టీపార్టీకి పిలుపు వుందా యేం? అలాంటిదేమైనా వుంటే, ఒంటరిగాణ్ణి, అందరికన్నా ముందుగా వొస్తాను" అన్నాడు. పట్నాభి పెద్దగానవ్వి "హారినీ! ఎంత చమత్కారం చేశావు? నీలాంటివాడితో మాట్లాడలేం బాబూ!! ముందరికాళ్ళకు బంధాలు వెయ్యడంలో నిన్నుమించినవా డీ ముల్లోకాల్లోనూ లేడు" అన్నాడు.

కుర్చీలో కూర్చుని అయిదవఫారం తెలుగు పుస్తకం చూస్తున్న రామనాథశాస్త్రి తాపీగా తలపైకెత్తి "నిజమే! కాని యిప్పుడు నిజంగా టీపార్టీ యివ్వవలసిన అవసరం కాళిదాసు కెంతయినావుంది. పూజలుచేసీ, ప్రదక్షిణాలుచేసీ పిల్లలకోసం కలవరిస్తున్న లక్షాధికారు లంతమంది వుండగా, కాళిదాసు శ్రమలేకుండా పననవండువంటి పిల్లవాణ్ణి సంపాదించాడు. టీపార్టీకి యింతకన్నా మంచి 'అకేషన్' వుండబోదు" అన్నాడు. అందరూ నవ్వారు. కాళిదాసు కుర్చీలో కూర్చుని యేమీ సమాధానం చెప్పలేదు.

పట్టాభి అతని దగ్గరగా వచ్చి కుర్చీమీద చేతులు వేసి నుంచుని "అదిసరేగాని కాళీ! నువ్వు ఏం చేద్దామని నిర్ణయించుకున్నావు?" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నతో అందరూ ఒక్కసారి తలలెత్తి కాళిదాసువంక చూశారు. అతడు నిదానంగా "మొదట్లో ఏ అనాధశరణాలయంలోనో వొదిలేస్తే మంచిదనుకున్నాను. కాని పార్థసారధిగారు చెప్పిన ఆలోచనే బాగున్నదని తరువాత అనిపించింది. మనం ప్రత్యేకంగా దీనికోసం కష్టపడవలసినదేమీ లేదు. పగలల్లా పనిమనిషి తీసుకుపోయి తన యింట్లో వుంచుకుంటుంది. గేదెపాలో, ఆవుపాలో పట్టి మళ్ళీ మా యింటికి తీసుకునివొచ్చి రాత్రిపూట కనిపెట్టుకుని పడుకుంటుంది. ఏదో అలా రెండు మూడు నెలలు గడిస్తే ఎవరికీ భారం అనిపించదు. నారుపోసినవాడు నీరుపొయ్యకపోడు. మన కృషి మనం చేస్తే తర్వాత వాడిఖర్మ వాడిది. వాడి నుదుట ఎలా వ్రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది" అన్నాడు.

అందరూ మౌనంగా విన్నారు. పట్టాభి కాస్సేపాగి "లోకనిందకు భయపడి, ఎవరో పెళ్ళి కాకముందే చెడినవాళ్ళు చేసివుంటా రీపని....." అన్నాడు. కాళిదాసు అతన్ని వారించి, "ఆవిషయాన్నిగూర్చి నే నసలు ఆలోచించదలచుకోలేదు. మనకు నిజం తెలియనప్పుడు, అనవసరంగా వూహాగానాలుచేసి లేనిపాపం కట్టుకోవటం దేనికి?" అన్నాడు. పట్టాభి మళ్ళీ మాట్లాడలేదు.

మూడవ పీరియడ్ అయింది. గంట కొట్టగానే అంతవరకూ నిశ్శబ్దంగావున్న పాఠశాల ఆవరణ అంతా రణగొణధ్వనితో నిండిపోయింది. బోనులోనుంచి బయటికివచ్చిన ఎలుకపిల్లలవలె విద్యార్థులందరూ మధ్యాహ్నం భోజనాలకు యిళ్ళకు బయలుదేరారు.

పట్టాభి కాళిదాసుతో "రావోయ్, అలావెళ్ళి ఫలహారంచేసి కాఫీ సేవించి వద్దాం" అన్నాడు. ఇద్దరూ 'టీచర్స్ రూమ్'లోనుంచి బయటికి రాబోతూవుండగా సీనియర్ తెలుగు టీచరు "వెధవలు...మరీ తెలివిమీరిపోతున్నారు....." అంటూ సణుగుతూ లోపలికి వచ్చాడు. పట్టాభి ఆగి "తెలుగు పండితులవా రెవరినో దీవిస్తున్నారే" అన్నాడు. ఆయన పేరు శంకరశాస్త్రి. ముతక ఖద్దరు లాల్చీ వేసుకుని అలాంటిదే పంచె కట్టుకుని వున్నాడు. ఆయన పట్టాభిమాటలు విని కళ్ళజోడు సవరించుకుని" నువ్వా పట్టాభీ! ఏమీలేదోయ్. ఫిఫ్త్‌ఫారం 'సి' కి వెళ్ళివొస్తున్నాను నేను. పాఠం మధ్యలో ఒక అడ్డగాడిద లేచి 'యీ పద్యంలో ఒక మాటకు మీరు అర్థం చెప్పలేదండీ' అని అడిగాడు. తలుచుకుంటే ఆశ్చర్యంగావుంది. మరీ బరితెగించిపోయారోయ్ యీ రోజుల్లో పిల్లలు......" అన్నాడు.

కాళిదాసు పెద్దగా నవ్వి "చాలా బాగుంది. అయితే మీరింతకూ వాడికేం చెప్పారు?" అని అడిగాడు. ఆయన వారివెంటనే బయటికి నడుస్తూ "సమాధానం బాగానే చెప్పానులే. మళ్ళీజన్మలో యిలాంటి ప్రశ్నలు వెయ్యకుండా వాత పెట్టాను. అని జవాబు చెప్పాడు. కాళిదాసు ఆయనతో "ఆ తప్పు వాడిది కాదులెండి. ప్రతి విషయాన్నీ 'ఏమిటి? ఎందుకు?' అని ప్రశ్నించే స్వభావంకలవాణ్ణి భుజంతట్టి 'వీడికి' సైంటిఫిక్ ఔట్‌లుక్ వుంది' అని మెచ్చుకుని సమర్థిస్తూ వుంటిమి. వాడలా తయారు కావడంలో ఆశ్చర్యం ఏముంది?" అన్నాడు. శంకరశాస్త్రి నవ్వి 'అవును. అదీ నిజమే' అన్నాడు.

పట్టాభి, కాళిదాసూ మరో అయిదు నిముషాల్లో ఒక హోటల్లోకి వెళ్ళి కూర్చుని ఫలహారం చేసి కాఫీ త్రాగారు. పట్టాభి కాఫీగ్లాసు బల్లమీద వుంచుతూ "కాళీ, నీతో ఒక చిన్న విషయం చెప్పాలనుకుంటున్నానోయ్" అన్నాడు. కాళిదాసు నవ్వి "అదేమిటి? నువ్వు చెప్పేమాటలు నే నెప్పుడన్నా విననని నీతో చెప్పానా?" అన్నాడు. పట్టాభి జేబురుమాలుతో మొహం తుడుచుకుంటూ "వినకేం? బుద్ధిగానే వింటావు. కాని, నేను చెప్పిన దాన్ని సానుభూతితో ఆలోచించి నేను చెప్పినట్టు చెయ్యగలవా?" అనిఅడిగాడు. కాళిదాసు "వింటాను.

అందరికన్నా ఎక్కువడబ్బు గడింపదల్చుకొన్న ఒక శెట్టిగారు లక్ష్మీదేవిని గూర్చి ఘోర తపస్సు చేశాడు.

లక్ష్మీదేవి ప్రత్యక్షమై, అతని అభిమతము గ్రహించి "నీ కెంత ధనము కావాలి?" అని అడిగింది.

శెట్టిగారు ఒక నిముషం ఆలోచించి "అసలు నీ దగ్గర ఎంత ఉంది?" అని అడిగాడు.

తటవర్తి (వైజాగు)

దాన్ని గురించి ఆలోచిస్తాను. చెయ్యగలనో, లేదో ఆలోచించి చెబుతాను. సరేనా? యిక చెప్పు అదేమిటో" అన్నాడు.

పట్టాభి నెమ్మదిగా "మా పినతండ్రి నిన్న వచ్చాడిక్కడికి. ఆయనకు పెళ్ళియీడు కెదిగివున్న కూతురు వుంది. స్కూల్‌ఫైనల్ దాకా చదివింది. బుద్ధిమంతురాలు. పిల్ల అందంగా వుంటుంది. అయితే ఆయన అంతగా కలవాడుకాదు. ఏదో గుమాస్తా ఉద్యోగం చేసుకుంటూ వొచ్చినంతలో సర్దుకుని రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు. పెద్దగా కట్నాలూ, కానుకలూ యిచ్చుకోలేడుకాని మర్యాదలకేమీ లోటు రానివ్వడు. నాతో నిన్నరాత్రి తన స్థితి అంతా చెప్పుకుని చాలా బాధపడిపోయాడు. నాకు చాలా విచారం వేసింది. నా దృష్టిలో నువ్వు....." అంటూ ఆగిపోయాడు.

కాళిదాసు అప్రసన్నంగా "పట్టాభీ! నువ్వు నా సంగతి అంతా తెలిసినవాడివి. నా మనస్సు మిగిలినవాళ్ళందరికన్నా బాగా గ్రహించిన వాడివి. అంతా యింతకుముందు యీ విషయమే చెప్పారు! పోయిన వాళ్ళతో మనం కూడా పోతామా? మన సుఖం ఏదో మనం చూసుకోవాలిగాని.......' అని అందరూ చెప్పారు. కాని నేను మరొకరితో సుఖపడలేను పట్టా నా మనస్సొప్పటంలేదు" అన్నాడు. అతని ము విచారగ్రస్తమై పోయింది.

పట్టాభి లేచి "సరేలే. నువ్వనవసరంగా బ పడకు. ఆ పేదబ్రాహ్మడికి ఒకదారి చూపించినట్ట తుందని నేను చెప్పానేగాని నీ యిష్టానికి, ఆ రుచులకు వ్యతిరేకంగా నడుచుకోమని నే నెప్పుడ సలహా యివ్వను. పద పోదాం" అన్నాడు.

ఇద్దరూ మళ్ళీ స్కూలుకు వచ్చారు. మధ హ్నం మొదటి గంట యిద్దరికీ పని వుండటంవ చెరొకవైపూ చదువుకుంటూ కూర్చున్నార

ఇంతలో ప్యూన్ గుమ్మంలో నుంచుని గ అంతా కలయజూసి, వాకిట్లో నిలబడివున్న మ షితో "అదుగో ఆ కిటికీప్రక్కన కుర్చీ కూర్చునివున్నారు. వెళ్ళి మాట్లాడండి" అన్నాడ

ఆ వ్యక్తి లోపలికి వచ్చాడు. ఆయనకు దాదా అరవై యేళ్ళుంటాయి. మొహం ముడతలుపడివుం కళ్ళకు లావాటి అద్దాలుగల జోడు పెట్టుకు వున్నాడు. ఆయన ఎడమ చేతిలో ఒక సంచి వుం ఆయన పైపంచెతో మొఖం తుడుచుకుంటు కిటికీదగ్గరవున్న కుర్చీవెనక్కు వెళ్ళి "నాయన కాళీ!" అని పిలిచాడు.

కాళిదాసు వెనుదిరిగిచూసి ఆశ్చర్యపోయాడ 'మీరా?' అనిమాత్రం అనగలిగాడు. మర క్షణంలో తమాయించుకుని "రండి యి కూర్చోండి" అంటూ ఆయనకు కుర్చీ చూపిం తను వేరొకకుర్చీలో కూర్చున్నాడు. ఆయ సంచి క్రిందపెట్టి కుర్చీలో కూర్చుని కళ్ళజోడ తీసి పైపంచెతో మళ్ళీ మొహం తుడుచుకున్నాడు

కాళిదాసు "అంతా కులాసాగా ఉన్నారా?" అ అడిగాడు. ఆయన కళ్ళజోడు పెట్టుకుని గద్ స్వరంతో "ఇదుగో యిలా వున్నాం నాయనా చాలా కాలమైంది నిన్ను చూసి. ఎలా వున్నావ బాబూ? మీ అమ్మగా రిక్కడే వున్నారా?" అ ప్రశ్నించాడు. కాళిదాసు తల అడ్డంగా వూ నవ్వుతూ "నాకేం రాయిలా వున్నాను. మా అమ్మగా రిక్కడలేదు. మా అక్కగారివూరికి పోయింది. ఆమె యిష్టమైనప్పుడు వొస్తుం దిక్కడికి" అని చెప్పాడు.

ఆయన మళ్ళీ "అయితే యిప్పుడు తిండీ తిప్పలూ......" అన్నాడు. కాళిదాసు పుస్తకం మూస్తూ "మా అమ్మ ఇక్కడ వున్నప్పుడే వంట నేర్చుకున్నాను. ఆమె పగలు అవీ యివీ దొర్లిస్తూ ఎలాగో పనిచేసేది. కాని రాత్రిళ్ళు ఆమెచేతనయ్యేదికాదు. అందువల్ల నేను తప్పనిసరిగా బియ్యం ఏరటందగ్గరినుంచి వండి వార్చి కూరలు చెయ్యటందాకా నేర్చుకోవలసి వచ్చింది. అందువల్ల ఇప్పుడేమీ యిబ్బందిగాలేదు" అన్నాడు.

ఆయన ఉస్సురని నిట్టూర్చి చుట్టూ కలయజూసి "మాకో కోర్టువ్యవహారం తగులబడిందిగా బాబూ! అవతలిపార్టీవాళ్ళీ వూళ్ళోనేవుంటే రాజీ మాటలకోసమని వచ్చాను. ఏదీ? ఏమీ లాభం కనిపించటంలేదు. అనవసరంగా కోర్టుకూ, ప్లీడర్లకూ, గుమాస్తాలకూ ధారపొయ్యటం, వాళ్ళకు ఆనందంగా వున్నట్టు అనిపిస్తున్నది. ఇప్పటికి

(40-వ పేజీ చూడండి)

బంగారం - సింగారం - 'రాఖీ' చిత్రకథ -




బంగారం - సింగారం - 'రేఖా' చిత్ర కథ -
బంగారం గారూ - ఓ కాయితమ్ముక్క ఇయ్యావయ్యా - 'నీపా' రకమయినా ఫర్వాలేదు - పోనీ నా బల్లమీద ఉత్తరం వుంది - ఇలా పడెయ్ -
అదేవిట్రా నాలిక బురుక్కుంటున్నావ్?
లాభం లేదురా పోస్టేజీ స్టాంపు లేవేనా నాలిక మీద మర్చిపోయానేమోనని చూస్తున్నా
మళ్ళీ ఏమొచ్చింది రోయ్ - ఈ గోళం గాళ్ళు మళ్ళీ మీద పడిపోతున్నారు
గుండ్రగోళాలు అమాంతం వీళ్ళ మీదపడి - క్షణంలో మళ్ళీ వెళ్ళిపోయారు
కరెన్సీ మళ్ళీ మారిపోయింది రోయ్!
ఇంత చప్పున మారిపోతుంటే ఎలా బతకడంరా బాబూ
ఓటి చెప్పనా అబ్బీ -
ఇక్కడ కాలం వేరు - కథ వేరు - ఈ కాలంలో బతకడం అంటే ఇదే - ఇది లేపోతే జనం మల మల మాడి - వాడి - చచ్చిపోతారు -
ఏడిశావ్ - బోడి థియరీ - నువ్వూనూ -
ఓరే సింగారం - ఇపుడు మారిన కరెన్సీ ఏవిటున్నావ్?
'గోళ్ళు' సార్ - నో నో నాట్ గోల్డ్ - గోళ్ళు - మీద పడి గోళ్ళన్నీ ఒల్చుకుపోయారు
ఇంకా నయం వేళ్ళు కాదు అందుకు సంతోషించాలి
నాయనా సింగారం - నీ చెయ్యి ఒక్కసారి ఇలా అందించయ్యా
అలాగా మావయ్యా - ఏం - జాతకం చూస్తా..
సింగీ - ఇవ్వకు రోయ్ - గోళ్ళ కోసం అడిగాడు దొంగ పీనుగ -
వీడెవడ్రోయ్!!
తమదేలోకం సార్?
హలో హలో!
14

ఎద్దుపాలు



శాంతిశ్రీ

ఒకసారి అక్బరుకు జబ్బుచేసింది. అతడు వైద్యునకు కబురుపంపించాడు. వైద్యుడు తక్షణమే అక్బరు యొద్దకు వచ్చి ఆతనిని పరీక్షించి, "నాదగ్గర ఒక మంచి మందున్నది. అది తీసుకొన్న వెంటనే మీకు స్వస్థత చేకూర్తుంది. కాని ఆ మందును తమరు ఎద్దుపాలతో తీసుకొనవలెను." అని చెప్పాడు.

ఒక సీసాను తనపెట్టెలోనుండి తీసి 'అక్బరు'న కిచ్చెను. అక్బరుకు ఇదేమీ అర్థంగాలేదు. "ఎద్దుపాలేమిటి? వ్యాధిని నయంచేయడమేమిటి?" అని చాల ఆశ్చర్యపడి ఆ వైద్యునితో, "అదెలా సాధ్యమగును. ఎద్దుపాలెక్కడ దొరుకుతాయి. మీరు పొరబడియుండలేదు గదా" అన్నాడు.

"లేదు ప్రభూ! నేనేమీ పొరబడలేదు. ఎద్దుపాలతోనే మీ వ్యాధి నయమవుతుంది. ఈ పని "బీర్బల్"కు అప్పజెప్పండి. అతడు ఎటువంటిపనైనా చేయగల సమర్థుడు." అన్నాడు ఆ వైద్యుడు.

ఆ వైద్యునికి, 'బీర్బల్'కు పడేదిగాదు. ఆ వైద్యుడు చేసే ప్రతీ చెడ్డపనికి "బీర్బల్" అడ్డుతగిలేవాడు. అందుచే "బీర్బల్" అంటే ఆ వైద్యునకు చాలకోపం. అందుచేతనే బీర్బల్‌కు ఈ పని అప్పగించి ఆతనిని ఎట్లైనా శ్రమపెట్టింప దలిచెను.

వైద్యుడు అచటినుండి వెళ్ళిపోగానే, "బీర్బల్" కొరకు అక్బరు కబురంపెను. ఆతనితో జరిగిన సంగతంతా చెప్పెను. "బీర్బల్" ఆ వైద్యుడు తనను శ్రమపెట్టదలచియే ఇట్టిపని పురమాయించెనని వెంటనే గ్రహించెను.

"అదేమిటి ప్రభూ!? ఎద్దు ఎక్కడన్నా పాలు ఇస్తుందా?" అన్నాడు బీర్బల్.

"అదేమీ నాకు తెలియదు. నాతో వైద్యుడు ఎద్దపాలు తెప్పించమని చెప్పాడు. తక్షణమే వెళ్ళి ఎద్దుపాలను సంపాదించి తీసుకొని రమ్ము" అని ఆజ్ఞాపించాడు.

ఇంకేమి మాటాడినా ప్రయోజనం లేదని "బీర్బల్" అచటనుండి వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళి భోజనంచేసి ఎద్దుపాలను ఎలా సంపాదించడమా అని కూర్చుని ఆలోచిస్తున్నాడు. "బీర్బల్" విచారముగా నుండుట గ్రహించి ఆతని కూతురు కారణమడిగి తెలుసుకొనెను. తన తండ్రిని ఏమీ కంగారుపడవద్దని అతనికి తాను సహాయం చేసెదనని చెప్పెను.

మరుచటి దినము అర్థరాత్రి ఆమె కొన్ని పాతవస్త్రములు తీసుకొని వాటితో అక్బరుకోటవద్ద గల నదికి పోయెను. అంతా నిదురపోతున్నారు. ఆమె బట్టలుదకటం ప్రారంభించింది. ఆ శబ్దం అక్బరుకు నిద్రాభంగం కలిగించింది. ఆయనకు చాల కోపంవచ్చింది. తన సేవకుని ఒకనిని పంపి అసలు విషయమేమిటి కనుగొని రమ్మని చెప్పెను.

ఆ సేవకుడు అట్టుటకు వెళ్ళి ఆమె బట్టలు ఉదుకుచుండటం చూచాడు.

"నువ్వు ఇక్కడేమి చేయుచున్నావు?" అనడిగాడు ఆసేవకుడు.

"కనిపించుటలేదా? నేను బట్టలు

ఉదుకుచున్నాను." అని ఆమె సమాధానము చెప్పెను.

"బట్టలు ఉదుకుటకు ఇది సమయం కాదు. నువ్వెవరవు?"

"నేనా? మనిషిని"

"అదే. ఎవరమ్మాయివు?"

"మా నాన్న కూతుర్ని"

"మీ నాన్న ఎవరు?

"మా అమ్మ భర్త"

"ఓహో! నీవు అతి తెలివిగా సమాధానము చెప్పుచున్నావే. నాతో మహారాజుగారికడకు రమ్మ. అనిచెప్పి ఆమెను అక్బరు కడకు తీసుకొని వెళ్ళి ఆ సేవకుడు జరిగిన విషయమంతా అతనికి చెప్పాడు.

అక్బరు కోపంగా, "ఎవరు నువ్వు? నీకీసమయంలో కోటదగ్గర బట్టలుదకవలసిన పనేమి వచ్చింది?" అనడిగాడు.

ఆమె భయపడుతున్నట్లు నటించుచూ, "అయ్యా! ఈ రోజు మధ్యాహ్నము మా తండ్రి ప్రసవించాడు. పగలంతా నాకు తీరిక లేదు. పుట్టిన పాపాయికి బట్టలు కావలసివచ్చాయి. అందుకనే నేను ఇక్కడ కొచ్చి ఇప్పుడు బట్టలు ఉదుకుచున్నాను." అంది.

అక్బరుకు కోపం ఇంకా ఎక్కువయింది.

"ఏమిటీ! నువ్వు నన్ను వెఱ్ఱివాడను చేయటానికి ప్రయత్నిస్తున్నావా? లేక నీకేమన్నా పిచ్చా? మగవాడు ఎక్కడైనా ప్రసవిస్తాడ?" అన్నాడు.

"అయ్యా! ఇంతవరకు నేను గూడ ఇట్టి వింత సంగతులు వినియుండలేదు. కాని మన నగరంలో ఈ మధ్యనే ఇట్టి సంగతులు జరుగుతున్నాయి."

"అంటే నీ ఉద్దేశం?"

"మహారాజుగారు ఒకరిని ఎద్దు ...లు తెమ్మని ఆజ్ఞాపించగా వింతగా లేనిది, ఒక పురుషునకు పిల్లవాడు పుట్టెననుటలో వింత ఏముంది?" అని అతి తెలివిగా ఆమె అక్బరుకు సమాధానం చెప్పింది.

అక్బర్ సంగతంతా అర్థం చేసుకొని ఆమెను కోపగించుకొనక చిరునవ్వుతో, "బీర్బల్ నీకేమన్నా బంధువా?" అని ప్రశ్నించాడు.

"అవును ప్రభూ! నేను "బీర్బల్" యొక్క కుమార్తెను" అని చెప్పిందామె. అక్బరు ఆమెయొక్క తెలివితేటలకు, ధైర్య సాహసాలకు చాల ఆశ్చర్యపడ్డాడు.

అక్బరు ఆమెతో, "బీర్బల్ యొద్దకుపోయి అక్బర్‌కు ఎద్దుపాలు అందినవి అని చెప్పుము" అన్నాడు.

"కాని, ప్రభూ! మా తండ్రి నన్ను నమ్మేదెట్లా?"

"ఆసంగతి నేను ఒక కాగితం మీద వ్రాసిఇస్తాను." అని చెప్పి "నీకుమార్తెద్వారా నేనుఎద్దుపాలను సంపాదించితిని." అని కాగితంమీద వ్రాసి ఆమెచేతికిచ్చి పంపెను.

"బీర్బల్" ఆ కాగితము వైద్యునకు చూపించగా ఆవైద్యునకు బుఱ్ఱ తిరిగెను. ఆ బుఱ్ఱ తిరుగుడుకు తన వద్దనున్న విరుగుడుమందు ఒకదానిని పుచ్చుకొన్నాడు. ★

నమస్తే! గౌతమీ

శ్రీ హర్ష వర్ధన

నమస్తే! గౌతమీ! నమస్తే! గౌతమీ!
సర్వఋతుశోభినీ—సాగరుని భామినీ!!
రంగదుత్తుంగ తరంగ సంఘాలతో
పొంగిపొరలే నీకు—ప్రేళ్లువారే నీకు
ముక్కోటి ఆంధ్రులిదె ముత్యాలహారతిదె!!
కొండలోయలలోన గుండాలు త్రొక్కి
గట్టుమిట్టలలోన గంతులు వేట్టి
ఎత్తుపల్లాలలో ఉయ్యాల లూగి
గలగలా జలజలా పారేటి నీకు
నమస్తే గౌతమీ! నమస్తే గౌతమీ!!
నీవు మెట్టినచోట వెలిశాయి రాజ్యాలు
వెలిశాయి భోగాలు! కలిశాయి నీలోన
నీ నీరములు గ్రోలి చెప్పాడు నన్నయ్య
మధువులొలికేలాగ తెలుగులో తొలికవిత
ఆంధ్రజాతికి గర్వ చిహ్నముగ నిలిచితివి
గౌతమీ! కొనుమమ్మ మాసుమాంజలులివిగో!!!
మహారాష్ట్రమున బుట్టి మహాదాంధ్రమున మెట్టి
గౌతముని గారాబు పట్టివై యలరారి
సాగరుని చేపట్టి సౌఖ్యాల దేలి
ఓలలాడే నీకు చేతునే నతులు
నమస్తే గౌతమీ! నమస్తే గౌతమీ!

"ప్రేమేగనక సంగీతంవల్ల వృద్ధయినట్లయితే, నాకు ఇంకా పాడి వినిపించండి—అంటు న్నాడురా పాపం! ఈ భగ్న ప్రేమికుడు" అన్నాడు ఆనందరావు, షేక్స్పియర్ నాటకంలోని మొదటి పేజీలో మొదటిలైను చదువుతూ, కుర్చీలో వెనక్కి చేరబడి వింటున్న కృష్ణావతారంతో.

హాస్టల్లో రాత్రి భోజనమయ్యాక, చదువు కోడానికి పుస్తకాలు తీసిన బి. ఏ. మొదటి సంవత్సరం విద్యార్థులు ఆనందరావు, కృష్ణావతారం. ఇద్దరూ చిన్నప్పటినుంచి కలసి మెలసి చదువుకుంటూ వచ్చిన వాళ్ళు. ప్రాణస్నేహితులు. కృష్ణావతారం ధనికుల కుటుంబంలోంచివచ్చాడు. అతని ప్రాపుతో చదువు కుంటున్న బీదకుర్రాడు ఆనందరావు.

ఆనందరావు చిన్నప్పటినుంచీ అన్ని క్లాసుల్లో ఫస్టుగా వచ్చాడు. అటువంటి తెలివిగల కుర్రా డితో జతగా చదువుకుంటే తమ కుర్రాడు కూడా బాగా వృద్ధిలోకి వస్తాడనే ఆశతో రామస్వామిగారు తమ పుత్రుడైన కృష్ణావతారంతోబాటు ఆనంద రావుని కూడా అన్ని ఖర్చులు తామే భరించి చదివిస్తు న్నారు.

కాలేజీ హాస్టల్లో ఇద్దరూ కలిసి ఒక రూములో వుంటున్నారు. కృష్ణావతారం అంటే ఆనందరావుకి ఎంతో అభిమానం. అతనివలననే తాను ఈనాడు బి. ఏ. చదవగల్గుతున్నాడు. అతని మంచి చెడ్డల బాధ్యత లన్నీ రామస్వామిగారు తనపైన వేశారు. ఎందుకంటే కృష్ణావతారం ముద్దుగా, సుకుమారంగా పెరిగిన ధనవంతుల బిడ్డ. కష్టనష్టాలు ఎక్కు వగా తెలియవు. అందువల్ల అన్ని విషయాల్లోనూ ఆనందరావు అతన్ని సరిదిద్దుకోవాలని ఆయన చెప్పారు.

షేక్స్పియర్ డ్రామా 'ట్వల్ఫ్త్ నైట్'ని చదవడానికి తీసి మొదలెట్టగానే కృష్ణావతారం చాలా విస్పృహగా నిట్టూర్చాడు. ఆనందరావు, అది గమ నించి "ఏం బ్రదర్ నిద్రొస్తోందా? ఇవాళ వంట వాడు సాంబారు చాలా బాగా పెట్టేడులే! దోసు బాగా ఎక్కువ చేశావు కాబోలు. నిద్ర వస్తోంది" అన్నాడు.

"నిద్ర కాదురా బాబూ! నా మనస్సేం బాగు లేదు"

"అయితే ఫరవాలేదు. షేక్స్పియర్ యొక్క అత్యంత రమణీయమైన ఈ నాటకం మనం చద వడం ప్రారంభించామంటే మనస్సులోవున్న ఖేద మంతా మోదంగా మారిపోతుంది"

"అలా మారటల్లేదు సరికదా, విషాదం ఎక్కు వయిపోతోంది"

"ఏమిట్రోయ్ విశేషం?"

"సంగీతంవల్ల ప్రేమ వృద్ధవుతుందని—ఎంత అనుభవంతో వ్రాసాడురా?"

"ఎవడికిరా అనుభవం. నీకా? షేక్స్పియర్‌కా?"

"ప్రస్తుతంలో నాకేరా"


"చంపావు పో! అయితే నువ్వు ప్రేమించిన— లేక ప్రేమించబోతున్న ఈ —లిస్టు నెంబరు ప్రకారం-ఇరవై మూడో రాచకన్య నామధేయం బెద్ది? ఆమె రాచకన్యయా, గోపికయా, మాతంగ కన్యయా, నాగకన్యకయా, ఎవరో సెలవిమ్మ"

"ఒరేయ్! ఇమాటు సీరియస్‌గా ప్రేమిస్తున్నాను రా"





కవిత్వంలో పడికొట్టుకుంటున్న కృష్ణావతారానికి ప్రేమ ఏమి తెలుసు? ఆ విషయం కమల చెప్పాలిగాని...



"నువ్వు 'సీరియస్'గా ప్రేమించని దెప్పుడు? మన ఊళ్ళో రత్తి మొదలుకొని మీ మేనమామ కూతుళ్ళు నలుగుర్నీ, హోటళ్ళలో, ట్రైనులో, బస్సులలో కన్పించి, నీ మనస్సును దొంగలించిన సుజాతా, పద్మినీ, సుకుమారి, మనోరమా, శారదా, ఇత్యాది కన్యలందర్నీ నువ్వు సీరియస్‌గానే ప్రేమించావు కదురా?"

"ఉష్! ఊరుకో. వాళ్ళందరి పేర్లూ ఎత్తకు. వాళ్ళకి ప్రేమంటే ఏమిటో తెలియదు. ఇప్పుడు నే ప్రేమిస్తున్న అమ్మాయిముందు వాళ్ళు ఆమె కాలిగోటికైనా పనికిరారు"

"సరే బాగానేవుంది. ప్రస్తుతం నీ ప్రేమ కథ ఆపి షేక్స్‌పియర్ డ్రామా ఆరంభిద్దాం. తొందరలో 'క్వార్టర్లీ ఎక్జామ్స్' వస్తున్నాయి"

"ఎల్లారా? వాడు ప్రేమా, సంగీతం అంటూంటే ఆ అమ్మాయీ, ఆమె సుందరవదనం జ్ఞాపకమొస్తోంది"

"పోనీ. ఫిజిక్సు చదువుదామా? అందులో 'ప్రెషరూ' 'టెంపరేచరూ'గురించి చదివితే—నాన్నగారూ, పేంబ్బెత్తం—జ్ఞాపక మొస్తుంది?"

"లాభం లేదురా. నా మనస్సు "దిగిరాను, దిగిరాను దివినుండి భువికి" అంటోందిరా."

ఆనందరావు చిన్న చిరునవ్వు నవ్వి "ఇంతకీ ఏమిటి కథ? కమలేనా?" అన్నాడు మిత్రుడువేపు చూసి.

"హార్నీ! ఎలా కనిపెట్టేశావురా?"

"మరింకెవరు బ్రదర్! కాలేజీలో అమ్మాయిలందరికన్నా అందమైన పిల్ల. బాగా పాడుతుంది. ఆమె యిప్పుడు అపూర్వచింతామణిలా ప్రశ్నలు వెయ్యడం మొదలెడ్తే, వెయ్యి బుర్రలుతెగి ఆమె కాళ్ళమీద పడడానికి సిద్ధంగా వున్నాయి."

"నిజమేరా. ఆమెను చూచిన వాడల్లా ఆమెను ప్రేమిస్తాడు."

"అలా అనకు. నాకా అమ్మాయిలో గొప్పతనమేమీ కన్పించలేదు."

"నువ్వో 'బుక్‌వరమ్'వి. నీకు సౌందర్యారాధన ఏం తెలుసు? మొన్న 'ఇండిపెండెన్సు'డే నాడు ఆమె పాడుతూంటే నేను విని మూర్ఛపోయేననుకో. ఆ జయదేవుడి అష్టపది. "సావిరహేతవ దీనా రాధా" అని ఆ అమ్మాయి పాడుతూంటే ఆ గానంలో మైమరచి తన్మయత్వంతో నా హృదయమే ఆమె కర్పించాను."

"మంచిపని చేశావు. హృదయం ఇచ్చేస్తే ఇచ్చేశావు. మెదడు భద్రంగా వుందికదా! దానికి పని కల్పించి, కాస్త చదువు ధోరణిలో పడు"

"ఉహూ! కమల సంగతేదో తేలాల్సిందే." అంతవరకూ ఒక మెదడేకాదు, మన ఇంద్రియాలేవి పని చేయవు"

ఆనందరావు కృష్ణావతారంచేత అవాళ్టికి చదివించడం కష్టమని గ్రహించాడు. కృష్ణావతారం సౌందర్య పిపాసి. కవిత్వం రాస్తాడు. అందమైన ఆడది కన్పిస్తే ప్రేమిస్తాడు. అయితే ఆ ప్రేమ మరో అందమైన ఆడది కన్పించేవరకే. తరువాత కొత్తమ్మాయి మీదకు మారిపోతుంది. తన ప్రేమ గాథలన్నిటినీ ఆనందరావుతో చెప్తాడు.

హృదయలాస్యం

పేద కుటుంబంలోంచి సహజ ప్రతిభవల్ల పైకి వస్తున్న ఆనందరావు ఇలాటి విషయాలలో జోక్యం కలుగజేసుకోకపోవడమేకాక, మిత్రుణ్ణి సానుభూతితో మందలిద్దామని ప్రయత్నిస్తూంటాడు. ప్రేమించడానికి, ముందు ముందు కావలసినంత కాలముందనీ, కళాశాల చదువుని అశ్రద్ధ చేయవద్దనీ హెచ్చరిస్తూంటాడు.

కృష్ణావతారం ధనికుల బిడ్డ అవటంవల్ల, చదువుకోడం తనకు విజ్ఞానార్జనకొరకేగాని, జీవనార్జనకు గాదని, అందువల్ల తన సౌందర్యారాధనకు చదువు అడ్డం కాకూడదని తీర్మానించుకొన్నాడు.

రోజూ కారులో వస్తూండే కమలకోసం, కాలేజీ గేటు దగ్గరే సూటు వేసుకొని ఎదురు చూస్తూండేవాడు. ఆమె రాగానే చిరునవ్వుతో ఆమెను తనవైపు ఆకర్షించాలనీ, ఎలాంటి అవకాశం దొరికినా ఆమెను పలకరిద్దామనీ ప్రయత్నించేవాడు. కమల అసలతనివైపే చూడకపోగా, ఇతర మగ విద్యార్థులు ఆమె దృష్టి నాకర్షించాలని ప్రయత్నించే—వారెవరి వంకా కన్నెత్తి చూసేదికాదు.

ఆఫీసరు:-(గుమాస్తాతో) ఏమయ్యా పనిలోకి యింత ఆలస్యంగా వచ్చావు?

గుమాస్తా:-నిద్రలో మెలకువ రాలేదండీ.

ఆఫీసరు:-ఏమిటీ? అయితే నువ్వింట్లో కూడా నిద్రపోతావన్నమాట!

డి. ఎజ్, శంకర్

కమల ఆ ఊళ్ళో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్మూర్తిగారి ఏకైకపుత్రిక. ఆ ఏడాదే ఇంటర్మీడియట్‌లో చేరింది. పదహారేళ్ళ మిసిమి జవ్వనంతో ఆమె సౌందర్యం, నవవికసిత కుసుమంలా చూసేవారికి మనోమోహనజనకంగా వుండేది. కాలేజీ విద్యార్థులంతా—ఆమెను చూడడంకోసం విరగబడిపోయేవారు. ఆమె సెక్షనులో విద్యార్థులకు లెక్చరర్ల పాఠం వినటంకన్నా, ఆమె కట్టిన చీర, పెట్టుకున్న పువ్వులు, వేసుకున్న జోళ్ళూ పరీక్షించడంలో శ్రద్ధ ఎక్కువగా వుండేది. తక్కిన విద్యార్థినులు కూడా ఆమెతో పరిచయాన్ని వాంఛిస్తూ, ఆమెను ఎంతో గౌరవంగా చూసేవారు.

అందంవున్న ఆడదానికి సులభంగా నాయకత్వం లభిస్తుంది. డబ్బూ, బలంవున్న అబ్బాయి మగవాళ్ళలో నాయకుడవడం ఏమాత్రం కష్టంగాదు. మొత్తానికి చదువులో ప్రథములైన వాళ్ళు ఎక్కడోగాని నాయకత్వం వహించరు. స్టూడెంట్సు యూనియన్ పోటీలకు కృష్ణావతారం సిద్ధమయ్యాడు. అన్ని క్లాసులకూ వెళ్ళి కాన్వాసు చెయ్యడం ప్రారంభించాడు. ప్రక్కన ఆనందరావు వుండక తప్పదు.

అన్ని విషయాలూ ముందు ఆలోచించకుండా దిగడం కృష్ణావతారం పని. వాటిలోవున్న అవక తవకలన్నీ దిద్దుకు రావడం ఆనందరావు పని. సెక్రటరీ పదవికి నామినేషన్ ఇచ్చాక కృష్ణావతారానికి, తన ప్రత్యర్థి శ్రీరామ్ చాలా పలుకుబడిగల విద్యార్థి అనీ, గత రెండు సంవత్సరాలనుంచీ అంతర్ కళాశాలల వక్తృత్వ పోటీలలోనూ, నాటక పోటీలలోనూ ప్రథముడుగా రావటమే కాకుండా చదువులో కూడా తెలివైన వాడనీ లెక్చరర్లందరికీ ప్రీతిపాత్రుడనీ తెలిసింది.

ఆనందరావు ఈ విషయా లన్నీ తెలుసుకొని కృష్ణావతారాన్ని ఎలా గెలిపించాలా అన్న సమస్యలో పడ్డాడు. ఆ వూరు కాలేజీకి వాళ్ళు క్రొత్త. ఇంటర్మీడియట్ వేరే ఊళ్ళో చదివి, బి. ఏ. కు ఇక్కడికి వచ్చారు. ఏ విద్యార్థి నోటివెంట చూసినా, శ్రీరామ్‌ని గురించిన పొగడ్తలే వినిపిస్తున్నాయి. కృష్ణావతారం ఎవరో, అతను ఎందుకు సెక్రటరీ పదవికి నిల్చున్నాడో ఎవరికీ తెలియదు.

ఎలక్షను ఇంక రెండురోజు లుందనగా, అందరూ శ్రీరామ్ విధిగా నెగ్గితీరతాడనీ, కృష్ణావతారాన్ని 'విత్‌డ్రా' చేసుకోమనీ చెప్పసాగారు. ఆనందరావు తన తెలివితేట లన్నీ ఉపయోగించి కృష్ణావతారాన్ని నెగ్గించాలనుకున్నాడు. అవాళ రాత్రి హాస్టల్లో స్పెషలుగా ఒక టీపార్టీ ఏర్పాటు చేయించాడు—కృష్ణావతారం ఖర్చుమీద. అందరూ ఎలక్షను ప్రచారంకోసం అనుకున్నారు. కాని ముందు కృష్ణావతారం చేత మంచి పాటలు నాలుగు పాడించాడు. హాస్టలు విద్యార్థులకు కృష్ణావతారం గాయకుడనీ, కవి అనీ అవాళే తెలిసింది. అందరూ సరదాగావున్న సమయంలో ఆనందరావు రెండే రెండు ముక్కలు చెప్పాడు. అందులో, హాస్టలు విద్యార్థి కాలేజీ సెక్రటరీ అయితేనే హాస్టలు గౌరవం నిలుస్తుందనీ, కాబట్టి హాస్టలు వాళ్ళంతా కృష్ణావతారానికి సహాయం చెయ్యాలనీ చెప్పాడు. శ్రీరామ్ హాస్టల్ విద్యార్థికాదు.

మర్నాడు ఆనందరావూ, కృష్ణావతారం ప్రతి క్లాసులోని ప్రతి విద్యార్థితోనూ కృష్ణావతారానికి ఓటు వెయ్యమని అతి మర్యాదగా చెప్పారు. మధ్యాహ్నం లేడీస్ రూముకి బయల్దేరారు. కృష్ణావతారం మనసంతా కమలమీద వుంది. ఇన్నాళ్ళబట్టీ ఆమెతో మాట్లాడే అవకాశం లభిస్తే చాలునని ఎదురుచూసిన వాడల్లా, తీరా ఆమె నెదుర్కొని మాట్లాడవలసివస్తుందనేసరికి కొంచెం పిరికితనం పొందాడు. పైగా లేడీస్ రూముకు వెళ్ళగానే, అక్కడున్న మహిళల నందర్నీచూసి మరీ గాభరా పడ్డాడు. ఆనందరావు చొరవ తీసుకొని, అందరికీ కరపత్రాలిచ్చి కృష్ణావతారాన్ని పరిచయంచేసి, అతనికి ఓటు వెయ్యవలసిందని కోరాడు.

కృష్ణావతారం మనస్సు ఎక్కడో విహరిస్తోంది. కమలకోసం వెతుకుతున్న కళ్ళు కాస్సేపు శూన్యంలోకి ప్రయాణంచేసి వచ్చేటప్పటికి కమలా, ఆనందరావులకు జరుగుతున్న సంభాషణ విన్పించింది.

"ఇంతకుముందే మేమంతా, సరళాదేవి కోరిక

హృదయలాస్యం

ప్రకారం శ్రీరామ్‌గారికి ఓటు చేద్దామనుకొన్నాం" అంది కమల.

"ఒకరి కోరిక ప్రకారం ఎందుకు చెయ్యాలి? మీ కిష్టమైతే వెయ్యండి. శ్రీరామ్‌కు మీరు మాటిచ్చారా?" అని అడిగాడు, ఆనందరావు.

"ఆయనతో మేమేమీ అనలేదు. కాని మాలో మేమే అనుకొన్నాం. ఆయన అసలు మా వద్దకు రాలేదు" అంది కమల.

"అక్కడే అతనికీ, కృష్ణావతారంకీ వున్న తేడా" అని ఆనంద్ చిరునవ్వు నవ్వి, కృష్ణావతారంవైపు చూశాడు. అప్పటికి కృష్ణావతారం తేరుకొని "నేనే ప్రప్రథమంగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను కాబట్టి నామాట మన్నిస్తారని విశ్వసిస్తున్నాను" అన్నాడు.

విద్యార్థినులంతా అతని తొట్రుపాటుచూసి నవ్వారు. ఆనందరావు తన సహజ వాగ్ధోరణితో వాళ్ళమధ్య సాన్నిహిత్యం సంపాదించాడు. మొత్తం మీద కృష్ణావతారంమీద వాళ్ళకు కొంత సానుభూతి కలిగింది. మరి కొంత సేపటికి శ్రీరామ్‌వచ్చి తనకు ఓటు వెయ్యవలసిందని అందర్నీ కోరినప్పుడు అందరూ తల లూపారు.

మర్నాడు ఎలక్షన్ జరిగినప్పుడు విద్యార్థినులు కృష్ణావతారంకే ఓటు చేశారు. అనుకోకుండా శ్రీరామ్‌మీద హెచ్చు మెజారిటీతో కృష్ణావతారం గెల్చాడు. ఆనందరావు తను పూనుకున్న పని అయిపోయిందికదా అని అని మళ్ళీ మామూలుగా తన చదువు ధోరణిలో పడ్డాడు.

కృష్ణావతారం సెక్రటరీ అయిన దగ్గర్నుంచి చదువు ధోరణి అసలే మానేశాడు. అతనికి కొంతమంది స్నేహితబృందం ఏర్పడింది. వాళ్ళ కాఫీ హోటలు ఖర్చులూ, సినిమా ఖర్చులూ అన్నీ అతనివే. హాస్టల్లో ఉన్నంతసేపూ వాళ్ళతో కాలం గడిపేవాడు. వాళ్లెంతసేపూ కాలేజీలో చదువుతున్న ఆడపిల్లల్ని విమర్శించడం, లెక్చరర్లని ఆక్షేపించడం తప్ప, చదువుమీద ఏమాత్రం శ్రద్ధ చూపించేవారుకాదు.

కమలతో ఎలాగైనా పరిచయం చేసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాడు, కృష్ణావతారం. ఆమెను చూసినప్పుడల్లా అతనిలో ఆమెతో మాట్లాడాలని ఉత్సాహం కలిగేది, అతనికి. కాని ఆమె అతనికి ఏమాత్రం చనువివ్వకుండా తిరిగేది. ఆమె చాలా గర్విష్ఠిలా కన్పించేది. ఆమె దగ్గరనుంచి ప్రోత్సాహం లేకపోయేటప్పటికి ఎంతో ఆశతో ఆమెదగ్గరకు వెళ్ళినవాడల్లా, వెంటనే తిరిగి వచ్చేస్తూండేవాడు. అప్పుడప్పుడు మీటింగులు ఏర్పాటు చెయ్యవలసివచ్చినప్పుడు, కమల విద్యార్థినుల ప్రతినిధి కాబట్టి, ఆమెతో కలిసి మాట్లాడుతూండేవాడు. ఆ కాస్సేపూ అవసరమైన మాటలే మాటాడేది.

ఆమెతో తన హృదయవేదన చెప్పుకోవాలనీ, తన కవితాధారతో ఆమె సౌందర్యం వర్ణించి ఆమెకు విన్పించాలనీ, ఆమె పాటను మెచ్చుకోవాలనీ, కృష్ణావతారం ఎంతో ఉబలాటపడేవాడు. ఆమె మాత్రం అలాంటి వెర్రివెర్రి వేషాలు తన దగ్గర పనిచెయ్యవు

అన్నట్లుండేది. ఆమెను చూడనంతసేపు 'గుండె గొంతుకలోన కొట్లాడు'తున్నట్లుండేది అతనికి. కాని ఆమెను చూడగానే పచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డట్లుండేది.

తెగించి ఒక ప్రేమలేఖ రాద్దామంటే కృష్ణావతారంకి భయంగా వుండేది. ఎక్కడ ఆమె దానిని తీసికెళ్ళి ప్రిన్సిపాల్‌గారిచేతికిస్తుందో! పోనీ ఆమె ఒక్కర్తే లేడీస్ రూములో వున్నప్పుడు వెళ్ళి ఆమెకు తన ప్రేమను వ్యక్తం చేద్దామంటే ముఖాముఖి ఆమె తారసపడగానే అతనికి 'ట్రెంబ్లింగు' పట్టుకుంటుందాయె!

"గిరీశంపడ్డ అవస్థలో పడ్డాంరా మనం" అన్నాడు ఆనందరావుతో తన అవస్థనంతా చెప్పుకొని కృష్ణావతారం.

"నయం. హామ్లెట్‌పడ్డ అవస్థలో మాత్రం పడలేదు. అందుకు సంతోషం!" అన్నాడు ఆనందరావు.

"ఇంక కొన్నాళ్ళిలా నడిస్తే మనం 'దేవదాసు' అవస్థలోపడేట్టు వున్నాంరా బాబూ!"

"ఒరేయ్! అయితే వెంటనే నిన్ను ఇంటికి తీసికెళ్ళిపొమ్మనీ, అక్కడ కొన్నాళ్ళుంటేనేగాని నీ కీ కమల పిచ్చి వదల్దని మీ నాన్నగారికి ఉత్తరం రాయమంటావా?"

"లాభంలేదు బ్రదర్! నేనుమాత్రం కమలను వదిలి బ్రతకలేను. రోజు కొకసారైనా ఆమెను చూస్తుంటేనే ఈ బొందిలో ప్రాణం నిలుస్తుంది. లేకపోతే ఒకే ఒక చిటికెడు పొటాషియం సైనేడు......"

"అంతమాటనకురా తండ్రీ! ఎల్లాగో ఒకలాగ మేమంతా కష్టపడి ఆ అమ్మాయి నిన్ను పెళ్ళి చేసుకొనే ఏర్పాటు చేస్తాం. కాలేజీలో అంటే ఆమె అందరికీ ఆరాధ్యదైవం అయిందిగాని, 'మారేజి మార్కెట్టు'లో నీదే పైచెయ్యి"

"ఛ! ఛ! ఆమెను ప్రేమతో నా దానిగా చేసుకొని, ఆమె మనస్సును నా మీద తిప్పుకోవాలిగాని, పెళ్ళిబజారులో చవగ్గా అమ్ముడుపోయి ఎలాగో ఆమెను దక్కించుకోవడంలాంటి నీచమైన పని కెన్నడూ దిగను. నాది నిస్వార్థప్రేమ. ఆమె నన్ను ప్రేమించేందుకు పడవలసిన అవస్థంతా పడతాను. ఆమెకు నాయందు ఇష్టం లేకపోతే ఆమెనెంత మాత్రమూ నా ప్రేమతో బాధించను"

"రైట్! మంచి మాటన్నావురా. నిజంగా నీలాంటి నిస్వార్థప్రేమికులు ఎక్కడోగాని అరుదు. నువ్వంత ఉన్నత స్థాయిలో ప్రేమించగలిగితే ఇంక సంకోచమెందుకూ? వెంటనే ఆమెకు నీ ప్రేమని తెలియజెయ్యి"

"నువ్వు చెప్పింది బాగానేవుందిగాని, ప్రేమ సంభాషణకు తగిన వాతావరణం కావాలి. లేదా అవతలి వ్యక్తితో మన పరిచయం చాలావరకూ వెళ్ళి ఎక్కడ కలుసుకున్నా ఒక మాటతో, లేక ఒక్క చూపుతో పరస్పరం అర్థంచేసుకోగల స్థితైనా కలగాలి. ఎప్పుడో ఒకసారి లేడీస్ రూముకు వెళ్ళి కొద్ది నిముషాలు కాలేజీ విషయాలు మాట్లాడే సందర్భంలో—నా ప్రేమని ఎలా వ్యక్తం చెయ్యడం?" అని నిట్టూర్చాడు కృష్ణావతారం.

"అయితే, ప్రాక్టికల్ (అనగా వాస్తవిక) ప్రేమ చాలా కఠినమైనదన్న మాటే!"

"ఏమిటనుకున్నావు? ఇదేం వూహాగానంకాదు"

"సరేలే బ్రదర్. నీతంటాలేవోపడు. నాకీ ప్రేమలన్నా ఆడవాళ్లన్నా తలకాయనొప్పి. అంతకన్నా ఏ కెమిస్ట్రీయో, ఫిజిక్సో చదువుకుంటూ కూర్చోడం నా కిష్టం."

కృష్ణావతారం ఆనందరావుతో ఎంత మొరపెట్టుకున్నా లాభం లేదనుకున్నాడు. ఎలాగైనా కమల ప్రేమను తను పొందాలి. అప్పటికి కాలేజీ వార్షికోత్సవం రెండు నెలలుంది. చాలా పోటీలు ఏర్పాటు చెయ్యాలి. డ్రామా ఒకటి వేయించాలి. వీటన్నిటిగురించీ తను అప్పుడప్పుడు కమలతో మాట్లాడుతూండవచ్చు. ఆమెహృదయాన్ని ఆకర్షించవచ్చు.

ఆ సంవత్సరం అంతర్ కళాశాలల వక్తృత్వ పోటీలు కృష్ణావతారం తమ కాలేజీలో జరిపించాలని నిశ్చయించాడు. అన్ని కాలేజీలకూ ఆహ్వానాలు పంపారు పాల్గొనవలసిందని. తమ కాలేజీ ప్రతినిధులుగా ఎవర్ని ఎన్నిక చేద్దామా అని ఆలోచించి ఒక పోటీ ఏర్పాటు చేశాడు. అందులో చాలామంది విద్యార్థులూ, విద్యార్థినులూ పాల్గొన్నారు.

విషయం 'నేటి విద్యావిధానంలో లోపాలు' చాలా మంది విద్యార్థులు, నేటి విద్యా విధానం జీవితాన్ని సక్రమంగా గడపటంలోనూ, దేశాభ్యుదయంకొరకు పాటుపడటంలోనూ, ఎంతమాత్రం ఉపయోగించదనీ, కేవలం గుమాస్తాలను భారీ యెత్తున తయారుచేసే యంత్రాగారాలుగా కళాశాలలు పనిచేస్తున్నాయనీ చెప్పారు. కమల కూడా మాట్లాడింది. ఆమె చక్కని ఉచ్చారణతో, మంచి భాష నుపయోగిస్తూ, ప్రస్తుత విద్యా విధానం పాశ్చాత్యసంస్కృతిలోంచి వెలువడిందనీ, భారతీయసంస్కృతిని చాటే 'విశ్వ భారతి'లాంటి విశ్వవిద్యాలయాలు దేశమంతటా వెలువడాలని చెప్పింది.

న్యాయానికి అంతతోవక్తలందరూ మాట్లాడ్డం అయిపోయింది. కాని అంతవరకూ అందరి ఉపన్యాసాలూ వింటూ కూచున్న ఆనందరావు అవకాశమిస్తే తనూ మాట్లాడతానని చెప్పాడు. అంతకు ముందు ఆనందరావు ఎన్నడూ స్టేజి ఎక్కలేదు. కానీ ఈ విషయం అతనికి ఎంతో ప్రీతైనది. చాలా రోజులబట్టీ దీని గురించి అతను ఎంతో ఆలోచిస్తున్నాడు. తన భావాలన్నీ పైకి చెప్పుకోవాలనిపించింది అతనికి.

కృష్ణావతారం జడ్జీలతో, ఆనందరావు మాట్లాడడానికి అవకాశమిమ్మని చెప్పి ఒప్పించాడు. వెంటనే ఆనందరావు స్టేజిఎక్కి, గంభీరంగా మాట్లాడసాగాడు. ప్రప్రథమంగా నేడు విద్యను బోధించడం, విద్యను అభ్యసించడం ఈ రెండూ సరియైన పద్ధతిలో జరగటం లేదని చెప్పాడు. విద్య అనేది చాలా మంది అలంకారంగా భావించి, కళాశాలల్లో చేరుతున్నారుగాని, విజ్ఞానార్జనాదృష్టితోకాదు. కొంతమంది ఎలాగో ఒకలాగు డిగ్రీ తెచ్చుకోవటమే ప్రధానంగా భావిస్తున్నారు. ఇటువంటి మనస్తత్వంతో విద్యార్థులుండడంవల్లనే కళాశాలలో అల్లరులూ, క్రమశిక్షణా రాహిత్యం ప్రబలుతోంది. విద్యార్థులలో శ్రద్ధ లోపించడంవల్ల, బోధించేవారు కూడా 'కోర్సు' పూర్తి చెయ్యడమే చాలుననుకొంటున్నారు. ఇంతకన్నా ప్రాథమిక విద్య మొదలుకొని ఉన్నత విద్యవరకూ విద్యార్థుల శక్తిసామర్థ్యాలను అనుసరించి, ఏఏ తరగతివరకు ఏఏ విద్యార్థి చదవగలడో అంతవరకే అతనిని చదవనివ్వాలి. ఆ పై తరగతికి వెళ్ళనివ్వరాదు. అప్పుడు విద్యాభ్యాసం శ్రద్ధతో జరుగుతుంది. బోధన కూడా చక్కగా వుంటుంది. అనవసరమైన అల్లర్లుండవు. అని చెప్పి "సహనా భవతు......' అన్న ఉపషనిద్వాక్యంతో తన ఉపన్యాసం ముగించాడు.

జడ్జీలు ఆనందరావునీ, కమలనూ ఎన్నిక చేశారు. కృష్ణావతారం చాలా సంతోషించాడు. తన మిత్రుడిలో ఇంత ప్రతిభ వుందని ఆశ్చర్యంతో పొంగిపోయాడు. ఎలాగైనా తమ కాలేజీకి పేరు రావాలని ఆనందరావుకూ, కమలకూ ఎంతో ప్రోత్సాహమివ్వ నారంభించాడు.

మునపటికన్నా కమలతో **మాట్లాడడానికి** కృష్ణావతారంకి ఎక్కువ అవకాశం లభిస్తోంది. అంతర్ కళాశాల వక్తృత్వ పోటీలు ఏర్పాటయిన రోజున కాలేజీ అంతా చాలా కోలాహలంగావుంది. అనేక కాలేజీలనుంచి ప్రతినిధులు వచ్చారు. కాలేజీ మెయిన్ హాలులో, ఆ వూరిలో ప్రముఖ విద్యావేత్తలయిన రామారావుగారనే రిటైర్డు ప్రొఫెసరు అధ్యక్షతక్రింద పోటీలు ప్రారంభమయ్యాయి. ముగ్గురు జడ్జీలను నియమించారు. అందులో పబ్లిక్ ప్రాసిక్యూటరు రామ్మూర్తిగా రొకరు.

ప్రపంచశాంతిని భద్రతామండలి సాధించగల్గిందా, లేదా అన్న విషయం చర్చనీయాంశంగా ఇవ్వబడింది. ఒక్కొక్క కాలేజి తరుఫున ఇద్దరేసి విద్యార్థులు (లేక విద్యార్థిని కూడా) పాల్గొనారంభించారు.

ఆనందరావు స్టేజి ఎక్కగానే విద్యార్థులంతా హర్షధ్వానాలు చేశారు. అతను, అంతకుముందు మాట్లాడిన ప్రత్యర్థి చెప్పిన విషయాలన్నిటినీ ఖండించి, చక్కని పాయింట్లతో తన వాదాన్ని బలపర్చుకొని, ముచ్చటైన ఉపన్యాసాన్నిచ్చాడు. తరువాత వచ్చిన వక్త, గంగాప్రవాహంలా మాట్లాడ నారంభించాడు గాని అతను ఉపోద్ఘాతం ముగించే సరికే అధ్యక్షులు అతనికిచ్చిన కాలం అయిపోయిందని తెలియ చేశారు. ఆఖరుకి కమల వంతు వచ్చింది. ఆమె పూర్తిగా లాయరుగారి కూతురనిపించుకొంది. ఆమె అందరి వాదాల్నీ ఖండించి తన వాదంలో వున్న విశేషాన్ని నేర్పుగా నిరూపించింది.

అందరిలోకీ ప్రథమబహుమతి ఆనందరావుకి

మొదటివ్యక్తి:-తమరి వూరేదండి?

రెండవ వ్యక్తి:-"మల్లెపగు" అండీ?

మొ॥ వ్యక్తి:-తమరూరు యేదండి?

రెం॥ వ్యక్తి:-"మల్లెపుగ"ని యెన్నిసార్లు చెప్పాలండి?

వెల్పుల శంకర్ (గుంతకల్లు)

భోజనానికి వుండి పొమ్మనేది. కొందరిలో ఆ సహజమైన ఆత్మీయత వుంటుంది. వాళ్ళ మనస్సులో పైవాళ్ళేమనుకొంటారో అన్న శంకవుండదు. వారి మనస్సులాగే అందరి మనస్సూ సరళమైన దనుకుంటారు.

సరళతో స్నేహం అభివృద్ధయినకొద్దీ, కమల గురించిన ధ్యాస తగ్గిపోసాగింది కృష్ణావతారంకి. కాలేజీ వార్షికోత్సవం దగ్గర పడుతున్నకొద్దీ, ఉత్సాహంతో ఏర్పాట్లు చెయ్యనారంభించాడు. విద్యార్థులు ఒక ఇంగ్లీషు నాటకం వెయ్యదల్చుకున్నారు. విద్యార్థినులు కూడా ఒక డ్రామా వెయ్యదల్చుకున్నారు. సారస్వత పోటీలలో ఆనందరావుకి ఎక్కువ ప్రైజులు వచ్చాయి.

వార్షికోత్సవంనాడు కమల పాట కచ్చేరీ వుంటే చాలా బాగుంటుందని కృష్ణావతారానికి తోచింది. ఆమెను అడిగితే, ఆమె తానీ మధ్య ప్రాక్టీసు చెయ్యటం లేదనీ, అందుకని పాడలేనని చెప్పింది. కృష్ణావతారం ఎంత బతిమాలుకున్నా ఆమె వినలేదు.

ఆనందరావుతో ఈ విషయం చెబ్తూ, "ఈమె ఇంత అహంకారంగల మనిషి అనుకోలేదురా. ఎలాగైనా ఒక మంచి 'మ్యూజిక్ ప్రోగ్రాం' ఏర్పాటుచేసి ఆమెకు బుద్ధి చెప్తాను" అన్నాడు కృష్ణావతారం.

"అందుకే ఆడదాని వెనకాల పడగూడదురా— అని చెప్పాను. ఇప్పటికైనా నువ్వు దారిలోకి వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా వుంది." అన్నాడు ఆనందరావు, తన స్నేహితుడి ప్రేమఖాతాలో ఇరవై మూడో పద్దు ముగింపు కొచ్చిందన్న విషయం తెలుసుకొని.

"ఇంతకూ ప్రోగ్రాం ఎలా ఏర్పాటు చెయ్యాలా అని నేను బాధపడుతున్నాను" అన్నాడు కృష్ణావతారం ఓటమి నంగీకరిస్తూ.

"పోనీ కాలేజీలో ఇంకెవరైనా పాడ్తారేమో, కనుక్కొని వాళ్ళకు ఛాన్సియ్యి" అన్నాడు ఆలోచిస్తూ ఆనందరావు.

"అయితే ఆ ఏర్పాటు నువ్వు చెయ్యి. నేను ఇంకా బోలెడన్ని పనులు చూసుకోవాలి. రేపు సాయంకాలానికల్లా ఎవర్నో ఏర్పాటు చెయ్యి"

"సరే. ఆ విషయం నా కొదిలెయ్యి"

మర్నాడు ఆనందరావు, ఆడ పిల్లల్లో ఎవరైనా పాడ్తారేమో కనుక్కుందామని, లేడీస్ రూముకి వెళ్ళేటప్పటికి రూములో కమల ఒక్కర్తే వుంది. ఆమెను చూసి ఆనందరావు చిరునవ్వు నవ్వి, తిరిగి వెళ్ళిపోదామనుకుంటుంటే ఆమె "ఎవరు కావాలి మీకు?" అంది.

ఆనందరావుకి ఇష్టం లేకపోయినా మాట్లాడక తప్పలేదు. "అబ్బే లేడీస్ అంతా వున్నారేమో, ఒక విషయం అడుగుదామని వచ్చాను." ఇంతలో దూరంనుంచి వస్తున్న విద్యార్థినులు కన్పించారు.

కమల "ఆదివారం మీరు మా యింటి కొకసారి రావాలి. మా నాన్నగారు మీతో మాట్లాడతారుట" అని, విద్యార్థినులు వచ్చేలోపల తొందరగా అనేసి ఏమీ ఎరగనట్లు వూరుకొంది.

ఆనందరావు, ఆమెమాటకు జవాబు చెప్పకుండా, వచ్చిన విద్యార్థినులను మ్యూజిక్ ప్రోగ్రాం గురించి అడిగాడు. వాళ్ళెవరూ పాడడాని కిష్టపడలేదు. చివరకు ఆనందరావు, విద్యార్థులలో పాడే వాళ్ళచేతే ప్రోగ్రాం ఏర్పాటుచేద్దామని నిశ్చయించుకున్నాడు.

కమల తనను ఇంటికి ఆహ్వానించడంలో ఉద్దేశమేమిటో ఆనందరావుకి బోధపడలేదు. నిజంగా రామ్మూర్తిగారు తనతో మాట్లాడదలుచుకొన్నారా? తనతో ఆయనకు పనేమిటి? తను కాలేజీ పోటీలలో బాగా మాట్లాడానని అభినందించారు. ఆ అభిమానంకొద్దీ రమ్మన్నారేమో? అయినా పెద్ద వాళ్ళు పిల్చినప్పుడు వెళ్ళకపోతే బాగుండదు.

ఆదివారం పదిగంటలకు ఆనందరావు కమల ఇంటికి వెళ్ళాడు. రామ్మూర్తిగారూ, కమలా ఆఫీసు గదిలో కూర్చొని వున్నారు. ఆనందరావు, ఆయన వద్దకు వెళ్ళి నమస్కరించాడు.

"రావోయ్ ఆనందరావు. నిన్ను మన యింటికి పిలవమని మా అమ్మాయితో చాలా సార్లు చెప్పాను. ఎప్పటి కప్పుడే మర్చిపోతున్నా ననేది. చాలా సంతోషం. మీదేవూరు?"

"మాది భీమవరం అండి. మేము ఎక్కువ ధనవంతులంకాము. అయి నా భగవంతుని దయవల్ల రామస్వామిగారనే ధనికులొకరు నన్ను చదివిస్తున్నారు. వారి అబ్బాయే కృష్ణావతారం. నా ప్రాణ స్నేహితుడు" అని తనగురించి ఆయన అడగని వివరాలు కూడా చెప్పేశాడు ఆనందరావు.

నాటకం భలే జోరుగా జరుగుతోంది. ప్రేక్షకులు ఎంతో శ్రద్ధగా చూస్తున్నారు. ఆ సన్నివేశం ఎంతో ఆకర్షణీయంగా వుంది. ప్రేక్షకులంతా "వన్సుమోర్!" అని పదేపదే అరవటం మొదలెట్టారు. ఆ హీరోకి కోపం వచ్చింది. ప్రేక్షకుల కేసి కోపంగా చూస్తూ, "వన్సుమోర్!!" అని గట్టిగా అరిచాడు.

—అచ్చి రఘురామరెడ్డి (మద్రాసు)

"ఓ! అందుకా మీరు కృష్ణావతారంగారికి అన్ని విషయాలలోనూ 'సపోర్టు' చేస్తుంటారు?" అంది కమల.

"అవును"

"నీ భవిష్యత్తుగురించి నీ ఉద్దేశా లేమిటి?" అని అడిగారు రామ్మూర్తిగారు. కమలకూడా ఏమని జవాబిస్తాడో? అని అతనివైపు చూసింది.

"నే నింతవరకూ ఏమీ ఆలోచించలేదు" అన్నాడు ఆనందరావు.

రామ్మూర్తిగారు అతనిప్పటినుంచీ భవిష్యత్తు గురించి ఆలోచించి దానికి తగిన కృషిచెయ్యాలని చెప్పారు. ఒక లాయరు కాబోయేవాడు ఎలా దానికి తయారవ్వాలో వివరించారు. తన జీవితానుభవాల్ని చాలా చెప్పారు. మద్రాసులో తను లా చదివినప్పటి విషయాలు, గొప్పగొప్ప కేసులు జరుగుతున్నప్పుడు, ఆ లాయర్ల ఆర్గుమెంట్లు ఎంతో ఆసక్తితో చదివేవారమనీ, భాష్యంఅయ్యంగార్, రంగస్వామి మొదలైనవారి వాదాల్ని ఎంతో శ్రద్ధగా తెలుసుకొనేవారమనీ, లాయరు కాదగినవాడు ఎంతో కృషిచెయ్యాలనీ చెప్పుకొచ్చారు. జీవితంలో ప్రతి వ్యక్తికీ ఉన్నతాశయా లుండాలనీ, వాటిని నెరవేర్చుకొనే పూనికా కృషి కూడా వుండాలని చెప్పారు.

ఆనందరావుకి ఆయన మాటలెంతో నచ్చాయి. ఆవాళ అతన్ని తమ ఇంట్లో భోంచెయ్యమని కోరింది కమల. ఆనందరావుమనస్సు ఉత్సాహంగా ఉండడంవల్ల అందు కంగీకరించాడు. చాలా గర్విష్ఠి, అహంభావంకలదీ అయిన కమల తన నెంతో ఆదరించి తనయందు స్నేహాన్నిచూపడం ఆనందరావు కెంతో ఆశ్చర్యం కలిగించింది. బహుశా తను కాలేజీలో చూపించిన ప్రతిభకు జరుగుతున్న గౌరవం అయివుంటుంది, ఇది వ్యక్తిగతమైన స్నేహం అయివుండదనుకొన్నాడు.

చివరికి ఆనందరావు ఎంతో స్నేహభావంతో రామ్మూర్తిగారింటినుంచి బయటికి వచ్చాడు. ప్రతి ఆదివారం వస్తుండమని అతన్ని రామ్మూర్తిగారు కోరారు.

కాలేజీ వార్షికోత్సవంరోజున కృష్ణావతారం సెక్రటరీ రిపోర్టు చదవడం అయ్యాక ప్రిన్సిపాలుగారు ఆ సంవత్సరం కాలేజీకి ప్రతిష్ఠ నార్జించిన విద్యార్థుల నభినందిస్తూ, కృష్ణావతారం కృషిని మెచ్చుకున్నారు. తరువాత ఆహ్వానితులైన రాజకీయనాయకు లొకరు ప్రత్యేకంగా ఉపన్యసించారు. ప్రైజు డిస్ట్రిబ్యూషన్ సమయంలో ఆనందరావు, కమలలదే పైచెయ్యి. వారిద్దరికి చాలా ప్రైజులు వచ్చాయి.

తరువాత మ్యూజిక్ ప్రోగ్రాం, డ్రామాలూ అయ్యేసరికి చాలా కాలమైపోయింది. కమలా రామ్మూర్తిగారూ కారులో వెళ్ళిపోయారు. విద్యార్థులంతా వెళ్ళిపోయాక ఆనందరావు తన ప్రైజులన్నీ మోసుకొని రూముకి వెళ్ళాడు. వాటిని బల్లమీద సర్దుతూంటే, అందులో ఒక పుస్తకంలో కవరొకటి కన్పించింది. ఇంతకుముందు లేకుండా ఇప్పుడెలా వచ్చిందా అని తెరచి చూసేసరికి అందులో "ఇన్ని బహుమతులతోపాటు నేనిచ్చే ఈ చిన్న బహుమతి కూడా స్వీకరించండి—అది నా హృదయం. అంతకన్నా నే నివ్వగలిగింది లేదు—కమల" అని వుంది.

ఆనందరావు ముందర ఆశ్చర్యపడ్డాడు. తన బహుమతుల్ని ఒకసారి చూస్తానని అడిగింది. అప్పుడీకవరు ఇందులో పెట్టివుంటుంది. కమల తనను ప్రేమిస్తుందని తను కలలోకూడా ఊహించలేదు. కృష్ణావతారం ఆమెకోసం ఎంతో తంటాలు పడ్డాడు. అతన్ని కాదంది. తను ఏనాడు ఆమెయందు ఆసక్తి చూపించలేదు. అయినా తనను కోరింది. ఇలా ఆలోచిస్తుంటే కృష్ణావతారం వచ్చాడు. "అయిపోయిందిరా. గొడవలన్నీ తీరిపోయాయి. ఇక శ్రద్ధగా చదువుకోవడమే తరువాయి" అన్నాడు.

"అవునురా. పరీక్షలు దగ్గర కొచ్చేసాయి. బాగా చదవాలి" అన్నాడు ఆనందరావు. కృష్ణావతారం బట్టలు మార్చుకోసాగాడు. బట్టలు మార్చుకుంటూ "ఒరేయ్! నువ్వు ఎన్నడూ కోరని అమ్మాయి, చాలా అందమైనదీ, మంచిదే అనుకో, హఠాత్తుగా నిన్ను ప్రేమిస్తే ఏం చేస్తావురా?" అని అడిగాడు.

"తప్పకుండా స్వీకరిస్తాను" అని పక్కమీదకి చేరాడు ఆనందరావు. ★

అటువంటి దేవతను మ్రింగికూర్చున్న నిర్భాగ్యుడికి మళ్ళీ మరో అమాయకప్రాణిని కట్టబెడదామని మీరెలా అనగలుగుతున్నారు?" అన్నాడు. అతని కళ్ళు శ్రావణ మేఘాలవలె జలార్ద్రములవుతున్నాయి. అతడు ముఖం మరోవైపుకు తిప్పుకున్నాడు.

ఆయన నిట్టూర్చి లేచి సంచి చేతిలోకి తీసుకుని కాళిదాసుతో "అయితే నేను వెళ్ళి వస్తాను కాళీ" అన్నాడు. కాళిదాసు ఆయన వెంటనే నడుస్తూ "ఇక్కడికి వచ్చినప్పుడల్లా మా యింటికి రావడం మర్చిపోకండి. అప్పుడప్పుడైనా ఉత్తరాలు వ్రాస్తూ వుండండి" అన్నాడు. ఆయన, నెమ్మదిగా "అలాగే బాబూ!" అంటూ మెట్లుదిగి వీధిలోకి వెళ్ళిపోయాడు. ఆయన వీధిమలుపు తిరిగిపోయే వరకూ చూసి కాళిదాసు నిట్టూర్చి లోపలికి వెళ్ళాడు.

పనిమనిషి వెళ్ళిపోయినతర్వాత కొంతసేపటికి కాళిదాసు తలుపుకు తాళంవేసి వీధిలోకి వచ్చి నడవటం ప్రారంభించాడు. ఎండ బాగా తగ్గిపోయింది. పొద్దుగూకేందుకు ఎంతో వ్యవధిలేదు. పక్షులు కొన్ని అప్పుడే తమతమ గూళ్ళకు చేరుకునే ప్రయత్నంలో వేగంగా ఎగిరిపోతున్నాయి. ఆకాశంలో ఉత్తరదిశగా మొసలి ఆకారంలోవున్నదొక మబ్బు. ఒక రెండంతస్థుల మిద్దెమీదినుంచి, ఎవరో గాలిపటాన్ని ఎగురవేశారు. అది ఎంతో దూరంలో మేఘాల సమీపంలో ఎగురుతున్నది. వీధి చివర యిద్దరు పిల్లలు నిలబడివున్నారు. వారిలో ఒకడు రెండోవాణ్ణి తన దగ్గరవున్న బెలూన్ చూపించి వూరిస్తున్నాడు.

వీధిమలుపు తిరిగి కాళిదాసు ఒక రెండతస్థుల భవంతిముందు ఆగాడు. ఆ యింటి ప్రహరీగోడ మీద గేటుప్రక్కగా "ఎల్. నిరంజనశర్మ బి. ఎ. బి. ఎల్. అడ్వకేట్" అని వ్రాయబడివున్న చిన్న బోర్డు వుంది. అది చాలా పాతది.

ఇంతలో రెండవ అంతస్థులోనుంచి చప్పట్లు వినిపించి కాళిదాసు తల పైకెత్తిచూశాడు. నిరంజనశర్మగారు అక్కడ నిలబడివుండి "ఏమయ్యా కాళిదాసూ! అలా నిలబడేవున్నావేం? రా లోపలికి" అంటున్నాడు. కాళిదాసు త్వర త్వరగా నడిచి లోపలికి వెళ్ళాడు. ఆ యింటి పంచలో అయిదేళ్ళ పిల్లవాడొకడు ఖాళీ సిగిరెట్టుపెట్టెలతో ఆడుకుంటున్నాడు.

కాళిదాసు ముందుహాల్లోకి వెళ్ళగానే ఆయన మెట్లుదిగి వొస్తూ పలకరించి "కులాసాయేనా? అయినా క్రొత్తవాడిలా ఎందుకలా వాకిట్లో నిలబడి చూస్తున్నావు?" అని అడిగాడు.

కాళిదాసు నవ్వి "ఏమీలేదు. మీరు ఉంటారో ఉండరో అని అనుమానిస్తూ అలా ఒక్క క్షణం నుంచున్నానంతే" అన్నాడు. ఆయన కాళిదాసుకు ఒక కుర్చీ చూపించి "ఇంతకుముందు రోజూ యీ సమయంలో క్లబ్బుకు వెడుతూ వుండేవాణ్ణి. కాని యీమధ్య వొంట్లో సరిగా ఉండటంలేదు. డాక్టరు ఎక్కడికీ కదలవద్దని సలహా యిచ్చాడు. పైగా యిప్పుడు చలికూడా ఎక్కువగా వుంటున్నది. అందువల్ల ఎక్కడికీ వెళ్ళటమేలేదు" అన్నాడు.

ఇంతకుముందు పంచలో కూర్చుని ఆడుకుంటున్న పిల్లవాడు లాగూ పైకి లాక్కుంటూ, మోచేత్తో ముక్కు తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు. నిరంజనశర్మగారతనితో "ఒరే రాధా! 'తాతయ్యకు నిమ్మకాయ నీళ్ళూ, తేనె కావాల'ని అమ్మకు చెప్పి తీసుకురా. రెండు గ్లాసులు కావాలని చెప్పు" అన్నాడు. వాడు తలవూపి లోపలికి వెళ్ళాడు.

నిరంజనశర్మగారు అరవైయేళ్ళవాడు. హుషారుగా కనిపిస్తూనే వుంటాడుకాని వృద్ధాప్య చిహ్నాలు స్పష్టంగా ఆయనముఖంలో కనిపిస్తూ వుంటాయి. కళ్ళకు రోల్డుగోల్డు రిమ్‌వున్న కళ్ళద్దాలు వున్నాయి. జుట్టు బాగా నెరిసిపోయింది. ఆయన ప్లీడరుగా ప్రాక్టీసుచేసే రోజులలో ఆ యిల్లంతా వచ్చే పోయే పార్టీలతో అయిదారుగురు గుమాస్తాలతో సందడిగా వుండేది. వయస్సుపైబడే కొద్దీ ఆయన క్రమ క్రమంగా కల్పవృక్షంవంటి ప్రాక్టీసును వదిలివేశాడు.

ఆయన కాళిదాసుతో, ఆ పిల్లవాడు వెళ్ళిన వైపు చూపిస్తూ, "వీడు చదువూ సంధ్యా లేక

పాటకచ్చేరి జరిగే హాలులో
ఇద్దరి సంభాషణ.

పదిసంవత్సరాల ముందు
ఇతని సంగీతాన్ని వినడానికి
చుట్టుప్రక్కనున్న ఊళ్ళనుండి
వచ్చే వాళ్ళండీ.

"ఇప్పుడు చుట్టుప్రక్కల
ఉన్న ఊళ్ళకి వెళ్ళిపోవాలని
పిస్తోంది."

యస్. ఎస్. రాఘవన్ (చింతపల్లి)

పెడ్డైపోతున్నాడు కాళీ! అమ్మాయికి వీణ్ణిచూస్తే గొంగళిపురుగును చూసినట్టు వుంటుంది. వాణ్ణి దగ్గరికి రానివ్వదు. వాడికి కనీసం తలకు నూనె అయినా రాయదు. దగ్గరికి తీసుకోదు. నిన్న సాయంకాలం ఎవరో మరో పిల్లవాడు రాయి తీసుకు కొట్టాడని ఏడుస్తూ యింటికివొస్తే నా గుండెలు కరిగిపోయాయి. అప్పుడుకూడా తల్లి వాడితో మాట్లాడలేదు. ఎవరి కర్మ కెవరు బాధ్యులు చెప్పు పసివాడుకదా! వాడేం తప్పుచేశాడని అలా నిరాదరించటం? 'తండ్రిని పొట్టన బెట్టుకున్నాడ'నీ, 'నేలమీద పడగానే తండ్రిని మ్రింగికూర్చున్నాడ'నీ వాణ్ణి తిట్టని రోజులేదు. ఏమిటో అంతా చూస్తూ నేనుమాత్రం యింకా యిలా వున్నాను......" అన్నాడు. ఆయనగొంతు గద్గదికమైంది. కాళిదాసేమీ మాట్లాడలేదు.

వెనకవైపు గుమ్మంలోనుంచి "క్రిందపడేస్తావేమో జాగ్రత్త" అన్న మాటలు వినిపించాయి. కుర్రవాడు రెండు చేతులలోనూ రెండు గ్లాసులతో నెమ్మదిగా నడిచి వచ్చాడు. నిరంజనశర్మగారు ఒక గ్లాసు అందుకుని కాళిదాసు చేతికిచ్చి తాను మరొకటి తీసుకున్నాడు.

కాళిదాసు ఖాళీ గ్లాసును ఎదురుగావున్న ప్టూలు మీదవుంచి, కుర్రవాణ్ణి దగ్గరికి తీసుకుని, "నీ పేరేమిటి?" అని అడిగాడు. వాడు మొహంమీద పడుతున్న వెంట్రుకలను పైకి తోసుకుంటూ "రాధ!" అని సమాధానం చెప్పాడు. కాళిదాసు తమాషాగా "అదేమిటి? ఆడపిల్లపేరు పెట్టుకున్నావేం?" అని అడిగాడు. నిరంజనశర్మగారు నవ్వి "పూర్తిపేరు రాధాకృష్ణమూర్తిలే. అందరమూ 'రాధా' అని పిలుస్తూ వుంటాము." అన్నాడు.

వెనక గుమ్మానికి అడ్డంగా కట్టివున్న తెరను తప్పించి హాల్లోకి తొంగిచూసిందొక యిరవై అయిదేళ్ళ యీడుగల స్త్రీ. కాళిదాసు అటు చూశాడు. ఆమె రాధ తల్లి. అంతలో మళ్ళీ తెరను మామూలుగా వేసి వెళ్ళిపోయిందామె.

నిరంజనశర్మగారు గ్లాసు క్రిందవుంచి "ఇంతకూ నువ్వు వచ్చిన పని చెప్పనేలేదు" అన్నాడు. కాళిదాసు కుర్చీలో వెనక్కువాలి "ఏమున్నదీ? ప్రతి సంవత్సరమూ ఉన్న గొడవేగా? పొద్దునే ఆ శాస్త్రిగారువచ్చి 'యిరవై రెండవతేదీన మన వైద్యశాల వార్షికోత్సవమ'ని చెప్పిపోయాడు. నాకేమిటో యిలా వార్షికోత్సవాలనీ, రజతోత్సవాలనీ డబ్బు తగలెయ్యటం యిష్టంలేదు. పోయిన సంవత్సరం సంగతి మీకు తెలుసుగా. దాదాపు అయిదువందల రూపాయలు ఖర్చుచెయ్యటం జరిగింది. ఎవరు తిన్నట్టు చెప్పండి" అన్నాడు.

నిరంజనశర్మగారు నవ్వి "అయితే ఏంచేద్దామంటావు?" అని ప్రశ్నించాడు. "వృధాగా నాటకాలకనీ, నటులకనీ డబ్బు అలా ఖర్చుచేయటం యీ చిన్న సంస్థల విషయంలో అంత హర్షించదగిన విషయంకాదు. మొన్న మన ధర్మ వైద్యశాలలో మందులు కలిపియిచ్చే సుబ్రహ్మణ్యం కనిపించాడు. మనిషి చాలా దీనంగా వున్నాడు. వాళ్ళకు యీ జీతాలు ఏ మూలకూ సరిపోవడంలేదు. అంతకన్నా గత్యంతరంలేక యిక్కడ పడివున్నారు వాళ్ళు. కాబట్టి యింతంత మొత్తాలు ఎవరికీ లాభం లేకుండా ఖర్చు చేసే బదులు వాళ్ళకేదో మరి కాస్త సంతృప్తి కలిగించవచ్చుకదా?" అన్నాడు కాళిదాసు.

నిరంజనశర్మగారు ఒక్క నిముషం మెదలకుండా వూరుకుని, "నువ్వు చెప్పింది బాగానేవుంది. ఈ మధ్య నాలుగేళ్ళలో మన 'ఫండ్స్' కూడా పెరిగినయ్. కాని వాళ్ళవి పదేళ్ళనాటి జీతాలు. నేనూ యీ విషయం ఆలోచిస్తూనే వున్నాను. రెండు మూడురోజులలో ఒక నిర్ణయానికివచ్చి ట్రస్టీలందరితోనూ యీ విషయం ప్రస్తావించి అమలు జరిగేలా చూస్తాను" అన్నాడు.

పొద్దు పూర్తిగా వాలిపోయింది. నిరంజనశర్మగారు "అమ్మాయీవర్ధనీ! యిలా వచ్చి లైటు వేసిపో అమ్మా!" అని కేకవేశాడు. మిగిలిన అన్ని గదులలోనూ దీపాలు వెలుగుతూనే వున్నాయి. లోపలినుంచి ముందు "వొస్తున్నా" అంటూ బదులు పలికి, ఆమె ఒక్కనిముషంలో ముందు హాల్లోకి వచ్చి గుమ్మం ప్రక్కనే వున్న స్విచ్ నొక్కింది.

నిరంజనశర్మగారు వాకిలిగుమ్మంవైపు చూసి

అదిరిపడి "అదేమిటిరా రాధా?" అన్నాడు. కాళిదాసూ, తెర తొలిగించుకుని లోపలికి వెళ్ళబోతున్న వర్ధనీ ఒక్కసారిగా వాకిలివైపు చూశారు. అక్కడ రాధ నిలబడి వున్నాడు. వాడి చొక్కా చినిగిపోయి వుంది. జుట్టుమీదా, వంటినిండానూ దుమ్ము పేరుకునివుంది. మోకాలిమీద కొద్దిగా చర్మం గోక్కుపోయి నెత్తురు వొస్తున్నది. నిరంజనశర్మగారు లేచివెళ్ళి వాణ్ణి లోపలికి లాక్కువచ్చి "ఏమిటిరా యిది? ఎవరైనా కొట్టారా?" అని అడిగాడు.

వాడు కళ్ళనిండా నీళ్ళునింపి భయంతో తల్లివైపు చూస్తూ "నిన్న వాళ్ళ మణి వన్ను రాయి తీసుకుని కొట్టాడుగా. ఇవ్వాళ అందరూచేరి నన్ను ఏడిపించారు. అందుకని....." అంటూ ఆగిపోయాడు. తల్లి వాడిదగ్గరికివచ్చి రెక్క పుచ్చుకుని "వీధిలోకి వెళ్ళవొద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను! ప్రాణాలు తీసేస్తున్నావు" అంటూ లోపలికి లాక్కుపోబోయింది. వాడు వణికిపోతూ కన్నీళ్ళతో తాతగారి వంక చూశాడు. కాళిదాసు ఆమెతో "ఏమండీ! పాపం! వాడసలే వొణికిపోతున్నాడు. వాణ్ణి యింకా కొట్టకండి" అన్నాడు.

ఆమె ఒక్కసారి వెనుదిరిగి అతని వంక చూసి వాణ్ణి లాక్కుని లోపలికి వెళ్ళిపోయింది. నిరంజన శర్మగారు నిట్టూర్చి "రోజూ ఏదో ఒక గొడవ. వాణ్ణి చచ్చేట్టు బాదుతూ వుంటుంది. పెద్దగా ఏడవటానికి కూడా వీలులేదు. తన్నులుతిని గుడ్లనీరుకుక్కుకుని భరించి వూరుకోవలసిందే. నేను కూడా అడ్డంపోయేందుకు వీలులేదు. ఒకసారి నే నడ్డంపోతే. వాడు నా కొడుకు. "నేను బాదుకుంటాను. చంపుకుంటాను. అడిగేందుకు నువ్వెవరివి?" అని కేకలు వేసింది. దాన్ని చూస్తే నాక్కూడా భయంగావుంది. ఏమన్నాఅంటే ఏ అఘాయిత్యం చేస్తుందోనని భయంతో నోరు నొక్కుకుని వూరుకుంటున్నాను. ఇప్పుడైనా వూరుకుంటుం దనుకున్నావా? అలా వింటూవుండు" అన్నాడు.

ఇద్దరూ చెవులు రిక్కించుకుని వింటూ కూర్చున్నారు. హాల్లో అంతటా నిశ్శబ్దంగావుంది. చల్లని గాలి తెరిచివున్న కిటికీల్లోనుంచి విసురుగా వీస్తున్నది. గోడమీద రెండుమూడు బలిసిన బల్లులు చిన్న చిన్న పురుగులను పొంచివుండి మింగుతున్నాయి. చతుర్దశినాటి చంద్రబింబం చల్లని వెన్నెలను భూమిమీద కురిపిస్తున్నది.

వారిద్దరూ దాదాపు పది నిముషాలసే పలాగే నిశ్శబ్దంగా కూర్చున్నారు. లోపలినుంచి ఆమె ఆ పసివాణ్ణి శిక్షిస్తున్న సవ్వడియేమీ వినరాలేదు. కాళిదాసులేచి, "అయితే శర్మగారూ! నేను వెళ్ళివస్తానండీ. మీ రా విషయం మరచిపోకుండా ప్రయత్నిస్తారుగా? అదే.....వాళ్ళ జీతాల సంగతి. మొన్న ఆ సుబ్రహ్మణ్యంస్థితి చూస్తే జాలివేసింది. అతని భార్య మళ్ళీ ఆడపిల్లను కన్నదిట. ఇప్పుడతనికి అయిదుగురు ఆడపిల్లలూ ఇద్దరు మొగపిల్లలూ" అంటూ నవ్వాడు.

ఇంతలో గుమ్మానికివున్న తెరను తొలిగించుకుని రాధ లోపలికి వచ్చాడు. స్నానంచేసి శుభ్రంగా పువ్వులా వున్నాడు. తెల్లని చలువ చొక్కా లాగూ తొడుక్కుని వున్నాడు. కాలిమీద దెబ్బ తగిలినచోట ఏదో తెల్లని మందు వేయించుకున్నాడు. నిరంజన శర్మగారు వాణ్ణి చూసి ఆశ్చర్యంతో "ఇవాళ ఏ దేవతలో చల్లగా చూశారు వీణ్ణి. లేకపోతే చచ్చేట్టు దెబ్బలుతిని నోరెత్తకుండా అమూలకూర్చుని కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ ఎక్కాలు చదువుతూ వుండవలసినవాడు" అన్నాడు. కాళిదాసు నవ్వి వాడి భుజంమీద తట్టి "వెళ్ళివస్తానండీ" అంటూ వీధిలోకి వచ్చాడు.

వెన్నెల పుచ్చపువ్వులా వుంది. ఆకాశంలో నుంచి భూమిమీదికి పసుపూ తెలుపూ కలిసిన రంగులోవున్న పలుచని జలతారుతెరలను దింపినట్టుగావుంది. ఆకాశమంతా నిర్మేఘంగా వున్నది. నక్షత్రాలు గుంపులు గుంపులుగా మెరుస్తున్నాయి. చంద్రుడికి కొద్దిదూరంలో శుక్రతార అసామాన్యమైన వెలుగుతో ప్రకాశిస్తున్నది. రాత్రిపూట విహరించే ఏదో పక్షి చిత్రంగా అరుస్తూ ఎగిరిపోతున్నది.

ఒకసారి రావు రైల్లో వెళ్ళున్నాడు. కారణాంతరంవల్ల ఒక చిన్న స్టేషనులో రైల్లో గంటలతరబడి ఆగవలసివచ్చింది. రావుకు విసుగుపుట్టి గార్డుదగ్గరకు వెళ్ళి స్వామీ! యిది ఇవ్వాళ కదిలేనా? అని అన్నాడు.

అప్పటికే అనేకమందికి సమాధానము చెప్పి విసిగివున్న గార్డు 'నీకంత తొందరగా వుంటే నడిచి పోవయ్యా' అన్నాడు.

దానికి రావు నడిచిపోవచ్చు... కాని చాలా పెందలకడే జేరుతాను. అప్పటికి మావాళ్ళెవరూ స్టేషనుకు వచ్చివుండరు" అన్నాడు. దానితో మరి ఆగార్డు ముఖము చూడనక్కర్లే.

కగాసి జగన్నాథరావు (బాబ్జి)
టిటిలాఘర్

కాళిదాసు యింట్లో ప్రవేశించేసరికి పంచలో వేచివున్న వారందరూ లేచి నిలబడ్డారు. మురళీ రూబెనూ పుస్తకాల సంచులతో చదువుకునేందుకు వచ్చారు. పని మనిషి అప్పలమ్మ పసిపిల్ల వాణ్ణి వొళ్ళో పడుకోబెట్టుకుని గుమ్మంముందు కూర్చునివున్నది. ఆమె కాళిదాసు వరండామెట్లెక్కుతూవుండగా లేచి "అదేమిటి బాబుగారూ ఇంత పొద్దుపోయినతర్వాత నా యింటికి రావటం? చలిగాలిలో పసిపిల్లవాణ్ణి వొ పడుకోబెట్టుకొల్లోని అరగంటనుంచి కూచున్నానిక్కడ" అన్నది.

కాళిదాసు నవ్వి "ఓహో! నిజమేసుమా. ఈ పూటకు తప్పు జరిగిపోయిందిలే. మరిచిపోయాను" అంటూ తలుపు తాళం తియ్యబోయి వరండాలో పక్కకు చూశాడు. దృఢకాయుడైన ఒక వ్యక్తి అతనికి నమస్కరించాడు. రూబెన్ కాళిదాసుతో "మా నాన్నగారండీ. మీతో మాట్లాడేందుకు వొచ్చాడు" అన్నాడు. కాళిదాసు తలవూపి "అలాగే. దీపం ముట్టించి తీసుకువొస్తాను" అన్నాడు. అతని వెంటనే అప్పలమ్మ కూడా లోపల ప్రవేశించి దీపం ముట్టించేదాకా గుమ్మం దగ్గరే నుంచున్నది. కాళిదాసు తాను ప్రతిరోజూ గుర్తుగా వుంచేచోట అగ్గిపెట్టెకోసం వెదికి తీసుకుని స్టూలుమీద వున్న రెండుదీపాలనూ ముట్టించాడు. అప్పలమ్మ పసిపిల్లవాణ్ణి చాప పరిచి పడుకోబెట్టింది. కాళిదాసు దీపం తీసుకుని పంచలోకి వచ్చాడు. తన విద్యార్థులిద్దరినీ ఉద్దేశించి "మీరు వెళ్ళి చదువుకోండి" అన్నాడు. వారిద్దరూ చాపలూ, దీపమూ తీసుకుని ఉత్తరంవైపు వరండాలోకి వెళ్ళిపోయారు.

రూబెన్ తండ్రి దృఢంగా నల్లగా వున్నాడు. అతడు కాళిదాసు వంకచూసి "మావాడేమైనా బాగా చదువుతున్నాడా బాబుగారూ? మా వంశంలో ఎవరికీ అక్షరంముక్క రాదు. ఏదో వీడికి నాలుగుముక్కలు చెప్పిద్దామని తంటాలు పడుతున్నాను" అన్నాడు.

కాళిదాసు నవ్వి "ఏమీ ఫరవాలేదు. మీవాడు శ్రద్ధగానే చదువుతున్నాడు. ఇక్కడికి చదువుకునేందుకు వొచ్చే వీళ్ళిద్దరూ నిజానికి చాలామందికన్నా నయం. మీ వాడికి ఏ పాఠమైనా చదివిన వెంటనే అర్థంకాదు. అయినా అర్థమయ్యేవరకూ దాన్నివొదలని సుగుణం వుంది వాడి దగ్గర. ఆ లక్షణంవున్నవాడెవడైనా తప్పక వృద్ధిలోకి వస్తాడు. ఆ రెండోవాడున్నాడే వాడు చురుకైనవాడు. వాడికి ఏ పాఠమైనా ఒకసారి చదివినవెంటనే అర్థమవుతుంది. వాడికి ఆటలమీద వుండే ధ్యాస, మళ్ళీ ఆ పాఠాన్ని చదువుదామని వుండదు అని చెప్పాడు.

ఆ వ్యక్తి ముఖంలో పుత్రోత్సాహం కనుపించింది. "ఏదో తమ దయబాబూ, కాస్త నలుగురిలో పైకివొచ్చేట్టు చూడండి. తమ మేలు మరిచిపోను" అంటూ అతడు ఆగి "ఎన్నాళ్ళనించో మావాడు యింటిదగ్గర గోల చేస్తున్నాడు బాబూ! వాడికి అలారం గడియారం కావాలిట. అది యింట్లోవుంటే అన్ని పనులూ టైము ప్రకారం చేసుకోవచ్చునట......నేను కొలిమిముందు రెక్కలు ముక్కలు చేసుకుని ఎంత శ్రమపడినా యిల్లు గడవటమే కష్టంగా వుంది. అయినా మూణ్ణెల్ల నుంచీ రోజూ పావలా డబ్బులకు తక్కువ గాకుండా వేరేతీసి దాచి పెట్టాను బాబుగారూ! ఇదిగో హొండీ. ఇందులో యిరవైరెండు రూపాయలున్నాయి బాబూ! ఏదో కాస్త చవకలో ఆ అలారం గడియారం కొనిపెట్టండి.....నాకేమో బజారు వెళ్ళేందుకు ఎప్పుడూ తీరదు. పైగా వాటి సంగతి అంతగా తెలియకుండా పోతే ఏం మోసం చేస్తారో

అని భయం. మీరటాల్లా బజారుకు వెళ్ళినప్పుడు మంచిదిగా చూసి ఒక గడియారం కొని తెస్తే మీ మేలు మరిచిపోను" అన్నాడు.

కాళిదాసు హుండీ చేతిలోకి తీసుకుంటూ చలించిపోయాడు. అతని హృదయం కరిగిపోయింది. ఒక్క క్షణం ఆగి "అలాగే తెస్తాను" అన్నాడు. ఆ వ్యక్తి చేతులు జోడించి "వెళ్ళొస్తా బాబుగారూ! అన్నట్టు వాడి కీవిషయం యిప్పుడే చెప్పబోకండి" అని పంచలో పక్కకువెళ్ళి కొడుకుతో "నేనింటికి పోతున్నా" అని చెప్పి వెళ్ళిపోయాడు. పుచ్చపువ్వు వంటి వెన్నెలలో గంభీరంగా అడుగులువేస్తూ నడిచిపోతున్న ఆ కష్టజీవివంక కనిపించినంతసేపు చూసి కాళిదాసు లోపలికి వెళ్ళిపోయాడు.

మురళీ రూబెనూ అతని వెనకనే లోపలికి వచ్చారు. రూబెన్ "మేష్టారూ? మా నాన్న మీతో ఏం మాట్లాడాడు?" అని అడిగాడు. కాళిదాసు హుండీని వారికి కనుపించకుండా అలమారులో వుంచి తలుపుమూసి "మావాడు ఈసంవత్సరం పెద్ద పరీక్షల్లో గట్టెక్కే ఆశ ఏమైనా వుందా?" అని అడిగాడు. నేను ఉన్న విషయం చెప్పాను" అన్నాడు. మురళి నవ్వి "ఏం చెప్పారు?" అని అడిగాడు. కాళిదాసు లాల్చీవి విప్పుతూ "అదే. మీ యిద్దరూ "తెలివైన వాళ్ళేకాని చదువుమీద ధ్యాస లేద"నీ, "కష్టపడి చదవకపోతే పరీక్షల్లో గట్టెక్కే విషయం ఇప్పుడే చెప్పలే"ననీ చెప్పాను. ఇంక వెళ్ళి చదువుకోండి" అన్నాడు.

వారిద్దరూ చదువుకునేందుకు వెళ్ళిపోయారు. గడియారం ఎనిమిగంటలు చూపిస్తున్నది.

చల్లనిగాలి తెరలు తెరలుగా వీస్తున్నది. అప్పలమ్మ చాపమీద పసిపిల్లవాడి పక్కన పడుకుని తూగుతున్నది.

కాళిదాసు దీపం చేతిలోకి తీసుకుని పిల్లవాడి మీదికి వంగి చూశాడు. పసివాడు ముచ్చటగా వున్నాడు. అప్పలమ్మ మధ్యాహ్నం చెప్పిన విషయం అతిశయోక్తికాదు. నిగనిగలాడే శరీరమూ, బొద్దుగా వున్న కాళ్ళూ, చేతులూ....చక్కగా అమరిన ముక్కూ, నోరూ, పెద్ద పెద్ద కళ్ళూ....పిల్లవాడు ముద్దులు మూటగడుతున్నాడు.

కాళిదాసు నిట్టూర్చి "ఆ తల్లి ఎంత దురదృష్టవంతురాలు!" అనుకుని వంటయింట్లోకి వెళ్ళిపోయాడు.

(సశేషం)

ఆదర్శాలు-అంతర్యాలు

(21-వ పేజీ తరువాయి)

చూశాడు. తను రావడం వాళ్ళకు ఇష్టంలేదని గ్రహించిన రాజారావు "నాకు వేరే పనుంది. మళ్ళీ మీ దర్శనం చేసుకుంటాలెండి" అన్నాడు మంత్రితో. నరసింహప్పకు, రాజారావుకు మధ్యవున్న మనస్పర్థలు తెలియని మంత్రిగారు "పోవచ్చులే—రావయ్యా — చాలాకాలానికి కలిశాం, ఇవ్వాళ నాతో ఉండిపోవాల్సిందే" అన్నారు. మంత్రిగారు అలా అనడంతో నరసింహప్పకు రాజారావును ఆహ్వానించక తప్పిందికాదు. ఆయన మనఃప్రవృత్తికి రాజారావు నవ్వుకున్నాడు. నిజానికి మంత్రితో వెళ్ళడం రాజారావుకూ ఇష్టంలేదు. ఆయనతో వెడితే తనుకూడా విందులో పాల్గొనవలసి వస్తుందనీ, మాటలసందర్భంలో స్థానికంగా ఉన్న రాజకీయాలను గూర్చి చెప్పవలసివస్తుందేమోనని తప్పించుకోటానికి ప్రయత్నించాడు. కాని మంత్రిగారు బలవంతం చేయడంతో బాగుండదని ఆయనతోపాటు కారెక్కాడు.

భోజనాలైనతరువాత "మీరు విశ్రాంతి తీసుకుంటారేమో—నేను వెడతాను" అంటూ రాజారావు లేచాడు. మునసబు నరసింహప్పకు కళ్ళతోనే ఏదో సూచించాడు. ఇతడు ఎప్పుడు వెళ్లిపోతాడా అని ఎదురుచూస్తున్న నరసింహప్ప "అవును .... మంత్రిగారు విశ్రాంతి తీసుకుంటారు .... మళ్లీ సాయంత్రం బహిరంగసభ ఉందిగా; మీరు వెళ్లండి" అన్నాడు. అది విని "మీరు విశ్రాంతి తీసుకోండి నరసింహప్పగారూ, మే మిద్దరం ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటాం" అన్నారు మంత్రి.

నరసింహప్పకు అక్కడే ఉండాలని ఉంది. కాని మంత్రిగా రేమనుకుంటారోనని మునసబుతో తన గదిలోకి వెళ్లిపోయాడు.

"నీవు నా మనస్సుకు చాలా బాధకలిగిస్తున్నావ్ రాజారావ్" అన్నారు మంత్రి.

"అదేమిటి—నేనేం చేశాను ?" ఆశ్చర్యంతో అన్నాడు రాజారావు.

"నేను మంత్రిగా ఉన్నంతమాత్రాన మన స్నేహం మరచిపోయా ననుకున్నావా ? మనిద్దరం కలిసి పనిచేశాం. సమానంగా ఇద్దరం జైల్లో కష్టపడ్డాం. నీవంటే నీవని పిలుచుకునేవాళ్లం. నీవు అవన్నీ మరచిపోయి, నీ ఉనికినే నాకు తెలియకుండా చేశావు. పైగా ఎన్నాళ్లకో ఆత్మీయుడివైన స్నేహితుడివి కలిశావుకదా అని పలుకరిస్తే నన్ను 'మీరు', 'తమరు' అని పిలుస్తూ కించపరుస్తున్నావు" అన్నారు.

"ఇందులో తప్పేముంది. మీరు ప్రజానాయకులు. రాష్ట్రాన్ని పాలించే మంత్రులు. సామాన్యుడైన నేను మిమ్మల్ని గౌరవించడం నా ధర్మం" అన్నాడు రాజారావు.

"బాబ్బాబు—కాస్సేపు ఈ స్తోత్రపాఠం కట్టిపెడుదూ .... పదవీకాంక్ష నాలో ఉన్నమాట వాస్తవమే ! పరిస్థితుల ప్రభావంవల్ల, అదృష్టంవల్ల మంత్రిని కాగలిగాను. కాని ఈ మంత్రిపదవి ముళ్లకిరీటం వంటిది. ఈ పదవిలోకి వచ్చినతరువాత నాకు ఆత్మీయులొక్కరూ కనిపించలేదు. కులాసాగా పిల్లలతో కాలక్షేపంచేయడానికీ వీలులేకుండా ఉంది. నేను మంత్రినయ్యాక నాతో మార్పుకలిగినా, కలగకపోయినా, నా మిత్రుల్లో మటుకు మార్పుకలిగింది. కొందరు నన్ను అర్థంచేసుకోలేకపోతున్నారు. నేను వారిని అర్థంచేసుకోడానికి సమయం లేకపోతున్నది. కొందరు నన్ను తమ స్వార్థానికి వినియోగించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. వారికి సహాయపడకపోతే శత్రువర్గంలో చేరుతారేకాని తాము కోరింది సక్రమమైంది అవునా కాదా అన్నది విచక్షణచేయరు. ఒక్కోసారి ఈ పదవినుండి, రాజకీయాలనుండి వైదొలగి ఎక్కడికైనా దూరంగావెళ్లి ప్రశాంతజీవితం గడపాలని ఉంటుంది. కాని నాలోని ఏ బలహీనతో ఆపని చేయనివ్వదు. ఒకవేళ నేను అందుకు పూనుకున్నా పరిస్థితులు కదలనివ్వవు" అని తన ఆవేదనను ఆత్మీయుడైన రాజారావుముందు తెలుపుతుంటే మనస్సు విప్పి మాట్లాడుతున్నట్టు అనిపించింది అతనికి.

"పదవుల్లో ఉండి నీలా భావించేవాళ్లు చాలా తక్కువగా ఉంటారు. ఆత్మపరిశీలన చేసుకోగల ఒక్కమిత్రుడైనా నాకు ఉన్నందుకు సంతోషంగా ఉంది" అన్నాడు రాజారావు.

"ప్రతివాడికీ ఆత్మపరిశీలన అవసరమే. కాని ఆత్మపరిశీలనచేసుకొని కూడా తప్పుదార్ని త్రొక్కేవాళ్లు ఎంతమంది లేరు .... సరే ..... ఈ సంగతుల కేంగాని నీ విషయం చెప్పు .... మళ్లీ ఇక్కడ ఎన్నికలొస్తున్నాయిగా, నీవు ప్రయత్నించరాదూ ?" అన్నారు మంత్రిగారు.

"ఇక్కడ అంతా అనుకుంటున్నారు, నేను ఎన్నికలలో నిలబడతానని. కాని నా కా ఉద్దేశం లేదు. నా నిర్మాణకార్యక్రమం నాకుంది చాలు".

"ఎక్కడున్నావు గొంగళీ అంటే వేసిన చోటే అన్నట్టుంది నీ వ్యవహారం."

ఇంతలో అక్కడకు శాయిలు వచ్చి, మంత్రికి, రాజారావుకు దండంపెట్టి "బాబూ ! .... అమ్మాయిగారు ఓపాలొచ్చి మాటాడి పొమ్మన్నరు" అన్నాడు.

"సరే .... వస్తాలే పద" అన్నాడు రాజారావు.

శాయిలు వెళ్లిపోయాడు.

"ఎవరామె ?"

"నరసింహప్పగారి పెద్దమ్మాయి. మొన్నటివరకూ నే నామెకు ప్రైవేటు మాస్టరునిలే."

"ఇప్పుడు మానేశారా ?"

"ఆమె భర్త అమెరికాలో ఉన్నాడు. ఆయన స్వదేశం వచ్చేలోగా తను ప్రైవేటుగా మెట్రిక్ పరీక్ష ఇద్దామని ఉందామెకు. నన్ను మానిపించి నరసింహప్పగారు ఇక్కడ స్కూలులో పనిచేసే మాస్టరిని పెట్టారు."

"నిన్నెందుకు మాన్పించాల్సి వచ్చింది ?"

"దానికి చాలా కారణాలున్నాయి .... సరే—కాస్త విశ్రాంతి తీసుకో—మళ్లీ కలుస్తా" అంటూ లేచాడు రాజారావు.

"సాయంత్రం మీటింగు కాగానే వెళ్లిపోతా ! నాతోపాటు రాగూడదూ, నాలుగు రోజాలుండి వద్దువుగాని."

"ఇప్పుడు రాలేను. చాలా పనులున్నాయి ఇక్కడ."

"సరే .... నీ ఇష్టం ...." అన్నారు మంత్రి.

* * *

ఇందిరకు ఇరవై ఏళ్ళుంటాయి. చక్కటి అంగసౌష్ఠవం కలిగి ఆకర్షణీయంగానే ఉంటుంది. కళ్లల్లోంచి చిలిపితనం పలకరిస్తుంటుంది. మాటల్లో చురుకుదనం అంతగా లేకపోగా పెళుసుదనం కనిపిస్తుంది.

అప్పటికి ఊళ్లో ఉన్న మిడిల్ స్కూలు చదువు ముగించుకొని ఇంట్లో కూర్చుంది ఇందిర. వాళ్లవంశంలోని ఆడవాళ్లలో అంతవరకు చదువు కున్నవాళ్లుకూడా లేకపోవడంవల్ల ఆ చదువే ఆమెకు గొప్పదిగా తోచింది. మొగపిల్లలు పట్నంలో ఎలాగూ చదువుతున్నారు కదా, ఇందిరనికూడా ఇంకా చదివిద్దామనుకున్నాడు నరసింహప్ప. కాని "పిల్ల పెద్దదైంది—ఇంకా చదువెందుకు, త్వరలో సంబంధమేమైనా చూడండి" అంది భార్య. ఇందిరముత్తువ నరేసరి. "ఇంకా చదువేమిటి నా బొంద" అని దౌడలు నొక్కుకుంది.

పెళ్లినాటికి ఇందిరకు పందొమ్మిదోఏడు వచ్చింది. పెళ్లయిన మూడునెలలకే భాస్కరం అమెరికా వెళ్లాడు. ఆ మూడు నెలల్లో కూడా ఆ దంపతులు ఒక నెలైనా కలిసి ఉండలేదు. ఆ కలసిఉన్న కొద్దిరోజుల్లో అనురాగంగానే ఉన్నా భాస్కరం ఆమెకు చదువులేదని చెప్పేవాడు. ఇందిర బాధపడేది. "ఏం—నేను ఎక్కువగా చదువు కొన్నట్లయితే ఉద్యోగం చేయించేవారా ?" అంటూ నవ్వు తెచ్చిపెట్టుకునేది. ఆమె వ్యంగ్యంగా అనా లని అనకపోయినా అతనికి మాత్రం పెళుసుదనం వినిపించేది.

"నేను ఆమెరికానుంచి వచ్చేవరకు గోళ్లు గిల్లుకుంటూ కూర్చోక చెదువుకుంటే బాగుం టుంది. నీకు కాలక్షేపమూ అయినట్టు ఉంటుంది— పరీక్ష ప్యాసయినదానవూ అవుతావు" అని భాస్కరం అంటే 'సరే' నంది.

నరసింహప్పకు రాజారావు తాతగారితో ఉన్న పరిచయంవల్ల రాజారావును ఇందిరకు ప్రైవేటు చెప్పడానికి కుదిర్చాడు. ఫీజు ఇంతిస్తానని ఆయనా చెప్పలేదు, రాజారావు ఇంతివ్వమని అడగనూ లేదు. ఇటు పోలాయికీ, అటు ఇందిరకూ ఒకే రోజున పాఠాలు ప్రారంభించాడు రాజారావు.

ఇందిరకు చదువుమీద శ్రద్ధలేదని మొదటి వారంలోనే తెలుసుకున్నాడు రాజారావు. చెప్పిన పాఠం చదివేది కాదు. ఇచ్చిన లెక్కలు మరునాటికి చేసి చూపేదికాదు. దొరవారింటి వయసుపిల్ల మరి! ఏంచేయాలో తోచక "ఏపనిచేసినా శ్రద్ధ చూపాలి. ఆపని సాధించడానికి పట్టుదల ఉండాలి" అని ఆ వారం రోజుల్లో కనీసం వందసార్లయినా సిద్ధాంతం చెప్పిఉంటాడు రాజారావు.

"అలాగేనండీ" చిరునవ్వుతో అనేది ఇందిర.

ఆమెకు చదువుమీద శ్రద్ధకలిగించేప్పటికి నెలరోజులు పట్టింది. ఈ నెలరోజుల్లో రాజారావు పాఠ్యపుస్తకాలు చెప్పడంకంటే విజ్ఞానవిశేషా లను గురించి, వాటిని తెలుసుకోవలసిన ఆవశ్య కతనుగూర్చి చెప్పేవాడు. ఆమెకు చదువుమీద ఉత్సాహం కలిగేట్టు కథలు, గాథలు చెప్పేవాడు. ఉపాధ్యాయుడికీ, విద్యార్థికీ మధ్య ఉన్న గంభీర వాతావరణాన్ని, బెరుకుతనాన్ని పోగొట్టి, ఒకవిధ మైన ఆప్యాయత, ఆత్మీయతావాతావరణాన్ని కల్పించాడు. దానితో ఇందిరకు రాజారావుదగ్గిర చొరవ ఏర్పడింది. దానితో చదువుకోవాలన్న ఉత్సాహమూ కలిగింది.

ఒకవిషయాన్ని గురించి చెప్పవలసివచ్చి

ఆదర్శాలు-ఆంతర్యాలు

నప్పుడు రాజారావు డొంకతిరుగుడు లేకుండా సులభంగా ఆమెకు అర్థమయ్యేట్టు చెప్పేవాడు. మొదట్లో ఇందిర "ఇక మాస్టారు వస్తారేమో" నని విసుగుపడేది. తర్వాత తర్వాత "మాస్టా రింకా రాలేదేమా" అని ఎదురుచూసేది.

రాత్రుళ్లు ఆమెకు భాస్కరం జ్ఞాపకం వచ్చే వాడు. అతను లాలించడం, తను అతని మెడను చుట్టివేసి దగ్గరకు తీసుకోడం అన్నీ ఊహల్లో మసిలేవి. ఆ తీయటి తలపులతో ఉద్విగ్నురా లయ్యేది. తన నెవరో రెచ్చగొడుతున్నట్టు భావిం చేది. ఏదో చెయ్యాలని, ఏదో అనుభవించాలి అన్న ఉద్రేకం కలిగేది. ఆమె ఆలోచనల్లోకి తెలియ కుండానే రాజారావు వచ్చేవాడు. మొదట్లో 'మంచి వాడు' అనుకునేది. తర్వాత తర్వాత "అందగాడే" అన్న భావం ఉందయించి స్థిరపడి పోయింది. "ఇంకా నిద్దర రావడంలేదా అక్కా" అని లలిత

"సిగరెట్లు కాల్చకపోతే పని చేయలేనండి. కాని సిగరెట్లు కాల్చకూడదని డక్టరు ఖచ్చి తంగా చెప్పేశాడు. అందువలన మూనేశానండి"

"మంచిపని చేశారు. ఇంతకీ దేన్ని మానేశారు?"

"పనిచేయడం."

యస్. యస్. రాఘవన్ (చింతపల్లి)

అడిగితే—"ఉహూఁ .... నీకూ నిద్దర రావడంలేదా?" అనేది.

"లలిత కెందుకు నిద్దర రాలేదో ? అది దేన్ని గురించి ఆలోచిస్తున్నది ? తన స్కూలు పిల్లవా డెవడైనా జ్ఞాపకం వచ్చాడేమో" అనుకునేది.

రాజారావు ఇందిరకు చదువు చెబుతున్నప్పుడు లలిత కూడా అక్కడే కూర్చుని లెక్కలు చేసు కుంటూనో, నోట్సు వ్రాసుకుంటూనో ఉండేది. తనకు ఏదైనా సందేహం కలిగితే రాజారావును అడిగి చెప్పించుకునేది.

ఇందిర, లలిత ఒకేతల్లిపిల్లలైనా ఇద్దరి లోనూ ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. చామన చాయలో చక్కటి ముఖ వర్చస్సుతో లలిత పసి అందాలు చిందేది. ఆమె కాటుకకళ్లు కాంతు లీనడమేగాని మాట్లాడటం గట్టిగా నేర్చుకో లేదు. తీర్చిదిద్దినట్టు కనుబొమలు, ఫాలభాగాన్ని ముద్దిడుతున్నట్టు ముంగురులు, కొటేరు వేసినట్టు ముక్కు ఇట్టే ఆకర్షిస్తాయి. ఒక్కోసారి ఇందిరే లలితనుచూసి అసూయపడేది. లలిత చురు కైంది. ఏవిషయమైనా నిశితంగా తెలుసుకో డానికి ప్రయత్నిస్తుంది. ఊళ్లోని మాధ్యమిక పాఠశాల ఉన్నతపాఠశాల కావడంవల్ల లలిత చదువు కొనసాగుతూ వచ్చింది. లలిత చదవడం ఆమె తల్లికి, ముత్తవకు అంత ఇష్టంలేక పోయినా, లలిత చదువుమీద ఉత్సాహం చూపడం మంచిమార్కులు తెచ్చుకోవడంవల్ల నరసింహప్ప ఆమెను ప్రోత్సహించాడు. "ఈ ఏటితో లలిత చదువు అయిపోతుందిగా, ఇప్పటినుంచే సంబం ధాలు చూడండి" అని నరసింహప్పభార్య తొందర పరుస్తున్నది.

ఓరోజు రాజారావు మామూలుగానే ఇందిరకు చదువుచెప్పడానికి వచ్చాడు.

"మీకోసమే చూస్తున్నా — ఇంకా రాలేదేమా అని .... రండి ...." అంటూ గదిగుమ్మంలోనే ఎదురై ఇందిర చిరునవ్వుతో పైట సర్దు కుంటూ లోపలకు ఆహ్వానించింది." ఇప్పుడే వస్తా — కూర్చోండి" అంటూ అతని కళ్లల్లోకి తొంగిచూసి నవ్వుతూ లోపలికి వెళ్లింది.

"ఇందిర చాలా చలాకీగా ఉందే ఇవ్వాళ్ల .... భర్తదగ్గరినుంచి ఉత్తరం వచ్చిందేమో" అను కున్నాడు రాజారావు.

వెండిపళ్లెంలో రెండు కజ్జకాయలు, కారపు బూంది, మరోచేత్తో వెండిగ్లాసుతో నీళ్లు పట్టుకొచ్చి రాజారావుముందు పెట్టి "టిఫిన్ తీసుకోండి" అంది ఇందిర.

"ఇప్పు డివన్నీ ఎందుకు ?" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు రాజారావు.

"ఇవ్వాళ్ల నా పుట్టినరోజు" అంది నవ్వుతూ.

"అందుకా—ఈ కొత్తచీర, అలంకారమూ" అనుకుంటూ, "అలాగా—అయితే ఇవ్వాళ్ల పాఠాలు చెప్పనక్కరలేదన్నమాట" అన్నాడు.

"ఉహూఁ .... ఏవైనా సర్దాగా కబుర్లు చెప్పండి .... మొదలు టిఫిన్‌చేయండి" అంది ఇందిర, చిలిపితనంచూపే నంగిమాటలతో.

"ఈమెకు సరదాకబుర్లు నేనేం చెప్పగలను" అనుకుంటూ రాజారావు "నాకు తీపి సయించదు .... ఇవి తీసెయ్యి ఇందిరా" అన్నాడు.

"మీకు కారమే బాగా ఇష్టమన్నమాట — తీపి కిట్టదా !"

"అబ్బే—అదేంలేదు. నిజంగా నేను తీపి ఎక్కువ తినను."

"ఎక్కువ తినమనడం లేదుగా మిమ్మల్ని. పెట్టిందే రెండు. అవికూడా వద్దంటారేం .... ఊఁ.... తీసుకోండీ" అంటూ ఇందిర వెండిపళ్లెం లోంచి ఒక కజ్జికాయ తీసి అతనినోటికి అందివ్వ పోతే రాజారావు కాస్త వెనక్కుతగ్గి దానిని ఆమె చేతిలోంచి అందుకున్నాడు. ఇంతలో లలిత "అక్కా .... అక్కా" అంటూ అక్కడకు వచ్చే ప్పటికి "ఏమిటే" అంటూ ఇందిర కాస్త పక్కకు జరిగి కూర్చుంది.

"జానకి వచ్చిందే నీకోసం. అమ్మ ఓసారి రమ్మంటున్నది" అంది లలిత.

"మాస్టారికి కాఫీ యిచ్చి వస్తాలే — అందాకా నీవు దాంతో మాట్లాడుతూ ఉండు" అంది ఇందిర.

"కాఫీ నే నిస్తాలే—మాస్టారికి, నిన్ను అమ్మ తొందరగా రమ్మంది" అని లలిత అనేప్పటికి

ఇందిరకు వెళ్ళక తప్పిందికాదు. వెడుతూ రాజారావువంకచూసి "నే వొచ్చిందాకా ఉంటారు కదూ" అంటూ వెళ్ళింది.

"రాజారావు మౌనంగా టిఫిన్ తింటున్నాడు. ఎదురుగా లలిత ఉండటంవల్ల కాస్త ఇబ్బందిగా ఉందతనికి. లలిత అది కనిపెట్టి "కాఫీ తెస్తా" నంటూ గదిలోంచి వెళ్ళింది. ఆమె తిరిగి వచ్చేలోగా రాజారావు టిఫిన్ పూర్తిచేశాడు. లలిత కాఫీకప్పు చేతికందిస్తూ అప్రయత్నంగానే అతని కళ్ళల్లోకి చూసింది. ఆమెచూపు బలంగా రాజారావును ఆకర్షించింది. "కాని ఇందిర అంత చిలిపిదీ కొంటెదీ కాదు" అనుకున్నాడు.

లలిత ఏదో చెప్పాలని అతని కళ్ళల్లోకి చూసి ఏమీ చెప్పలేకపోయింది. ఆమె చూపుల్లోనే ఆమె మనోభావాల్ని చదువుకున్నాడు రాజారావు. లలిత కళ్ళు రాజారావును పెనవేసుకున్నాయి. ఆమె చూపుల్లోని భావం రాజారావు గుర్తించాడు. అతని సర్వాంగాల్లోనూ మొదటిసారిగా లౌల్యం ప్రసరించినట్లయింది. ఆమెకు తనమీద కలిగిన అభిప్రాయాన్ని మొదట్లోనే త్రుంచివేయాలనుకున్నాడు. కాని ఎలా చెప్పడమో అతనికి తోచలేదు. అందువల్లనే ఇద్దరూ మౌనవ్రతం పూనారు. ఇంతలో రాజారావు కూర్చున్నవైపు కిటికీలోంచి పిల్లి అతనిమీదకు దూకి 'మ్యావ్' అంటూ పరుగెత్తింది. రాజారావు పరధ్యానంగా ఉండటంవల్ల ఉలిక్కిపడ్డాడు. లలిత కిలకిల నవ్వింది. "ఇంత భయపడ్డారేం—పిల్లిని చూసి" అంటూ మళ్ళీ నవ్వుతున్నది లలిత. అతనికీ నవ్వు వచ్చింది. ఇద్దరూ గలగల నవ్వుతూండగా ఇందిర గదిలో ప్రవేశించి "ఏమిటి ఇద్దరూ అట్లా పగలబడి నవ్వేస్తున్నారు" అంది ఆశ్చర్యంగా.

"ఏంలేదక్కా—పిల్లిని చూసి మాస్టారు భయపడ్డారు" అని మళ్ళీ నవ్వింది లలిత.

"అన్నీ అబద్ధాలు. పరధ్యానంలో ఉండగా పిల్లి వెనుకనుంచి మీదకు దూకింది ఇందిరా—కాస్త ఉలిక్కిపడ్డాను. నే నుత్త పిరికివాడి నన్నట్టు మీ చెల్లెలు పగలబడి నవ్వేస్తున్నది" అన్నాడు రాజారావు.

"ఓస్ .... ఇంతేనా .... ఇంకేంజరిగిందో ననుకున్నా .... సరేగాని లలితా, అమ్మ పిలుస్తున్నదే నిన్ను" అంది ఇందిర.

"సరే"నంటూ చిరునవ్వులతో రాజారావును గ్రుచ్చిచూసి వెళ్ళిపోయింది.

"ఇవ్వాల్టికి పాఠాలు లేవుగా .... నేనుకూడా వెడతా" అంటూ లేచాడు రాజారావు.

"వెళ్ళవచ్చులే—కూర్చోండి" అంటూ ఇందిర అతని చెయ్యిపట్టుకుని ఆపుచేసింది.

ఇందిరచొరవకు రాజారావు ఆశ్చర్యపడ్డాడు.

"అంత చక్కగా పాఠాలు చెబుతారుకదా—ఉత్తప్పుడు అంత ఇదిగా మాట్లాడరేం ?" అంది.

"ఏముంది మాట్లాడటానికి ?"

"ఏం—నాతో మాట్లాడకూడదా ?"

"మాట్లాడుతూనే ఉన్నాగా."

తల వంచుకొని ఇందిర నవ్వి ఊరుకుంది.

అక్కడ ఉండటం ఎంతో ఇబ్బంది అనిపించింది రాజారావుకు. "ఇక నేను వెడతా"నంటూ చరచర గదిలోంచి బయటకువచ్చి మేడమెట్లు దిగి వెడుతున్నాడు. ఇందిర గదిలోంచి బయటకు వచ్చి అతనివంకే చూస్తూ నిలబడిపోయింది. ఆమె నిట్టూర్పును రాజారావు వినలేదు.

* * *

గదిలో కూర్చుని కిటికీలోంచి చూస్తున్నది ఇందిర. రాజారావు వస్తూ కనిపించాడు. ఇందిర లేచి పమిట నిండుగా కప్పుకొని అతనికి ఎదురుగా వెళ్ళి "రండి—లోపలికి" అంది.

రాజారావు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"నామీద కోపం వచ్చిందికదూ ?" అతని కళ్ళల్లోకి చూస్తూ అంది ఇందిర.

"బాగుంది .... మీమీద నాకేంకోపం ?"

"మరి ప్రైవేటు చెప్పడం మానేశారేం ?"

"ఆవిషయం నన్నడిగితే ఏం లాభం ? మీ నాన్నగారిని అడుగు."

"మా నాన్నగారే మిమ్మల్ని వద్దన్నారా ? ఎందుకు ?"

"అదికూడా ఆయన్నే అడుగు."

ఇందిరకు ఏమీ అర్థంకాలా. బైట జరుగుతున్న రాజకీయ వ్యవహారాలు కొన్ని చూచాయగా తెలుసేకాని రాజారావు అందులో ప్రముఖపాత్ర అని ఆమె అనుకోలేదు. బహుశా తనవిషయంలో అనుమానంతో అతణ్ణి మానిపించారేమో ననుకుంది.

"నాన్నగారితో నేను మాట్లాడుతా .... నాకు మీరే వచ్చి పాఠాలు చెప్పాలి" అంది ఇందిర.

"సీతారామయ్యగారు చెబుతున్నారుగా— మళ్ళీ నేనెందుకు ?" అన్నాడు రాజారావు.

"ఆయన చెప్పేది నాకు అర్థంకావడంలేదు. నేను అర్థం చేసుకుంటున్నదీ లేనిదీ ఆయనకు అక్కరలేదు."

"మళ్ళీ నేను చదువు చెప్పడం జరగనిపని ఇందిరా ! మీ నాన్నగారు ఒప్పుకోరు—పైగా నాకు తీరుబడిలేదు."

ఇందిర ఏదో ఆలోచిస్తూ కూర్చుంది.

"ఇక నేను వెడతాను" అంటూ లేచాడు రాజారావు.

"పోనీ రెండుమూడు రోజుల కొకసారైనా మా ఇంటికి రాకూడదూ ?" అంది ఇందిర.

"ఎందుకు—అనవసరంగా."

"లలితకోసం .... అది నిద్దర్లోకూడా మిమ్మల్నే స్మరిస్తున్నది."

"నన్నా ?" ఆశ్చర్యంగా రాజారావు ఆమెవంక చూశాడు.

"నాకంతా తెలిసింది. అది మిమ్మల్ని ప్రేమిస్తున్నది. మీరుకూడా దాన్ని ...." ఆమె వాక్యం పూర్తికాకుండానే రాజారావు అందుకొని "నాకా ఉద్దేశం లేదు ఇందిరా !" అన్నాడు.

"అటువంటప్పుడు మీరు లలితమనస్సును ఎలా గిలిగింతపెట్టగలిగారు ?" నిలదీసి అడుగుతున్నట్టుగా ఉంది ఆమెస్వరం.

రాజారావేం మాట్లాడలేదు.

"లలిత నాలా చంచలస్వభావం కలదికాదు. మీరు నన్నూ ఆకర్షించారు. ఉద్రేకపడ్డాను. ఆ ఉద్రేకంలో బహుశః మీమీద మితిమీరిన చనువు తీసుకున్నాను. క్షమించండి. మీరూ ఉద్రిక్తపడితే ఏమయ్యేదో చెప్పలేను. అలా జరగనందుకు భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఆరోజుగడిచిన మర్నాడు మీరు పాఠం చెబుతూ శీలాన్నిగురించి, నైతికబలాన్ని గూర్చి వివరించారు. అది నాలో నేను మననం చేసుకున్నాను. అప్పటినుంచే మీమీద పూజ్యభావం ఏర్పడింది. నేను మిమ్మల్ని గురించి ఎంత కోరికగా ఆలోచించానో అంతగా నన్ను నేను తిట్టుకున్నాను. .... కాని లలిత అట్లాకాదు. మొదటినుంచి మిమ్మల్ని గురించి దానితో ఓ స్థిరమైన భావం ఏర్పడింది. అది బలపడటానికి మీరు నాపట్ల మీ ప్రవర్తనద్వారా దోహదమిచ్చారు. దానిని మీరు నిర్లక్ష్యంచేయకండి" అంది ఇందిర.

"మనకు ఆశయాలు, ఆదర్శాలు చాలా ఉంటాయి ఇందిరా ! అవి నెరవేర్చుకోడానికి ఎన్నో అవరోధాలు. ప్రేమించడం, ప్రేమించకపోవడం, ఆదరించడం, ఆదరించకపోవడం మనలోనే ఉన్నా దానికి ప్రతికూలవాతావరణం ఉన్నప్పుడు ఏదీ జరుగదు. పరిసరాలు, పరిస్థితులు అవగాహన చేసుకోవాలి. అంతస్థుల తారతమ్యం గమనించాలి. సుందరమూ, శుభకరమూ అయినత్ భగవ స్వరూపాన్ని అందరూ ప్రేమిస్తారు, ఆరాధిస్తారు. ఆ ప్రేమలోను, ఆరాధనలోను కొంత వ్యత్యాసం ఉండవచ్చు. లోకం దాన్నే ఆడంబరమూ—నిరాడంబరమూ అనవచ్చు. ఉన్నవాడు బంగారు ఉద్ధరిణతో భగవంతుణ్ణి జలకమాడించవచ్చు. లేనివాడు పుష్పంతోనే భగవానుడిపై నీళ్ళు చల్లవచ్చు. నేనూ అలాగే లలితను ప్రేమిస్తున్నాను. త్యాగంచెయ్యడంలోనే ఘనత ఉందంటారు. దానిని నాకు ఆపాదించుకున్నప్పుడు 'త్యాగం' అని గర్వపడను. అసమర్థత అనుకుంటాను. లేదా పరిస్థితుల ప్రాతికూల్య మనుకుంటాను."

"ఆగిపోయారేం ...." అంది ఇందిర.

రాజారావేం మాట్లాడలేదు.

"మీరు ఏవేవో పెద్దపెద్ద మాటలు చెప్పారు. కొంతవరకు అర్థం చేసుకున్నాను. పరిస్థితులు అనుకూలిస్తే మీరు లలితను కాదనరు గదూ !" అంది ఇందిర వాగ్దానం తీసుకుంటున్నట్టు.

"నీవు ఉత్త అమాయకురాలవనీ, చిలిపిదానివనే అనుకున్నా. ఇంత గడుసరివనుకోలేదు. పరిస్థితులు ముందు ముందు మరీ ప్రతికూలంగా మారవచ్చు ఇందిరా ! ఎందుకైనా మంచిది—లలితను నన్ను మరచిపోయేట్టు చెయ్యి .... ఇక నేను వెళ్తోస్తా" అంటూ రాజారావు గదిలోంచి బయటకువచ్చి చరచర మెట్లుదిగి మంత్రి గదిముందుకు వెళ్ళాడు. మంత్రిగారి గదిముందు కూర్చున్న బంట్రోతు నిద్దర పోతున్నారని చెప్పేటప్పటికి రాజారావు ఇంటిముఖంపట్టాడు.

(సశేషం)

నిన్ను పూర్తిగా అర్థం చేసుకొన్నాను

(17-వ పేజీ తరువాయి)

టానికా? నాతో నీకేమవసరం శారదా?" అన్నాడు. ఈ దెప్పిపొడుపు శారదమనసును కెలికినా పట్టించుకోకుండా "ఇంత జ్వరంలో నువ్విక్కడ ఉండకు—మా ఇంటికి వచ్చెయ్యి" అంది.

"రాను—ఒక్కనాటికీరాను"—మొండిగాఅన్నాడు అతని కంఠంలోని స్థిరత్వాన్ని గమనించింది శారద—ఇక అతనిని కదపటం తనవల్ల అయ్యే పని కాదనీ గుర్తించింది.

"సరే! అయితే నేనే ఇక్కడ ఉండిపోతాను" అంది స్థిరంగా.

"వీల్లేదు" విసురుగా అన్నాడు.

"నువ్వేమన్నావరే నే నిక్కడ్నుంచి కదలను—నన్ను మెడపట్టుకుని గెంటేస్తావా?" శారద కళ్ళలో నీళ్ళుతిరిగాయి.

ఈసారి వాసు తనకంఠంలోకి కాఠిన్యాన్ని తెచ్చుకోలేకపోయాడు.

"నువ్వు నా కెవరని నాదగ్గరుంటా నంటున్నావూ? పరాయివాళ్ళచేత పనులు చేయించుకోవడం నా కిష్టంలేదు" 'పరాయి' అన్న పదాన్ని నొక్కిపలికాడు వాసు—

అతని పెంకితనానికి శారదకు నవ్వు వచ్చింది.

"నేను నీ మరదల్ని" అంది.

"ఎంత మరదలివయినా ఒకరింటి ఇల్లాలివయినతరువాత పరాయిదానిక్రిందనే లెక్క. మరొకరిభార్య నా కెందుకు సపర్యలు చెయ్యాలి" శారదకళ్ళలోకి చూస్తూ అన్నాడు.

అతని మాటలలోని భావం శారద కర్థమయింది. క్రింది పెదవిని పళ్ళతో నొక్కి పట్టి చాలాసేపు ఆలోచించి చివరకు ఏడుస్తూ "నేను నీ దానిని బావా! నన్నిప్పుడు వెళ్ళగొట్టకు—' అంది. వాసు కొక్కసారిగా వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. శారద తలను తనచేతులతో లేవనెత్తి జ్వరంతో కాలిపోతున్న తన గుండెలమీదకు చేర్చుకున్నాడు. శారద నిర్లిప్తంగా కళ్ళు మూసుకుంది.

మానసికమైన సంతోషంవలననో శారద సపర్యలవలననో వాసు తొందరగానే కోలుకున్నాడు. కానీ, ఉండుండి "అబ్బ! నీరసం" అంటాడు—శారద వెళ్ళిపోతుందేమోననే భయంతో.

ఆరోజు నిండుచంద్రుణ్ణి చూస్తూ ఆ వెన్నెలలో శారద లావణ్యాన్ని ఊహించుకుంటూ డాబామీద కూర్చున్నాడు వాసు—అంతలోనే శారద అక్కడకు వచ్చి "మొన్ననే జ్వరంతగ్గింది ఇలా చలిగాలిలో కూర్చుంటే ఎలా బావా? క్రిందికి పద!" అంది.

ఆ క్షణంలో శారదను చూడగానే వాసుహృదయం పది వసంతాలు వెనక్కుగెంతింది.

కూర్చున్న చోటులోంచి లేచి శారద దగ్గరసా వచ్చాడు—శారద వెనక్కు తగ్గబోయి తమాయించుకుంది. వాసు హృదయారాటం ఇవన్నీ గమనించే స్థితిలో లేదు.

రెండు చేతులతోనూ శారదను దగ్గిరగా లాక్కుని గాఢంగా హృదయాని కదుముకున్నాడు. ఆపలేని తమకంతో ఆమెపెదిమలను తన పెదిమలతో కలిపాడు. తన వేళ్ళతో ఆమె చిబుకాన్ని పట్టుకుని అనురాగంగా ఆమెకళ్ళలోకి చూశాడు.

ఆ కనులలో సుడులు తిరుగుతున్న నీరును చూసి అదిరిపడ్డాడు వాసు—అప్రయత్నంగానే ఆమెను చుట్టిన అతని చేతులు సడలిపోయాయి. దూరంగా తొలిగి ఆమెముఖంలోకి పరిశీలనగా చూశాడు.

ఆమెలో ఏవికారమూ లేదు. చలనంలేని రాతిబొమ్మలా అర్థరహితంగా చూస్తూ అలానే నిలబడిఉంది. వాసు తలవంచుకుని గబగబ మెట్లు దిగి పోయాడు. శారద అలాగే దిగంతాలలోని శూన్యాన్ని చూస్తూ నిలబడిపోయింది.

ఆ మరునాడు వాసు ఆఫీసునుంచి ఇంటికి రాంగానే దుస్తులయినా మార్చుకోకుండా శారద దగ్గరకు వచ్చి "పద శారదా! నిన్ను మీ ఇంటి దగ్గర దింపివస్తాను" అన్నాడు.


శారద ఉలికిపడి అయోమయంగా అతని వంక చూసింది—"ఏమిటి బావా?" అంది.

వాసు సాధ్యమైనంతవరకూ తనముఖంలో ఏ భావమూ కనిపించకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ "ఇప్పటికే నిన్ను చాలా కష్టపెట్టాను. ఇక్కడ ఎన్నాళ్ళుండగలవూ?" అన్నాడు.

శారద భరించలేకపోయింది. చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ "ఎందుకు నన్నిలా చిత్రవధ చేస్తావు బావా? నన్నేనాటికీ అర్థం చేసికోలేవా?" అంది.


వాసుకికూడా కళ్ళు చెమ్మగిల్లాయి. శారద తలమీద చేయివేసి అప్యాయంగా నిమురుతూ "ఏడవకు శారదా! నేను నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాను. అందుకనే ఇంటిదగ్గర దింపి వస్తానన్నాను. అందుకనే—పద" అన్నాడు. శారద కళ్ళు తుడుచుకుని వాసు కళ్ళలోకి చూసింది. ఇన్నాళ్ళకు తనకు కావలసింది ఆ కళ్ళలో కనిపించినట్లయింది. తనుకూడా లేచి "పద" అంది.

చవితిచంద్రుని కాంతిలో వారి నీడలు మసకమసకగా సమాంతరంగా కదిలాయి. ★





విజయావారి 'జగదేక వీరునికథ'లో సరోజాదేవి.



రంజిత్ ఫిలిమ్స్‌వారి 'అకేలీమత్ జాయియో'లో రాజేంద్రకుమార్

చలనచిత్ర పరిశ్రమలో మాంద్యం: కారణ విచారణ

మాంద్యం అనేది ఒక రకమైన వ్యాధి. దీనికి బాహ్యరూపం మందకొడితనం. వ్యక్తిలో గాని, వ్యాపారంలోగాని ఈ మాంద్యం సోకినప్పుడు మానవుని ప్రవర్తనలో వ్యాపారాభివృద్ధిలలో ఈ మందకొడితనం ప్రతిబింబిస్తుంది. ఈ వ్యాధికి తగ్గ మందు వేయకపోతే మానవుడు క్షీణించినట్లే వ్యాపారం కూడా ఈ మందకొడితనంవల్ల క్రమక్రమంగా పతనమవుతుంది.

వ్యాపారరంగంలో చూస్తే అన్ని పరిశ్రమల వంటిదే చలనచిత్ర పరిశ్రమ కూడా. దీనికి ఈ మాంద్యం అప్పుడప్పుడు సోకుతూ ఉంటుంది. ఇప్పుడు పరిశ్రమ, ముఖ్యంగా భారత చలనచిత్ర పరిశ్రమ మాంద్యంవల్ల చాలా బాధలకు లోనౌతోంది.

ఇప్పుడు దేశంలో చలనచిత్ర నిర్మాణశాలలో నిర్మాణంలో ఉన్న చిత్రాల సంఖ్య తగ్గిపోతున్నది. ఈ శాలల సాంకేతిక విభాగాలు పనుల్లేక చేతులు ముడుచుకు కూర్చోటం, అందువల్ల యజమానులు కొందర్ని తప్పనిసరిగా తొలగించివేయాల్సి వస్తుందేమోనని ఆందోళనపడటం కూడా జరిగింది. బొంబాయి చిత్రరంగంలో సుమారు 1500 మంది నిరుద్యోగులయ్యే ప్రమాదం ఏర్పడింది. మద్రాసు కలకత్తాలలో కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది.

అసలు ఈ మాంద్యం ఏర్పడటానికి ముఖ్యమైన కారణాలేమిటి అనే పరిశీలన అవసరం. వాత బెట్టాలనుకుంటే కీలెరగమన్నారు పెద్దలు.

విడుదలైన చిత్రాలు విజయం పొందకపోవటం, చిత్ర ప్రదర్శనశాలలు "ప్రేక్షకులు కావలెను," అని అట్టకట్టే పరిస్థితి ఏర్పడటంతో మాంద్యం ప్రారంభమవుతుంది. ఇలా పది చిత్రాలు శరవేగంగా స్వస్థలాలు చేరితే చిత్రాలు తీసిన నిర్మాతలు, తీయాలనుకున్న నిర్మాతలు హడలెత్తి స్వగ్రామాలకు చేరిపోవటం చలనచిత్ర నిర్మాణశాలలో పనులు తగ్గి ఆ ఫ్లోరులన్నీ ఖాళీగా ఉండటం, ఎక్కువ సిబ్బందిని పోషించలేని, నిర్మాణశాల యజమాని తప్పనిసరిగా కొందరిని పనినుంచి తీసివేయటంలాంటి వాటితో ఈ చిత్రపరిశ్రమ మాంద్యం విచిత్రస్వరూపం ధరిస్తుంది.

గత నాలుగేళ్లుగా విడుదలైన చిత్రాల పరిశీలిస్తే ప్రస్తుత అనిశ్చిత పరిస్థితికి గల కారణం కొంతవరకన్నా బోధపడుతుంది. 1952 దాకా చలనచిత్రపరిశ్రమలో తెలుగు చిత్రనిర్మాణం అల్ప సంఖ్యలోనే ఉండేది. ఆ తర్వాతనే అది 20 దాటిపోవటం జరిగింది. అక్కడనుంచి ప్రతియేడు చిత్రాలసంఖ్య పెరుగుతూనే ఉంది. అయితే ఇప్పుడు ఇది పోతుందా, కాదా అనేది ప్రశ్న. ప్రతియేడు విడుదలయ్యే చిత్రాల్లో ఎన్ని విజయం పొంది నిర్మాతకు "మనం పరిశ్రమలో నిలదొక్కుకోగలిగాం" అన్న భావం కలిగించాయో పరిశీలిస్తే

[illegible]న చిత్ర పరిశ్రమలోని అనిశ్చిత పరిస్థితి విశదమవుతుంది. 1952 లో 26 చిత్రాలు విడుదలైతే 12 చిత్రాలు డబ్బు చేసుకోగలిగాయి. ఆ మరుసటి సంవత్సరం చిత్రాలసంఖ్య 28 కి పెరిగితే డబ్బు చేసుకొన్నవి ఏ ఎనిమిదో, తొమ్మిదో. తరువాతి సంవత్సరాలలో క్రమంగా చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. అయితే విడుదలైన చిత్రాల్లో ఎక్కువ విజయవంతం కావటం 1957 నుండి చిత్రాలసంఖ్య పెరగటానికి దోహదం చేసింది. 1957 లో విడుదలైన 33 చిత్రాల్లో 10 చిత్రాలు మాత్రమే బాగా డబ్బు చేసుకోగలిగాయి. మిగిలిన చిత్రాలు ఓ పదిదాకా సుమారుగా పోయాయి. దీని ప్రభావం ఆ మరు సంవత్సరమే కన్పించింది. 1958 లో 31 చిత్రాలు విడుదలైనా దాదాపు 12 చిత్రాలు బాగాను 8 మధ్యరకంగాను డబ్బుచేసుకొని 1959 సం. చిత్రాల సంఖ్యను 38 కి పెంచివేశాయి. ఈ చిత్రాలలో బాగా విజయవంతమని చెప్పుకోదగ్గవి ఓ పది ఉంటాయి. అంటే విడుదల చిత్రాల సంఖ్య పెరుగుతుండటం, విజయవంతమైన చిత్రాల స్థాయి తగ్గిపోవటం అనేది స్పష్టంగా కన్పిస్తుంది. ఇలా విడుదలైన ఎక్కువ చిత్రాలు పరాజయం పొందినప్పుడు చిత్రనిర్మాణంలో ఉత్సాహం తగ్గి పరిశ్రమలో మాంద్యం ఏర్పడుతుంది.

అసలీ పరిస్థితి ఏర్పడటానికి కారకులెవరు ? ప్రభుత్వం కారణమని నిర్మాత లంటారు. స్వయం కృతాపరాధమని, తనకేమి సంబంధంలేదని ప్రభుత్వం అంటుంది. ఈ రెండు వాదాల్లోను సగం సగం నిజం, వేపకాయంత వెర్రి వున్నాయి.

ప్రభుత్వం ముడిఫిల్ము దిగుమతిపై ఆంక్షలు విధించటం, సెన్సార్ నిబంధనలు ఇంకా (తమ పరిశ్రమమీద కక్షతో) తీవ్రతరం చేయటం, అంటే ప్రభుత్వం తమపై వేసిన శీతకన్ను, పాక్షిక దృక్పథం, తమ పరిశ్రమను స్తంభింపజేశాయని పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు ప్రభుత్వంపై ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ వైఖరి పరిశీలిస్తే ముడిఫిల్ము దిగుమతుల పట్ల వీరి వాదం కొంచం సమంజసంగానే ఉందేమో అనిపిస్తుంది. దేశంలోని సహాయ కార్యక్రమాలకు, సంగీతనాటక కళాపరిషదాది సంస్థలకు, ఇంకా తదితర కార్యక్రమాలకు చలన చిత్ర పారిశ్రామికుల సహాయాన్ని, పన్నుల రూపంలో ఎక్కువ ధనాన్ని, పుచ్చుకుంటున్న ప్రభుత్వం నిర్మాతల సాధక బాధకాలు పరిశీలించక పోవటం, వారి ఆవశ్యకమైన ముడిఫిల్ము దిగుమతిని తగ్గించటం శోచనీయమే గాక, పరిశ్రమకు నష్టం కలిగిస్తుందనే చెప్పాలి. దేశీయంగా మనం ముడిఫిల్ము విషయంలో స్వయం సమృద్ధిని సాధించుకునేంతవరకు చలనచిత్ర పారిశ్రామికులకు కావలసినంత ముడిఫిల్మును సరఫరా అయ్యేటట్లు చూడటం ఎంతో అవసరం. చిత్రనిర్మాణంలో నిర్మాతలు ముడిఫిల్మును దుబారా చేస్తున్నారన్న అపోహ కూడా ప్రభుత్వం వదులుకొనటం ఉత్తమం. ఈ విషయం పైనే ఒక నటుడిలా అన్నారు : "నిర్మాతలు దుబారా చేస్తున్నారనంటే, పౌరాణిక చిత్రాలు చాలా దెబ్బతినాల్సి వస్తుంది. పౌరాణిక గాథలలోని వ్యక్తులకు ఒక వ్యక్తిత్వం, గాంభీర్యం, ఉదాత్తత ఉన్నాయి. చిత్రాల్లో వాటిని ప్రతిబింబింప జేయాలంటే దానికి కొంత ఫిల్ము వ్యయం అవసరం. ప్రభుత్వం ఫిల్ము కోటాలు తగ్గించిన మాత్రంచేత ఆ రాముణ్ణి, కృష్ణుణ్ణి నడిపించాల్సినచోట ఔచితిభంగంగా పరిగెత్తించలేముకదా !" (ఇది భావం మాత్రమే). ఈ నటుడు చెప్పింది అక్షరాలా నిజమే. కాని అందరుసక్రమంగా వినియోగిస్తే ఈ ప్రశ్నెందుకొస్తుందనేదే ప్రశ్న. నిర్మాత లందరూ మాత్రం ముడిఫిల్ము సరిగా వినియోగిస్తున్నారా? ఒక నిర్మాత నిర్మించిన ఒక "పక్కా" సాంఘికచిత్రం, నెగటివ్ ఫిల్ము పొడవు కొన్ని మైళ్ళట! ఆ చిత్రరాజం మూడోనాటికి మద్రాసు చేరిందంటే అది వేరే విషయం. కాబట్టి ముడిఫిల్ము దిగుమతి విషయంలో పరిశ్రమ పట్ల ప్రభుత్వం సానుభూతి, తమకు లభించిన ముడిఫిల్మును నిర్మాతలు సక్రమంగా వినియోగించుకోటం అవసరం.

చిత్రపరిశ్రమలో ఏర్పడ్డ మాంద్యతకు ఆర్థిక సంక్షోభానికి ఇంకో ముఖ్య కారణం సెన్సారువారు రోజురోజుకు కట్టుదిట్టంగా బిగిస్తున్న నిర్బంధాలు కారణమని పారిశ్రామికవేత్త లంటున్నారు. పైగా



షా ఫిలిమ్స్ "కష్టసుఖాలు"లో యస్. వి. రంగారావు.



"జగదేకవీరుని కథ"లో రామారావు, సరోజాదేవి.

ఈ సెన్సారు నిస్సార నిబంధనలవల్ల పరిశ్రమలో అప్పుడే 1500 మందికి పైగా నిరుద్యోగ స్థితి ఏర్పడిందని అంటున్నారు. వీరి నిరుద్యోగ ప్రమాదం సంగతి ఎలావున్నా సెన్సారు విధానం మాత్రం అంత సంతృప్తిగా లేనిమాట వాస్తవం. ఇటీవల విడుదలైన చిత్రాలు (ఉత్తరాది, దక్షిణాది) చూస్తే సెన్సారు చిత్తం ఏ చిత్రంమీద ఎప్పుడు ఎలా ప్రసరిస్తుందో చెప్పలేని పరిస్థితి కన్పిస్తోంది. ఒక చిత్రంలో ఎబ్బెట్టుగా, జుగుప్సావహంగా కన్పడ్డ విషయం ఇంకో చిత్రంలో, ముఖ్యంగా విదేశీ చిత్రమైతే తప్పనిసరిగా, ఏమాత్రం పాటింపులేని విషయంగా ఉండటం కొంతమంది విమర్శకు గురైంది కూడా. ఇటీవల ఒక తమిళ నటుడు "ఉత్తర భారత, విదేశీ చిత్రాలు దక్షిణభారతంలో ప్రదర్శితా అయ్యేందుకు మళ్లీ సెన్సారు అనుమతులు తీసుకోవటం న్యాయమని" అన్నారంటే సెన్సారు విధానంపట్ల పారిశ్రామికులు ఎంత వేసట పొంది ఉన్నారో గ్రహించవచ్చు. పైగా చిత్ర పారిశ్రామిక ప్రతినిధులకు సెన్సారు సంఘంలో తగినంత ప్రాతినిధ్యం కల్పించకపోవటంవల్ల పారిశ్రామికులలో ఈ అపోహకు తావు ఏర్పడుతోంది. కాని సెన్సారంటూ లేకపోతే పరిశ్రమలో వెఱ్ఱి వేలకాయంతైనా కూష్మాండప్రమాణమయ్యే ప్రమాదముంది. చలనచిత్ర పరిశ్రమలోని అవాంఛనీయ పరిస్థితుల అదుపు దృష్ట్యా సెన్సారు అవసరం దేశంలో ఎంతైనా ఉంది. అలా అని సెన్సారువారు నిర్మాతలను దాచి రంపాన పెట్టటం కూడా మంచిదికాదు. పరిశ్రమలోనూ సంస్కారులు, సహృదయులూ ఉంటారని, ఉన్నారని గ్రహించి తమ కత్తెర ఝుళిపించేముందు వారి అభిప్రాయాలు కూడా సహృదయంతో పరిశీలించటం అవసరంగాని, "దుష్టాంగంబు ఖండించి ... అన్నారు కనక ఖండించాం. పారేశాం" అన్న దృక్పథంతో ఉండకూడదు. అలాగే నిర్మాతలు కూడా తమ తమ చిత్రంలో సెన్సారుకు ఇబ్బందులను కల్పించే దృశ్యాలు వగైరాలు ఏమీ లేకుండా చూచు



షా ఫిలిమ్స్ "కన్నముఖాలు"లో శివాజీగణేశన్.



రఘురాం ఫిలిమ్సువారి "తండ్రులు—కొడుకులు"లో చలం, కృష్ణకుమారి.

కోటం మంచిది. పరిశ్రమలోని పెద్దలు తదితర సాహితీవేత్తల (పత్రికలతో సహా)తో ఒక సంఘాన్ని ఏర్పరచి అవాంఛనీయమైనవి, అభ్యంతరకరమైనవి ఏవైనా తమ చిత్రాల్లో వుంటే వాటిని తామే సవరించుకొని సెన్సారు బాధ తప్పించుకోవచ్చు. ఇటీవల చలనచిత్ర వాణిజ్యమండలి చెప్పిన స్వయం సెన్సారు సంఘం నియమించుకోటంవల్ల సెన్సారువల్ల కలిగే బాధలు తొలగించుకొని, ఆ బాధలవల్ల నష్టపడుతోం దనుకున్న పరిశ్రమను పునరుజ్జీవింపచేయటానికి వీలౌతుంది.

అయితే ప్రభుత్వ వాదం ఇంకోవిధంగా ఉంది. పరిశ్రమలో ఏర్పడ్డ మాంద్యానికి కారణం తాను కాదని, పారిశ్రామికులు గోరంతలు కొండంతలుగా చేస్తున్నారనీ, ఇప్పుడు పరిశ్రమలో ఏర్పడ్డ అనిశ్చిత పరిస్థితికీ, ఆర్థిక సంక్షోభానికి పరిశ్రమే కారణమని అంటుంది. పైగా సెన్సారు, ముడి ఫిల్ము కోటాలాంటి వాటితో తమ పరిశ్రమలో మాంద్యతను ముడివేయటం ఒట్టితలకు మోకాలికి ముడివేసే ప్రయత్నంలాంటిదేననీ అంటుంది ప్రభుత్వం.

అది ప్రభుత్వం కనుక, ఘుడిపి అంతా నిజమేనని అన్నా అందులో కొంతన్నా సత్యం లేకపోలేదనిపిస్తుంది గత మూడేళ్ల చిత్రాలను చూస్తే.

గత ఐదేళ్లలోగా ఎన్నో చిత్రాలు దెబ్బతిన్నా విడుదలైన చిత్రాల సంఖ్య పెరుగుతూనే ఉంది. చాలామంది నవయువకులు, సినిమా పరిశ్రమను గోవర్ధన పర్వతం మాదిరి ఎత్తివేస్తామనే ఆవేశపరులు చిత్రనిర్మాణంలో ప్రవేశించారు.

ఇప్పుడు మనదేశంలో ఉన్న నిర్మాతల్లో స్వతహాగా చిత్ర నిర్మాణానికి స్తోమతు ఉన్నవారు చాలా తక్కువ. బొర్ర కట్టి నాలుగు కాల్‌షీట్లు తీసుకుంటే డిస్ట్రిబ్యూటరే దొరక్కపోతాడా. అనుకొని హుషారుగా వచ్చే నిర్మాతలవల్లనే చిత్రరంగానికి ఎక్కువ అభిమానపూర్వక అపకారం (పాపం అతనికి తెలియదు మరి, తనవల్ల పరిశ్రమ దెబ్బతింటుందని) జరుగుతున్నది. స్వయంగా చిత్రం నిర్మించే స్తోమతులేని ఈ నిర్మాత ఏవిధంగానో ఓ లక్ష చేతో పుచ్చుకొని ఓ సుప్రభాతాన చిత్రనిర్మాణ సంస్థను ప్రారంభిస్తాడు. ఈ చిత్రాన్ని ఎలాగో అష్టకష్టాలమీద పూర్తిచేయగల్గినా, ఆ చిత్రం విఫలమైన రోజున అతనికి ఆ రంగంలో మంచినీళ్లు కూడా అప్పుగా పుట్టదు.

ఈ నూతన నిర్మాతలకు (చాలామందికి) చిత్ర నిర్మాణం గూర్చి అనుభవం చాలా తక్కువ. అందువల్ల వారి అంచనాలు కూడా అలానే వుంటాయి. "ఓ ఇద్దరు పెద్ద నటీ నటుల్ని పట్టుకోటం (అవసరమైతే ఓ లక్ష పారేద్దాం) ఓ పెద్ద మ్యూజిక్కు డైరెక్టరని, పులుకు తీసేవాణ్ని (మహా అయితే ఇంకో లక్షతో) పుచ్చేసుకుంటే, చక్కా మనింటికే లక్ష్మీ శ్రీమతమ్మవారు వచ్చేస్తుంది"—ఇలాంటి బాల్య చాపల్యం గల నిర్మాతలు (వయస్సులోగాక పోయినా భావాల్లో) మా దగ్గర డబ్బు వున్నది. అడగనివారు పాపాత్ములు అన్న ఫక్కీలో నటీనటులకు, సంగీత దర్శకులకు, ఆఖరికి కెమెరా ట్రాలీనెట్టే వ్యక్తికి కూడా ధరలు పెంచుకుంటూ చిత్రనిర్మాణం ప్రారంభిస్తారు.. చిత్ర నిర్మాణం పూర్తయ్యేలోపల కనీసం మూడుసార్లన్నా స్వగ్రామంవెళ్లి వచ్చి చివరకు

పిలాగో ఆ చిత్రం పరాజయంపొందితే చేసేదిలేక పరీక్ష తప్పిన విద్యార్థి మాదిరిగా ఆ వ్యక్తి ఇంటికి పోవలసి వస్తుంది. అనుభవంలేని నిర్మాతలవల్ల ముఖ్యంగా ఆర్థిక స్తోమతులేనివారివల్ల ఇలాంటి చిక్కులొస్తాయి.

ఈ నిర్మాత వ్యక్తిగతమైన అపజయం ప్రభావం పరిశ్రమపైన తప్పకుండా వుంటుంది. అనుభవంలేని నిర్మాత తనంతట తను నష్టపడితే పరిశ్రమకు పెద్దగా నష్టం ఉండదు. ఈ నిర్మాత తాను చేతులు కాల్చుకొని ఆ పాత్ర ప్రక్కవాడి కాలిమీద పడేసి మరీ పోతాడు. నటీ నటుల ధరలను పెంచి మిగిలిన వారికి అలభ్యమైన ధరలో వుంచటంవల్ల తోటి నిర్మాతల్లో కొందరికయినా దెబ్బ తగులుతుంది. నటీ నటులపైన భారీ వ్యయమనేది పెద్ద పెద్ద నిర్మాతలకు కూడా ఒకప్పుడు సాధ్యం కానిదవుతుంది. పెద్ద పెద్ద మొత్తాలు ముఖ్యులైన వారికి ముట్టచెప్పటంవల్ల నిర్మాతల్ని మిగిలిన వ్యయ భారాన్ని సర్దుకోలేని స్థితి ఏర్పడటం ఉద్యోగుల్లో అవాంఛనీయ పరిస్థితి సంపాందటం లాంటివి జరుగుతాయి. వీటన్నిటికీ కారణం స్తోమతు లేకుండా, అనుభవం శూన్యంగా చిత్ర నిర్మాణంలో ప్రవేశిస్తున్న చిన్న చిన్న నిర్మాతలే.

ఇంటికి నాలుగుబోర్డుల చిత్ర నిర్మాణంనుంచి పరిశ్రమ తప్పుకోవటం వాంఛనీయం. నిర్మాత లందరు కొన్ని కొన్ని విడి విడి యూనిట్లుగా ఏర్పడి చిత్ర నిర్మాణం సాగిస్తే దానివల్ల పరిశ్రమలో నిర్మాణ విషయకమైన ఆర్థికమైన ఇబ్బందులు తొలగిపోతాయి. పల్గురు నిర్మాతలు చిల్లర చిల్లరగా 'ట్రాష్' అనిపించుకునేంత దుస్థితి చిత్రాలను నిర్మించేకన్నా ఆ పల్గురు సమిష్టిగా ఒక ఉత్తమ, సర్వ జనాదరణీయ చిత్రం నిర్మించవచ్చు. ఇలా సహకార చిత్ర నిర్మాణం ప్రారంభించినప్పుడు నిర్మాణంలో, పొదుపు, స్తోమతుగల నిర్మాతలు 'యూనిట్'కు నల్గురైనా నిలబడ్తారు. వారి చిత్రాలు కూడా ప్రశంసనీయమైన ఫలితాన్నే ఇస్తాయి.

మన దేశంలో చిత్రాలు—ముఖ్యంగా తెలుగు చిత్రాలు దెబ్బ తింటానికి కారణం వాటి విడుదలలో పోటీ. ఒకే రోజున రెండు చిత్రాలు, వారంలో మూడు చిత్రాలు—ఇలా విడుదల చేయటంవల్ల చాలా చిత్రాలు ప్రజామోదాన్ని పొందలేక పోతున్నాయి. ఇదివరకు ఒకే పేరు లేదా ఇతివృత్తంగల రెండు చిత్రాలు విడుదల చేయటం, అందులో ఒకటి పరాజయం పొందటంలాంటివి చూచినా మన నిర్మాతలు ఇంకా పాత పద్ధతులే అనుసరిస్తున్నారు. అందులో చిత్ర ప్రదర్శనాల రేట్లు పెరిగినా కూడా నిర్మాతలు గమనించకుండానే విడుదలకుపోటీపడటం చిత్రజగత్తులో పెద్దవిచిత్రం. పోటీ లేనిదే చిత్రాల విజయం తేలదనే వాదం కూడా ఒకటుంది. పోటీనిర్మాత పాడైపోవాలని, కాంక్షవుంటే తప్ప ఈ విడుదల పోటీకి అర్థం కనిపించదు. లాభాలు గూటిలోకి దిగినా, తన పెట్టుబడి దక్కాలనేదే ప్రతి నిర్మాత తాపత్రయమని గుర్తించి నిర్మాతలు విడుదల పోటీలు పడకుండా సఖ్యతతో పోటీని తప్పించితే పోటీ నిర్మాతకు చిత్ర రంగంలో స్థానం కల్పించినట్లవుతుంది.

అయితే ఈ చిత్ర పరిశ్రమలో మాంద్యం కేవలం భారత పరిశ్రమకేకాదు. అమెరికాకు కూడా ఈ మాంద్యం సోకింది. సుమారు పదేళ్ళ మాంద్యం తర్వాత హాలివుడ్ పరిశ్రమ ఇప్పుడిప్పుడే బలం పుంజుకుంటున్నది. అమెరికాలో చిత్ర పరిశ్రమపై ప్రజాదరణం తగ్గిపోవటానికి కారణం టెలివిజన్. 1940 లో టెలివిజన్ అమెరికన్ గడ్డపై అడుగు పెట్టినప్పటినుంచి చలన చిత్రాలపై ప్రజాభిమానం సంఖ్యారూపంలో తగ్గిపోవటం జరిగింది. మళ్ళీ ప్రజల మోజు టెలివిజన్‌నుంచి మళ్ళటంతో చలన చిత్ర పరిశ్రమ మెల్ల మెల్లగా పురోగమిస్తోంది. బహిరంగ చలన చిత్ర ప్రదర్శనశాలపట్ల, యువకుల మోజు, నటనా నైపుణిగల వారి నటనతో తప్పక చూడాలని పించేటట్లు భారీ యెత్తున నిర్మితమవుతున్న చిత్రాలు హాలివుడ్ చలన చిత్ర పరిశ్రమలో కొంత నవజీవనాన్ని కల్పించాయి.

జపాన్‌లో కూడా యుద్ధ పూర్వపు రోజులలో చలన చిత్ర పరిశ్రమ పరిస్థితి ఇప్పుడు భారత దేశంలో వున్నట్లుగానే వుండేది. తాహతుకుమించి చిత్ర నిర్మాణం, చిన్న చిన్న నిర్మాతలవల్ల పరిశ్రమకు ఇబ్బంది కలుగుతుండేది. యుద్ధం తరువాత 5 పెద్ద కార్పొరేషనులను స్థాపించుకొని చిత్ర నిర్మాణం ప్రారంభించిన తర్వాత పరిశ్రమ విపరీత వేగంతో అభివృద్ధి పొందింది. దానివల్ల చాలా ధనం ఆదా అయింది కూడా.

అమెరికాలో కూడా కొలంబియా, వార్నర్ బ్రదర్స్‌లాంటి సహకార చలన చిత్ర నిర్మాణ సంస్థలున్నాయనేది తెలిసిందే.

కథ, సంగీతంలాంటి వివిధ చిత్రసంబంధ విషయాలెలావున్నా, విదేశాల్లోవున్న సహకార చిత్ర నిర్మాణ పద్ధతి, వాణిజ్య మండలి సూచించిన స్వయం సెన్సారు పద్ధతి అమలు జరుపుకుంటే చిత్ర రంగంలో చాలా అదుపు ఏర్పడి ప్రస్తుతంవున్న ఆర్థికమైన అస్థిరత చాలావరకు తొలగిపోయి భారత పరిశ్రమ తిరిగి బలం పుంజుకోవచ్చు. ★

"నాగరాజ్"



'జగదేకవీరుని కథ'లో యన్. టి. రామారావు.


హరివంశం

(12-వ పేజీ తరువాయి)

శ్వరమునకు సమీపమున స్కందతీర్థము; స్కందతీర్థమునకు ఆవల డుంఠి తీర్థము. డుంఠితీర్థమునకు సమీపమున భవాని శంకరతీర్థము. ఆపైన జ్ఞానతీర్థము. తరువాత శైలతీర్థము. తత్సమీపమున నందితీర్థము. దానికి అవాగ్భాగమున విష్ణుతీర్థము. సాందీపని ఈ తీర్థముల సేవనము మహానందునకు విచిత్రమనిపించినది. ఆశ్రమమునకు బయలుదేరిన సాందీపని, ఇట్టులు తీర్థసేవనము చేయుట యేమి! మహానందుడు మాటలాడలేదు. విష్ణుతీర్థమును చేరి, సాందీపని నిల్చిపోయినాడు. "మహానందా! మణికర్ణిక సాకారయై ఇంతదనుక నాతో వచ్చినది. ఇప్పుడు కన్పించుటలేదు. ఏమైనది? ఏమైనది!అహో!దర్శనము అర్థమైనది. పరమశివా! అర్థమైనది. మహానంద! పద. ఆశ్రమమునకు త్వరగా పోవలయునయ్యా! అభిజిల్లగ్నవేళకు మనము ఆశ్రమమువద్ద నుండవలయును. తెలిసినదా!"

మహానందుడు తెలిసినది అనినాడు. ఏమి తెలిసినది: అదే తెలియలేదు. సాందీపని తనకు చెప్పలేదు. ఆయన తెలిసినదా అనగా తాను తెలిసినది అన్నాడు. ఇరువురును ఆశ్రమాభిముఖులైనారు. అభిజిత్తునకు ఇంకను కొన్నిఘడియలు ఆలశ్యమున్నది. సాందీపని వడిగా నడుచుచున్నాడు. ఆయనముఖము శాంత స్వచ్ఛమై ఉన్నది. అందులో ఇప్పుడు దుఃఖపు ఛాయలు కన్పించుటలేదు. ఆయన సర్వమును విస్మరించినట్టులున్నది. ఆయనకు విష్ణుతీర్థమున ఏమి తెలిసినదో, అదియే ఆయనను ఆవేశించినట్లు ఉన్నది, ఆయన వడిగా నడచుచున్నాడు. మహానందునకు అది నడకగా లేదు. పరుగువలె ఉన్నది. సాందీపనిలో పుత్రవియోగ దుఃఖమువలన శక్తి పోయినదని తాను శంకించినాడు. ఇప్పుడు ఆ శక్తి మరల వచ్చి, ఆ పుత్రవియోగదుఃఖము ఓసరిల్లి, సాందీపని తిరిగి పూర్వము సాందీపని అయినట్లు ఉన్నాడు. ఆ వచ్చు శిష్యు లెవ్వరో! ఇప్పుడే సాందీపని ఇట్టులున్నాడు! ఆ శిష్యులు రాగా ఎట్లులుండును! మరి ఆ శిష్యులు సామాన్యులగుటకు వీలులేదు— స్వయముగా పరమశివుడు సమాధిలో దర్శనమును దయచేసి, ఆ శిష్యులనుగురించి సాందీపనికి చెప్పెను. అట్టివారు సామాన్యు లెట్టు లగుదురు? మహానందుని ఆలోచనము మహానందునిదై పోయినది. సాందీపని యేమో తనతో మాటాడుటలేదు. ఆయనయేమో! ఆశ్రమాభిముఖముగ ఆయన నడక యేమో! మరి తాను కాశిలో చూచిన సర్వవిచిత్రములను తాను సాందీపనికి చెప్పలేదు. ఆశ్రమములో నంతయు విచిత్రముగానున్నదని చెప్పలేదు. మరి ఆ విచిత్రములను సాందీపని చూడలేదో! అతడు ఆగలేక పోయినాడు. "సాందీపని! కాశిక విచిత్రముగా ఉన్నది. మన ఆశ్రమము అంతకన్నను విచిత్రముగా నున్నది" అన్నాడు. "అవునురా! జడుడా! వైకుంఠము ఒరిగినట్లు ఉన్నది." అన్నాడు సాందీపని.

అంతలో ఆశ్రమము వచ్చినది. నిజముగా అది వైకుంఠమువలె ఉన్నది. నందనమును మించి



"నాకు ఒక్కటే కన్ను అందులో చత్వారం అరటిక్కెట్టు ఇవ్వండి చాలు!"

ఉన్నది. శ్వైతరథమును అలికయించి ఉన్నది. అది ఎప్పుడును అట్లులే వున్నట్లు అవభాసించినదో! ఇదియంతయు సాందీపనికి ఈ శిష్యులు దొరుకుటను పోలిఉన్నది. సాందీపని కులపతి. ఆయనవద్ద బహుమంది శిష్యులు విద్యను అభ్యసించుట యున్నది. కాని ఇంత విచిత్రముగ, ఇట్టి విచిత్రమైన శిష్యులు వచ్చుటలేదు. ఈ శిష్యు లెవ్వరు? బ్రాహ్మణులా! క్షత్రియులా! సాందీపని తనకు ఏమో తెలిసినది అన్నాడు. అది మహానందునకు తెలియలేదు. అతడు మనస్సులో ఇట్టులను కొన్నాడు. గురువు గురువు. శిష్యుడు శిష్యుడు. శిష్యు డెవ్వడైన నేమి, గురువు అతనికి విద్యను కరపవలయును. పూర్వము మహర్షులుగూడ బహుశ్యులవద్ద విద్య కరచుట యున్నది. వారు ఆశ్రమమునకు రాగా, ఆశ్రమమంతయు ఆశ్చర్యములో మునిగియున్నది. మరి ఆ అద్భుతమును ఎవరు ఎప్పుడు చూచిరి. ఆ దినమున సూర్యునికిరణములు గూడ వేడిగా లేవు. గాలి వచ్చి శరీరమును తాకినదో, అచింత్యమైన ఆనందము కల్గుచున్నది. భూమి అంతయు అప్పుడు క్రొత్తగా నున్నది. ఆ భూమి తనలోనున్న శక్తులన్నిటినీ ఒక్కచో కేంద్రీకరించి సాందీపని ఆశ్రమములో వికసించినట్లు ఉన్నది. ఆ వృక్షములు పూర్వమును ఉన్నవి. కాని ఈ దినమున ఉన్నట్లు లేవు. ఆలతలు, ఆ గుల్మములు పూర్వమును ఉన్నవి. కాని ఈరోజున ఉన్నట్లు మరి యెప్పుడును లేవు. ఎప్పుడు అన్ని ఋతువులు ఒక్కటై, ఒక్క ఆశ్రమమున పుష్పించినవి. ఒక్క ఆశ్రమమున గుబాళించినవి. సాందీపని ఆశ్రమము ప్రకృతి పండి, ఇంద్రధనస్సులతో అలంకరించుకొన్నట్లు ఉన్నది.

అభిజిల్లగ్నము సమీపించుచున్నది. సాందీపని దీక్షితాయణితో అన్నాడు. "ఓసి! దీక్షితాయణీ! నేడు మనఇంటికి ఎవ్వరో శిష్యులు వచ్చుచున్నారు. వారిని నీవు కన్నబిడ్డలవలె చూడవలెనుసుమా?" దీక్షితాయణికి సంతోషమును అయినది. దుఃఖమును కల్గినది. ఆ సంతోషము తమ ఆశ్రమమునకు వచ్చుచున్న క్రొత్తశిష్యులు వచ్చుచున్నారని; ఆ దుఃఖము తన బిడ్డ నష్టమై పోయినాడని; సాందీపని ఆమెను చూచి తానును విచారించినాడు. అంతలో తన్ను తాను సంబాళించుకొన్నాడు. చుట్టును శిష్యులు ఉన్నారు. కాశికలో భిక్షకు పోయి, కాశికయందు జరిగినవిచిత్రమైన అలంకరణమును చూచి, తమ ఆశ్రమము ముందు ఆ అలంకరణము దిగదిడుపు కాగా, అదియంతయు సాందీపని మహత్వమేమోనన్న భావముతో వారు ఆనందమున వోలలాడుచున్నారు. ఆదినమున ఉదయమున పాఠములేదు. సాందీపని గంగకు స్నానమునకు పోయినవాడు ఇప్పుడే వచ్చెను. మరి పాఠములు ఎట్లుండును? వారు భిక్షకు పోయిరి. తిరిగి వచ్చిరి. సూర్యుడును నడిమింటికి వచ్చెను. వాకిటిలో రథములు ఆగిన సవ్వడి అయ్యెను.

సాందీపని శిష్యులలో సుదాముడు ఒక్కడు. వానిని అందరు కుచేలుడని అందురు. వాని దారిద్ర్యము అట్టిది. సాందీపని వానిని చాలసార్లు "నాయనా! నేను నీకు బట్టలు ఇత్తును. హాయిగా కట్టుకొనుమురా!" అని బుజ్జగించినాడు. వాడు వినలేదు. "ఆచార్య! మీరు నూత్నవస్త్రములను ఇత్తురు. అవియు చిరిగిపోవును. ఈ ప్రపంచమే ఒక వస్త్రమువంటిది. అది చిరిగిపోవును. నేను కుచేలుడను. ప్రపంచము గూడ కుచేలమే. ఇక నాకు మరి ఒండు చేలములెందుకు" అనును. గురువు ఇవ్వబోయిన నూతనపరిధానములను తిరస్కరించును. ఆ గురువు అతనిని మందలించడు. వాని ఎఱుకకుమాత్రము అబ్బురము చెందును. ఇప్పుడు ఆశ్రమము తలవాకిటిలో రథములు ఆగగా, వాడు ముందు పరుగెత్తెను. పరుగెత్తిన వాడు, ఆ రథములను దిగుచున్నవారిని చూచి నిల్చిపోయెను. ఆ దిగుచున్నది ఎవ్వరు? నీలమేఘము ఆకారమైనవాడా! ఆహా! సౌందర్యము. ఆ కన్నులు; ఆ బాహువులు; ఆ వక్షము; ఆ నవ్వు; సుదామునిలో విచిత్రమైన భావము కల్గినది. పౌరుషము అంతయు ఆకారముతాల్చినవాడు ఇతడు. మరి తాను అతనిని చూడగా పొందిన భావ చైతన్యము ఒక స్త్రీ, ఒక పురుషునిచూచి పొందతగినదిగా ఉన్నది. అతడు ఒక్కడే పురుషుడు. తక్కిన లోకమంతయు స్త్రీ—అన్న ఒక విచిత్రభావ మాతనిలో కల్గినది.

అంతలో సాందీపనియు వచ్చెను. శిష్యులును వచ్చిరి. మహానందుడు వచ్చెను. ఆయన భార్యయు, పిల్లలును వచ్చిరి. దీక్షితామణి వచ్చెను. వచ్చినవారు వచ్చినట్లు, ఆ వచ్చినవారిని చూచి నిలుచుండి పోయిరి. అందులో ఆ అన్నదమ్ములవలెఉన్న వారిని చూచి అందమునకు అవధిభూతముగాఉన్న వారి ఆకారములను చూచి నిల్చిపోయిరి. అంధకుడు ముందునకు వచ్చెను. ఆయన సాందీపనిని చూచెను. సాందీపని ఆయనను, ఆ వచ్చిన రాచకుఱ్ఱలను గూడ చూచెను. ఆయనకు ఇప్పుడు అంతయు అర్థమైనది. "వసుదేవుడు తన బిడ్డలను నాకు శిష్యులనుగా పంపినాడే! దీక్షితాయణీ! చూచినావా! ఆ నల్లనివాడు. వానిపేరు కృష్ణుడు. ఆ తెల్లని అతనిని చూచినావా! వాడు బలరాముడు. వీరు నీకు బిడ్డలు" అన్నాడు.

రామకృష్ణులు సాందీపని పాదములకు సాష్టాంగముగ నమస్కరించినారు. "ఆచార్య! ఈయన ఉద్ధవుడు. మీకు శిష్యరికము నెరపగా వచ్చినాడు." అన్నారు. "అట్లాగునా! యాదవుల బిడ్డ లందరును నావద్దనే విద్య నభ్యసించ వచ్చుచున్న ట్లున్నది. ఇది గర్గులకు కోపకారణము కావచ్చును" అని సాందీపని నవ్వినాడు.

మహానందుడు: సాందీపని! నిన్ను గురువుగా వరించి వారు రాగా, గర్గునికి కోప మేలనయ్యా!

అప్పుడు శ్రీకృష్ణదేవుడు మహానందుని చూచెను. మహానందుడు శ్రీ కృష్ణుని చూచెను. మహానందుని కన్నులు నవ్వినవి. శ్రీకృష్ణదేవుడు నిజముగా నవ్వెను.

మహానందుడు: సాందీపని నీకు వట్టి గురువు. అసలు గురువును నేను.

అందరును అతని ఆ మాటలకు పగలపడి నవ్విరి.

సాందీపని మహానందుని జడుడా! అనెను.

"నేను జడుడను. నీవు గురుడవు" అని మహానందు డనగా తిరిగి అందరును నవ్వుకొనిరి. ★


మనమూ-మనదేహస్థితి

(14-వ పేజీ తరువాయి)

మాత్రమే వుండదు. వీటి వెనక ముందు తడికెల వంటి నిర్మితులు వున్నవని చెప్పేను. ఈతడికెలు, కొన్ని కండరములను మ్యూకస్ పొర క్రమ్మివుండగా ఏర్పడ్డవి. అందుచేత వీటికి సంకోచ వ్యాకోచ శక్తి కలిగివున్నది. టాన్సిలులో రక్త నాళములు పేమువంటి ఒక టెష్యూ వున్నది. ఆకులో యీనలవల మధ్య ఆకుగుజ్జు వున్నట్లే పిచ్చుకల గూడువంటి యీ పేము పదార్థంతో యేర్పడిన వలలో లింఫాయిడ్ టెష్యూ నిండివుంటుంది. టాన్సిల్ పై భాగమును, ఫేరింగ్సును క్రమ్మివుండే మ్యూకస్ పొర క్రమ్మివుంటుంది. అయితే యీపొర దిండును గలేబు చుట్టి వున్నట్లుగా పై వైపున మాత్రమే చుట్టి వుండదు. ఈ పొర. టాన్సిలులోకి చొచ్చుకునివెళ్ళి తిరిగి వస్తుంది. అందువల్ల టాన్సిలు చింతగింజలాగా నునుపుగా వుండక ఎండు ద్రాక్ష పండులాగా, రుద్రాక్షలాగా గరుకుగా గుంటలు, గుంటలుగా వుంటుంది. టాన్సిలు క్రిమిగ్రస్తమై క్రిమిదోషం ముదిరిపోయినప్పుడు ఈ గుంటలలోనుంచి చీము వస్తూవుంటుంది. టాన్సిల్ పైనా, క్రిందా టాన్సిల్ తడికెలకు మధ్య ఖాళీ ప్రదేశములువుండి, అన్నం మెతుకులూ అవీ యిరుక్కుని మిగిలిపోవడానికి వీలుంటుంది.

టాన్సిల్ అన్ని వయస్సుల వారిలోనూ ఒక లాగే వుండదు. శైశవంలో ఇది అత్యమిత పరిమాణం పొందుతుంది. ఒక్కొక్కప్పుడు, మరీ పెరిగి రెండు టాన్సిళ్ళూ ఒకదానిని ఒకటి వరసుకొని కంఠ ద్వారమును మూసివేసేటంత పెద్దదిగా యివి పెరగడంకద్దు. కాని యౌవనకాలం వచ్చేటప్పటికి యివి ఆరోగ్యవంతులలో టాన్సిల్ తడికెలను తొలిగించి చూస్తేగాని కనపడనంత చిన్నవిగా యిలకరించుకుపోతవి.

ఇన్ని ముఖ్య ప్రదేశములలో వలయాకృతిగా ఇన్ని లింఫాయిడ్ ముద్దలు వుండడానికి కారణ మేమిటి ఇవి వాచి బాధ కలిగించడానికి మాత్రమే ఏర్పడ్డవా? లేక వీటితో యేదయినా శరీరానికి ముఖ్య ప్రయోజనం వున్నదా. ఎందుకని యివి కొన్ని వయస్సుల్లోనూ కొంతమందిలోనూ అధిక పరిమాణం పొందుతవి? ఎందుకు కొందరిలో ఉండీ వుండనట్లుగా వుంటవి. అన్న ప్రశ్నలు వైద్య శాస్త్రజ్ఞులను కలవర పరచినవి. వీటికి సరియైన సమాధానము ఎవరూ యివ్వలేదు. పనికిరాని వస్తువులను సృష్టికర్తగాని, ప్రకృతిగాని నిర్మించదని కొందరి మతం. శిశువులకు క్రిమి దోషాన్ని ఎదుర్కొనే శక్తి వుండదు గనకా, అందుకు తీసుకోవలసిన జాగ్రత్త, తీసుకోగల వివేకము వారికి వుండదు గనక, క్రిమి సంహారానికి యివి యేర్పడ్డ తరవాత యివి ఎండిపోతవనీ కొందరి విశ్వాసం. టాన్సిల్‌లోవున్న ఖాళీ ప్రదేశములలో



క్రిములు సంహరింపబడి వాటి సంహారంతో యేర్పడిన వస్తువులు రక్తంలో స్రవించి క్రిమి సంహారక వస్తువులనూ, క్రిమి ప్రవృద్ధి నిరోధక వస్తువులనూ దేహంలో తయారు చేయడానికి వీలవుతుందనీ, అల్లా జరిగేక వీటికి పని వుండదు అనీ కొందరి విశ్వాసం. ఈ విధమైన క్రిమి నిరోధక శక్తి ఇన్ఫ్లమేషన్ లేకుండానే మనకు తెలియకుండానే, ఏ బాధాలేకుండానే జరిగిపోతుందని వారి విశ్వాసం. టాన్సిల్ లోపలి ఖాళీ ప్రదేశములు ఎప్పుడూ క్రిమి రహితములుగా వుండవు. ఎప్పుడూ ఒకే రకం క్రిమిలతోనూ నిండివుండవు. అక్కడ కనబడే అన్ని రకముల క్రిములూ, వ్యాధి కారకములూకావు. అనేక మంది గుమిగూడి, నివసించేచోట గాలి వెల్తురూ తక్కువగా ఉండేచోట టాన్సిలులో క్రిముల సంఖ్య స్వ భా వ ము వేరు వేరుగా వుంటుందని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఒక్కొక్కప్పుడు డిఫ్తీరియావంటి ప్రాణాపాయకరమైన వ్యాధి హేతువులయిన క్రిములు కూడా టాన్సిలులో కనిపించినా, వ్యక్తి ఆ వ్యాధితో బాధ పడకపోవడం కూడా గమనించబడింది. ముఖ్యంగా వాయు వాహకములయిన క్రిములు (Air born germs) టాన్సిలులో కనిపిస్తవి. ఈ కారణములవల్ల వూపిరి ద్వారానూ, ఆహారం ద్వారానూ నోటిలో ప్రవేశించిన క్రిములను టాన్సిలు గుంజిపట్టి, తనలో జీర్ణంచేసి శరీరం వ్యాధిగ్రస్తం కాకుండా కాపాడుతుందనీ, దానికి అతీతమైన క్రిమిదోషం యేర్పడ్డప్పుడూ టాన్సిలూ ఫేరింక్సూ అందులోవున్న నిర్మితులూ, దానిని అనుసరించివున్న శరీర భాగములూ క్రిమిదోషానికి గురవుతవనీ అధిక సంఖ్యాకులు భావిస్తున్నారు.

వాల్డేయర్ వలయంలోనేకాక, అసంఖ్యాకములయిన లింపు గ్రంధులు శరీరంలో కొన్ని విశిష్ట ప్రదేశములలో వున్నవి. ఒక్కొక్క ప్రదేశములోవున్న లింపుగ్రంథులు సముదాయం పరిసరంలోవున్న కొన్ని అవయవయములలో క్రిములను, విష వస్తువులను హరించి, పెద్దవై, ఒక్కొక్కప్పుడు వ్యాధి గ్రస్తములై కుళ్ళు, చీము కారుస్తవి కూడా. ఫేరింక్సు ఇతర కంఠప్రదేశంలోవున్న టాన్సిలు మొదలయిన నిర్మితులు క్రిమిగ్రస్తములై ఇన్ఫ్లేం అయినప్పుడు మెడకు వెనకా ముందూవున్న లింపు గ్రంథులు, పెద్దవవుతవి. సహజ స్థితిలో బటానీ గింజలంతవిగావుండే యీ గ్రంథులు, పెద్దవైనప్పుడు చింతగింజలంతా, ఒక్కొక్కప్పుడు బాదం గింజలంతా కూడా అవుతవి. ఒకచోట ఇన్ఫ్లమేషన్ రాకుండా కాపాడే సదుద్యమంలో తామే ఇన్ఫ్లమేషనుకు గురి అయి, వాచి, కుళ్ళి చీము తిత్తులుగా వికృతి పొందుతవికూడా. ★

మనమూ-మన రాష్ట్రం

(13-వ పేజీ తరువాయి)

పోయి ఇక ఈ విద్యాలయాలన్నీ తెరవాలని ఒత్తిడి, ఆందోళన ప్రారంభమౌతుంది. ఎక్కడైనా విద్యార్థుల ఆవేశాన్ని రెచ్చగొట్టి, ప్రభుత్వంమీద ఒక దెబ్బవేసి స్వప్రయోజనం సాధించుకోవాలనే రాజకీయవాదులు ఇటువంటి అలజళ్ళకు ముఖ్య కారకులు.

ఇవాళ లాఠీచార్జి, ముదిరితే రేపు కాల్పులు జరిగినా ఆశ్చర్యంలేదు. విద్యార్థుల మనస్తత్వం ఎలాంటిదో ఎరిగిఉండాల్సిన విశ్వవిద్యాలయాధికార్లు ఇన్నాళ్ళుగా ఈ సమ్మె సాగనివ్వడం చాలా పొరపాటు. జీతాలు పెంచక తప్పదని మొండితరహా ప్రకటనలు చేస్తూ, తీరా పరిస్థితి ముదురుతోందని తెలియగానే ప్రభుత్వందగ్గరకు పరుగెత్తుకుపోవడం చేతులు కాలేదాకా వూరుకుని ఏంచేయాలా అని ఇప్పుడు ఆదరాబాదరా ఆలోచనలు మొదలుపెట్టడం విజ్ఞత అనిపించుకోదు. రాజధానిలో ఇంత గొడవ జరుగుతున్నా, విద్యామంత్రి తనకేం పట్టలేదన్నట్లు వూళ్ళవెంట తిరగడం మరీ చిత్రంగా ఉంది. రాజధానికి తిరిగిరాగానే విద్యాలయాలన్నీ మూసివేయించడం మినహా వారు చేసిందేమీలేదు. ఈ గొడవ తేల్చుకోవలసింది విశ్వవిద్యాలయం వారేనని గ్రాంటును ఏమాత్రం ఇక పెంచేదిలేదని చెబుతూ, ఈ వ్యవహారంలో ప్రభుత్వం ప్రమేయం, బాధ్యత ఏమీ లేదని నిష్కర్షగా చెప్పారు. దండించడం తప్ప మరోదారి లేదనడం సమస్యకు సరైన పరిష్కారం కాబోదు.

ఇతర రాష్ట్రాలతోనూ, ఇతర విశ్వవిద్యాలయాలతోనూ పోల్చితే ఉస్మానియాలో ఫీజుల తక్కువని అంటున్నారు. కాని ఇతర రాష్ట్రాలతోనూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతోనూ పోల్చితే తెలంగాణ పరిస్థితి ఎలాంటిదో గమనించాలి. అసలే విశ్వవిద్యాలయం చదువులు భారమైనాయి. ఆర్థికంగా వెనుకబడి ఉన్న తెలంగాణాకు జీతాల పెంపకం మరీ భారమనిపించక తప్పదు.

లక్షరూపాయల కోసమని, విద్యార్థుల్ని రెచ్చగొట్టి తలి దండ్రుల్ని క్షోభపెట్టి ఈ గొడవ సాగనివ్వడం బాగాలేదు. అసలు ఈ లక్ష ఈ ఏడే అర్జంటుగా ఎందుకు కావాల్సివచ్చిందో ఇన్నాళ్ళుగా ఎలా ఇబ్బంది పడ్డారో ఏబాపతు ఖర్చులు పెరిగాయో. అధికార్లు వివరించనేలేదు. ఈ లక్షా ప్రభుత్వం గ్రాంటు పెంచడం ద్వారా ఇచ్చినా ఇవ్వవచ్చు; లేదా పరిస్థితి స్థిమిత పడేదాకా మునుపటిలా, విశ్వ విద్యాలయంవారు సర్దుకున్నా సర్దుకోవచ్చు. ఏమైనా ఈ ఆందోళన ఇంకా వెర్రితలలు వేయకమునుపే ఏదో ఒక నిర్ణయం జరగడం శ్రేయస్కరం. ★

డగొద్దని యెన్నిసార్లు చెప్పానోయ్ నీకు....!" ఎదలో గుచ్చుకున్న ముల్లును లాగి పారవేసేశక్తి లేక లేచి వెళ్ళిపొయ్యాడతను.

నాకేమీ అర్థంగాక సత్యంవైపు చూశాను. వాడు అమృతవర్షంలాంటి వెన్నెల్లోకి చిరునవ్వుతో విషాన్ని చిలుకుతున్నాడు... అతనిలో దాగివున్న యేదో బాధ సత్యంమాటలతో బయటపడింది. గత జీవితానికి సంబంధించిన యేదో విషాదస్మృతిని సత్యం కెలికాడు......లేకుంటే అతనికంత బాధ కలిగేది కాదు"

"ఏమిటోయ్ యీ కథ?" సత్యాన్ని అడిగాను.

"అదా? చక్కని కథ! వినాలనిపించే కథ!

"అలాగా?"

"వీరు—వారే రంగనాథంగారు మా మేష్టారు. ప్రేమ, బాధ, ఆల్జీబ్రా, వేదాంతం కలిపి బహు చక్కగా పాఠం చెప్పేవాడు. కానీ ఆ బ్రహ్మదేవుడు వీరికి చదువు సంధ్య, అందం చందం, తెలివీ తేట యిచ్చి శ్రీవారి బుర్రనుంచీ కామన్‌సెన్సుని పెరికి అవతలపారేశాడు. వారికి చిన్ననాడే అమ్మా నాన్నా చనిపొయ్యారు పాపం! కానీ వాళ్ళు అదృష్టవంతులు. వాడెవరో అన్నట్టు చనిపోయినవాళ్ళందరూ మనదేశంలో అదృష్టవంతులేగా మరి! వాళ్ళు వదిలి వెళ్ళిన ఆస్థితో మేనమామగారు చదివించారు వీర్ని. మేనమామగారి పెద్దకూతురు ఇందిరకు వయస్సొచ్చేసరికి వీరికి ఉద్యోగంకూడా వచ్చింది. రామనాథంగారు నానాఅవస్థపడి—దీనికి అచ్చ తెనుగు అనువాదం—నానాగడ్డికరిచి, మేనమామగారి మెప్పుకోసం ఓపినంత డబ్బు పంపేవారు—ఎందుకనుకున్నారు?"

"ఇందిరకోసం"

"కరెక్టు! మీకూ కొనగోరంత ఆలోచనుంది. ఎంతైనా మా వూరి అల్లుడుగదూ! రామనాథంగారు ట్యూషన్లుచెప్పీ, పస్తులుండీ పైసాకుపైసా ముడేసి సంపాదించిన డబ్బును కట్నంగా యిచ్చి ఇందిరకు పెళ్ళిచేశాడు వాళ్ళ మామయ్య."

"వీవూళ్లో యిచ్చాడేమిటి ఇందిరను?"

"ఏదో ఒక వూళ్లో యెవరో ఒక వల్లకాట్లో రామనాథయ్యకు అనుకోండి. ఇలాగే రెండో కూతురికికూడా పెళ్ళిచేశాడు."

"ఎవరి డబ్బుతో? రామనాథంగారి డబ్బుతోనే!"

"రామనాథంగారి డబ్బుతో గాకపోతే మన డబ్బు జోలికొస్తాడూ వారి మామయ్య. వస్తే ముక్కలు విరగతన్నమూ! తర్వాత—మూడోకూతురు కూడా పెళ్ళి కెదిగింది. ఆవిడపేరు విమల. ఈవిడ పెళ్ళికెదగగానే రామనాథంగారు కాస్త మేలుకొని సరాసరి మామయ్యగారిని కలుసుకొని విమలను తనకేయిచ్చి పెళ్ళిచెయ్యాలని నిక్కచ్చిగా చెప్పేశారు"

"ఒప్పుకున్నాడా?"

"మనలాంటి బుద్ధిలేనివాడేమిటి ఆయన—[illegible]క్యుడు!"

"ఏమన్నాడేమిటి?"

"చూడయ్యా రామనాథం! పెద్దమ్మాయి నీకు యీడుకాదు. అందువల్ల యివ్వలేదు. రెండో అమ్మాయిని యివ్వాలనే అనుకున్నాను. తీరాచూస్తే ఆపిల్ల ఎవర్నో ప్రేమించేసింది. అందువల్ల వీల్లే

రామనాథం ట్యూషన్లు

(9-వ పేజీ తరువాత)

కుండాపోయింది. ఇక మూడో అమ్మాయి విమలుంది. ఆవిడ ఒప్పుకుంటే నా అభ్యంతరమేమిటి మధ్య!" అన్నారు మామయ్యగారు.

రామనాథంగారు నేరుగా వెళ్ళి విమలనే అడిగాడు.

"నీతో పెళ్లేమిటి—అసలు నీకు పిచ్చి" అంది విమల.

"అంతే! ఆక్షణంనుంచీ ఒక్క నెలలోగా రామనాథంగారు పిచ్చివాడైపొయ్యారు" ఆగాడు సత్యం.

"అదెలాగోయ్?" ప్రశ్నించాను.

"అసలు వారి దదోకరకం చాదస్తం! అంటే పిచ్చికి ఒక డిగ్రీ తక్కువ. వారెంత అమాయకులు కాకపోతే నానా అవస్థపడి, ట్యూషన్లు చెప్పి సంపాదించిన డబ్బు—ఎంతనుకున్నారు — దాదాపు ఐదు వేలు—వాళ్ళ మామయ్యనోట్లోపెట్టి నీళ్ళు పోస్తారు. అందులోనూ వారిది అగోరకం మనస్సు....."

క్లాసులో ఉపాధ్యాయుడు భూమ్యాకర్షణ శక్తిని గూర్చి చెప్పతూ తన చేతిలో నున్న సుద్దముక్కను పైకి విసిరాడు. అది తిరిగి తన ఎదుట నున్న బల్లమీద పడింది. అంతలో నొక విద్యార్థి నిలిచి "మాష్టారూ! భూమికి ఆకర్షణశక్తి వుందని చెప్పారు. మరి సుద్దముక్క బల్లమీద పడింది. బల్లకు కూడా ఆకర్షణశక్తి వుందా సార్?" అని ప్రశ్నించాడు. దానితో క్లాసంతా గొల్లుమన్నది.

అగ్గాల సత్యనారాయణ (రాజమండ్రి)

"వారికి పిచ్చిపట్టిందన్నావ్! మరి బాగానే వున్నాడే!"

"చూశారా! అసలు సంగతి మరిచేపొయ్యాను. అంటే నేను గొప్పవాణ్ణయిపోతున్నానన్నమాట! పాయింటుకొస్తాను. వీరికి పిచ్చిపట్టగానే స్నేహితులు కొందరు నెల్లూరులోవున్న ఒక బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు — ఆయనా రామనాథంగారి స్నేహితుడే — వీళ్ళందరూ కలిసి రామనాథంగారిని ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో నాలుగు నెల్లున్నారు. వారి అదృష్టంకొద్దీ బాగైంది. మన కర్మంకొద్దీ ఆస్పత్రినుంచీ బయటపడ్డారు. కానీ ఒక తమాషా! ఆస్పత్రినుంచీ రాగానే వారి డబ్బు దాహం యిబ్బడిముబ్బడైపోయింది. ముందున్న భోళాతనం కలికంలోకి దొరక్కుండాపోయింది. వారిప్పుడు నెలకు మూడువందలు సంపాదిస్తారు ట్యూషన్లుచెప్పి."

ఏంచేస్తాడేమిటి ఆడబ్బు? మళ్ళీ యెవర్నయినా కొత్తమామగార్ని వెదికాడా? లేక—ఇతర దుర్గ..."

"ఛీఛీ! అలాంటివేం లేవు. రామనాథంగారికీ, వారి మామగారికీ యిప్పుడు మాటల్లేవు. ఇప్పుడు వారిది ఒకే పట్టుదల. బాగా డబ్బు సంపాదించాలి. ఇందిర, నాకు పేరు తెలీని ఆ రెండో అమ్మాయి, విమల వీళ్ళందరికంటే చక్కని అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలి. వాళ్ళను తలదన్నినట్టు బ్రతకాలి. ఇదే వారికి జీవితవాంఛయిపోయింది......"

సత్యం చాలా తేలిగ్గా చెబుతున్నా రామనాథంగారి కథవెనుక దాగున్న విషాదం నన్ను ఆలోచనల్లోకి దించింది. ఒక్కమాటతో నిలువెత్తు పురుషుణ్ణి పిచ్చివాణ్ణి చెయ్యగలిగిన స్త్రీనాలుక యెంత పదునైందో తలుచుకుంటే ఆశ్చర్యమేసింది..... విమలకు రామనాథాన్ని పెళ్ళిచేసుకుంటే వచ్చే నష్టమేమీలేదు. రామనాథంపట్ల ఆవిడ చిన్ననాటినుంచీ పెంచుకున్న తేలికభావం ఆవిడచేత ఆమాట అనిపించివుంటుంది.

"విమలను ఎవరికిచ్చారోయ్?" ప్రశ్నించాను సత్యాన్ని.

"ఎవరికంటే......ఆ.....ఆయనో బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసు గుమాస్తానో యేమో! ఏమో బావా! ఈలోగా నాకు సినిమా పాటలే జ్ఞాపకం వుండడం లేదు — ఇవెలా వుంటాయి!"

* * *

కాలచక్రభ్రమణంలో ఒక సంవత్సరం గడచిపోయింది .... ఒకరోజున స్కూల్లో కూచొని కాంపొజిషన్ పుస్తకాలను ఎర్రపెన్సిరాతో ఆలుకుతున్నాను. పోస్టుమాన్ వచ్చి ఉత్తరం యిచ్చివెళ్ళాడు. చించి చదివాను. నెల్లూరునుంచి చంద్రం రాశాడు.

"సోదరా!

నేను బ్రతకాలా చావాలా అన్న స్థితిలో వున్నాను. నా బ్రతుకు కన్నీళ్ళతో చెయ్యి కడిగేలా అయిపోయింది. మా ఆఫీసులో డబ్బు దొంగతనం జరిగింది. ఇటు వాలీ అటు వాలీ అది నానెత్తిమీదికి వాలింది. నీతో చాలా విషయాలు మాట్లాడాలి. తక్షణం బయలుదేరి వచ్చేది.

చంద్రం."

రెండు రోజులు శలవుపెట్టి బయలుదేరాను. నా బాల్యమిత్రుల్లో చంద్రశేఖరం ఒకడు. జీవితాన్ని వేరుగా, ఉద్యోగాన్ని వేరుగా భావించి రెండిటిపట్లా సమానమైన శ్రద్ధను చూపుతాడు. చంద్రం జీవితంపట్ల యెంత జాగరూకుడో ఉద్యోగంపట్లకూడా అంతే! ఈస్థితి—అందులోనూ దొంగతనం నెత్తినపడడం చంద్రంలాంటివాడు భరించలేడు. అతని భార్యకూడా చాలా మంచిదిగానే కనబడింది పెళ్ళిరోజు. పాపం! ఎంత బాధపడుతూవుందో. అందులోనూ పసిది! జీవితానుభవంలేనిది....

నెల్లూరు బస్‌స్టాండులో దిగి సంచీ పుచ్చుకొని చంద్రం యింటివైపు నడుస్తున్నాను. ఎదురుగా రామనాథంగారు కనిపించారు.

"నమస్కారమండి. జ్ఞాపకం వున్నానా?" పలకరించాను.

"చంపేశారు! జ్ఞాపకం వున్నానా.....యెంత సొదా ప్రశ్న వేశారండీ నన్ను.....నాది ఫోటోగ్రాఫిక్ మైండ్. అంత సులభంగా మరిచిపోనండోయ్"

"సంతోషం"

రామనాథం ట్యూషన్లు

"ఆఁ.....సంతోషం అంటే జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు నేను చాలా సంతోషంగా వున్నాను. అమ్మాయిని చూట్టానికి వచ్చానివూరు....." నన్నారు రామనాథంగారు.

రామనాథంగార్ని పరిశీలనగా చూశాను. ఆయన ముఖంలో ఉత్సాహం పెల్లుబుకుతోంది. లోతుకుపోయి చీకటిలో మిణుగురుపురుగుల్లా మెరిసే కళ్ళు కాంతివంతాలైనాయి. ఖరీదైన బట్టలు ధరించారు. బట్టలకు రాసుకున్న సెంటువాసన ఒళ్ళు తిమ్మిరెక్కిస్తోంది.

"చాలా సంతోషమండి. పప్పన్నం పెడ్తారన్న మాట త్వరలోనే!" అన్నాను.

"త్వరలో కాదండీ— చాలా త్వరలో! వస్తాను మరి. చాలా పనులున్నాయి" వెళ్ళిపోయ్యారు రామనాథంగారు. నేను చంద్రం యిల్లు చేరాను.

నన్ను చూడగానే చంద్రం చాలా సంతోషించాడు. భోజనాలతర్వాత నేను, చంద్రం, అతని భార్య కూచున్నాము. చంద్రం సంగతంతా వివరంగా చెప్పాడు.

"......దొంగతనం చేసిందేమో వాడు. నేను చెప్పానుగా సాక్ష్యాలు—వాటితో కేసు నా నెత్తినే పడుతుంది. ఈ దొంగతనం మా ఆఫీసులో యెవరికీ తెలీదు. మా ఆఫీసరు చాలా మంచివారు. ఆయన కూడా నేనీ ఘండాలం పని చేశానని నమ్మడం లేదు. డబ్బు యెలాగో నాలుగు దినాల్లో పర్దితే కేసురాకుండా చెయ్యొచ్చునంటున్నారు.....నాకు పూచికపుల్ల ఆస్తిలేదు. అప్పు చేద్దామంటే రెండువేల రూపాయలు యెవడు అప్పిస్తాడు నా ముఖానికి. ఏంచేద్దాం......ఇదంతా పూర్వజన్మంలో చేసుకున్న ఖర్మ. లేకుంటే క్యాష్‌కౌంటర్ తాళం చెవులు ప్యూను వెధవ కెవరైనా యిస్తారా!...... నా బ్రతుకిలా కాలిపోయిందిరా! ఆత్మహత్య చేసుకుందామనుకుంటే నాకా అధికారం లేదనిపించింది. నాకో భార్య వుంది—అందులోనే ఆవిడ ఒట్టి మనిషికాదు"

చంద్రంభార్యకు కళ్ళనిండా నీళ్ళు నిండాయి. చెరుగుతో తుడుచుకుంటూ గదిలో కెళ్ళింది. గదిలోనుంచి ఎక్కిళ్ళు స్పష్టంగా వినబడుతున్నాయి...

కాస్సేపు విశ్రాంతి తీసుకుందామని పడుకున్నాను. మధ్యాహ్నం నిద్ర అలవాటులేకపోయినా లేచేసరికి నాలుగున్నర కావస్తోంది., ఎవరో తలుపు తడుతున్నారు.

"విమలా! విమలా!"

చంద్రంభార్య వెళ్ళి తలుపు తీసింది. ఆశ్చర్యం! రంగనాథంగారు లోపలికొచ్చారు. తెరచిననోరు ముయ్యకుండా అలాగే నిలబడిపోయింది ఆవిడ. ఆవిడకంటే యెక్కువ ఆశ్చర్యపోయ్యాను నేను. చంద్రం భార్యపేరు విమలని యిప్పుడు జ్ఞాపకం వస్తోంది. ఎప్పుడో పెళ్ళిలో విన్నపేరు.....మరచిపోయ్యాను......రామనాథంగారలాగే వాకిట్లో నిలబడి వున్నారు. వారి ముఖంలో అదే కాంతి, వారి పెదవులమీద మంచులో తడిసిన మల్లెపువ్వులా స్వచ్ఛమైన చిరునవ్వు! విమలకు ఎందుకో దుఃఖం ఆగలేదు. చెరుగు నోటికి అడ్డం పెట్టుకొని గోడవైపుకు తిరిగి యేడవసాగింది......

రామనాథంగారు నవ్వుతూ వెళ్ళి ఆవిడముందు నిలబడ్డాడు.

"ఛ! ఛ! ఎందుకమ్మా అలా యేడుస్తావ్! ఇలా చూడు. మేము పిల్లలకు పాఠాలు యెంత తెలుసో తెలుసుకోవడానికి పరీక్షలు పెడతాం. అలాగే భగవంతుడుకూడా యీ మానవులు దుఃఖాన్ని యెలా భరిస్తారో చూద్దామనిపెట్టే పరీక్షలమ్మా యీ కష్టాలు. అవి యీ రోజొస్తాయి.రేపటికి వుండమన్నా వుండవు."

"అదికాదు బావా...మీకు నేనుచేసిన ద్రోహం..." పిలుపు, మాటలు కలగలుపుగా వచ్చాయి విమల కంఠంనుండి.

"ద్రోహం! ఎవరు చేశారు. ఎవరికి చేశారు! అసలు ఆపదమే వెధవ పదం! నువ్వో పిచ్చిపిల్లవి. నీకు ద్రోహం చెయ్యడమేం తెలుసు. ఇక మీ నాన్న యేదో అవసరంవుండి డబ్బువాడుకున్నాడు. అసలు నాకు డబ్బెందుకూ?"

"అదికాదు బావా......"

"ఏదీకాదు. నువ్వూరుకో. చంద్రశేఖరంగారి బ్లాక్‌డెవలప్‌మెంటు ఆఫీసరులేడూ—వాడు నాకు ప్రాణ స్నేహితుడు. నాకు అన్నీ చెప్పాడు. ఇదిగో పర్సు......ఇందులో రెండువేలా మూడు వంద లున్నాయి. పుచ్చుకో.....ఫరవాలేదులే! నేనుగదమ్మా యిస్తోంది.....వెరీగుడ్....నువ్వు అపరంజిలాంటి పిల్లవి......ఇక నేను వెళ్తాను" రామనాథంగారు బయలుదేరారు. విమల దేహంపీద ప్రజ్ఞ లేకుండా యేడుస్తోంది. కళ్ళు కెంపుల్లాగైపొయ్యాయి. చెక్కిళ్ళమీద కన్నీళ్ళు చారికలు కట్టాయి.....రామనాథంగారి కళ్ళలో రెండు కన్నీటి బిందువులు నిలిచాయి. వెళ్తున్నవారు ఆగి విమలవైపు తిరిగి మళ్ళీ అన్నారు.

"పిచ్చిపిల్లా! ఇప్పుడేం జరిగిందని అలా గుండె పగిలిపొయ్యేలా ఏడుస్తావ్?.......నత్థింగ్..."

"బావా! భోజనమైనా చెయ్యకుండా....."

"ఆఁ......యేం ఫరవాలేదు. అదీ కాకుండా నాకు యింటిభోజనం రుచించదు" రామనాథంగారు వెళ్ళిపొయ్యారు.

విమలకు దుఃఖం ఆగలేదు. ఎవరో కాళ్ళుపట్టి గుంజినట్లుగా నేలమీద కూలబడిపోయింది. గదిలో నుంచి కిటికీగుండా చూస్తున్న నేను కాళ్ళు నేల కంటుకుపోయినట్లు నిలబడిపొయ్యాను....

రాత్రి విమలలేని సమయం చూసుకొని చంద్రానికంతా చెప్పాను. నీళ్ళు నిండిన గొంతుకతో అన్నాడు—"మానవుల్లో కూడా అలాంటి దేవుళ్ళు వుంటారు"

కాలచక్రానికి ప్రపంచంలో జరిగే సంఘటనల్తో పనిలేదు....దానిపాటి కది భ్రమిస్తూ వుంటుంది. చంద్రానికి గుమ్మడిపండులాంటి కొడుకుపుట్టాడు. వాడికి రామనాథం అని పేరు పెట్టుకున్నారు. కాలచక్రం భ్రమిస్తోంది.....ఋతువులు మారుతున్నాయి......ప్రకృతి నిత్యమూ మారుతోంది.....కానీ రామనాథంగారి జీవితంలో మార్పులేదు—వారిది ఒకేరకమైన జీవితం! జీవితంలో వారికున్నవి రెండే రెండు నియమాలు. ఆనాటినుంచి యీనాటివరకూ ట్యూషన్లకు డబ్బు తీసుకోలేదు—పెళ్ళి చేసుకోలేదు. ★

న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)

అందువల్ల ఈ వర్గంవారు శ్రీ మొరార్జీ అంటే ద్వేషం కక్కటంలో ఆశ్చర్యమేలేదు !

కాంగ్రెస్ అధ్యక్షులు సూచించిన పది సంవత్సరాల నిబంధనను మరోసారి పరిశీలిద్దాం. ఈ నిబంధనను అమ్మా అబ్బాలేని అభ్యర్థులందరికి వర్తింపజేసే సూచనలు కన్పిస్తున్నై. ఇందుకు కొన్ని ఉదాహరణలు తీసుకుందాం. పది సంవత్సరాలకు పైగా పార్లమెంటు సభ్యులుగావున్న శ్రీ హఫీజుర్ రహమాన్ జోలికి ఎవరైనా పోగలరా? ఈమారు ఆయనకు టిక్కెట్టు ఇవ్వకపోతే శ్రీ నెహ్రూ మత నిరపేక్షతా రహిత విధానం నాశనమైపోదూ! బాబూ సత్యనారాయణసిన్హా బాబూ జగజీవనరాంగార్ల సంగతి ఇంతకుముందే చెప్పాను. వీ రిరువురు పాతిక సంవత్సరాలకుపైగా కేంద్ర శాసన సభాసభ్యులు.

ఇంతకీ ఈ పదేళ్ళ నిబంధన అన్న బ్రహ్మాస్త్రాన్ని ఎవరిమీద ప్రయోగించేటట్లు? దాని పాలబడేవారిలో ప్రథమంగా శ్రీ మహావీర్ త్యాగి ఒకరు. ప్రధాన మంత్రికీ, శ్రీ కృష్ణమీనన్‌కి ఆయన పక్కలో బల్లెంలా వుంటున్నారు. ప్రజాస్వామికంతో ఆటలాడే అవకాశం శ్రీ నెహ్రూకు కల్పిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానవర్గం ఇలాంటి కొంటెవారి నియోజకవర్గాల్లో యువక రక్తానికి అవకాశం కల్పిస్తుందని నిస్సందేహంగా నమ్మవచ్చు.

గుజరాత్ కాంగ్రెస్ సంఘం ఇటీవల ఇక్కడ సమావేశమైనప్పుడు ఈ పది సంవత్సరాల సూచనను పాటించాలని నిశ్చయించింది. దీనిని ఇతర కాంగ్రెస్ సంఘాలు కూడా అమలు చేస్తాయని ఆడియాశల పెట్టుకుంది. కాని, పొరుగునవున్న మహారాష్ట్ర ఆ సూచనను పాటించే అవకాశం కన్పించదు.

శాసన సభాసభ్యత్వం కొందరికి అధికారం, ప్రతిష్ఠ తెచ్చిపెట్టున్నది. ఒకసారి నేను సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో వుండగా ఒక టెలిఫోను వార్త వచ్చింది. ఒక నొక డిప్యూటీ మంత్రిగారి మూత్రం ఆస్పత్రికి పంపబడుతున్నదని ఆ వార్త సారాంశం ! ఒక బీదవనితకు న్యుమోనియా తిరగబెట్టి నానా అవస్థ పడుతుంటే అటూ యిటూ ఆమెను మారుస్తూ యాతన పెట్టటం నేను కళ్ళారా, ఈ నగరంలోనే మరో ఆస్పత్రిలో చూచాను. ఆ సమయంలోనే ఆస్పత్రి డాక్టర్లందరు ఒక నిరర్థకపు ఉపమంత్రికి ఏదో కొద్దిపాటి జబ్బు చేసిందని లేనిపోని హంగామాచేస్తూ కూచున్నారు. శ్రీ నెహ్రూ సామ్యవాదాన్ని గూర్చి, సమానత్వాన్నిగూర్చి ఉపన్యాసాలు దంచేస్తుంటారు. శ్రీవారొక్కసారి న్యూఢిల్లీ ఆస్పత్రిలో మంత్రులకు, వారి క్రింది ఉద్యోగులకు లభిస్తున్న చికిత్సలో గల వ్యత్యాసాన్ని పరిశీలించటం అవసరం. ఇంతకూ ఈ మంత్రులు సహాయ మంత్రులు, ఉపమంత్రులుచేస్తున్న పనేమిటయ్యా? వేళ్లమీదకొచ్చే కొద్దిమంది మినహాగా మిగతా వారందరూ చచ్చుకొయ్యల్లాంటివాళ్ళు. వీళ్ళవల్ల పన్ను చెల్లింపుదార్లకు అనవసరమైన భారమేగాని నయాపైసంత కూడా ఉపయోగంలేదు.


మంత్రుల కథా కమామిషు ఇది. మిగతా వారికి: పార్లమెంటు సభ్యత్వం ఒక వృత్తిగాను, జీవనాధారంగానువుంది. ఇలాంటి వారికి టిక్కెట్టు నిరాకరించటం మానవత్వానికే తీరని అపచారం చేసినట్టు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటు శాసన సభ్యులందరినీ 'కార్మికు'లని ప్రకటిస్తే చాలా బాగుంటుంది. అప్పుడు వారు ఎన్నికల్లో ఓడిపోయినా నష్టపరిహారమన్నా పొందగల్గుతారు. గత 5 ఏళ్ళలో పార్లమెంటు సభ్యులు తమకు కావలసిన సదుపాయాలేవో కొన్ని ఏర్పాటు చేసుకోగలిగాను. అన్ని రైల్వేలలోను 1 వ తరగతి ప్రయాణ సదుపాయం కల్పించుకున్నారు. ఆరోగ్య సదుపాయ పథకంక్రింద నెలకు రు. 6—లు చెల్లించి వారూ, వారి కుటుంబాలు వైద్య సదుపాయాలుపొందే అవకాశం కల్పించుకున్నారు.

* * *

మాస్టర్ తారాసింగ్ బండారం బైటపెట్టి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి మంచి పనిచేశారు. పంజాబీ సుబా సమస్యపై ఎన్నికలలో పోటీచేసి ప్రజలను ఒప్పించవలసిందని సవాల్ చేశారు. ప్రజాభిప్రాయం అందు కనుకూలంగావుంటే ప్రభుత్వం పంజాబీసుబాను ఏర్పాటు చేస్తుందని హామీ ఇచ్చారు. మరోవిధంగా చెప్పాలంటే అకాలీలకు రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి ప్రజాస్వామిక పద్ధతి పాటించడమో, వత్తిడితెచ్చేందుకు ప్రయత్నించటమో. పంజాబీసుబా అంటే సిక్కుస్తాన్‌కు మారు పేరు. ఇది ఒకకేవలం మతవర్గంవారికోరిక. ఇందుకు ద్విజాతి సిద్ధాంతం ప్రాతిపదిక. ఇవన్నీ మాస్టర్ తారాసింగ్‌కు తెలుసు. ఆయన కోరికను కాంగ్రెస్‌పార్టీ ఆమోదించదు. అందుకని ఆయన పంజాబీసుబా పేరు మార్చేశాడు. ఈ వివాదంలో సిక్కు ఓటర్లందరూ ఆయన్ను బలపర్చవచ్చు. దీనివల్ల ఆయన కోరిక ఒక మతవర్గం కోరికని మరింత ధృవపడుతుంది. శ్రీ శాస్త్రి ఈ సందర్భంలో ప్రశంసనీయంగా వ్యవహరించారు.

అయితే శ్రీ శాస్త్రి హిమాచలప్రదేశ్ కోరికకులొంగిపోయి విమర్శకు పాత్రులయ్యారు. నిజానికి అది శ్రీ నెహ్రూ నిర్ణయమే అనవలసివుంటుంది. శ్రీ నెహ్రూకు ఏ గొడవలు లేకుండావుంటం గిట్టదు. హిమాచల్‌ప్రదేశ్ ఢిల్లీ తమలో తాము సర్దుబాట్లు చేసుకుంటున్నాయి. మాజీ సి. తరగతి రాష్ట్రంతాలూకు కొద్దిమంది మంత్రులు మాత్రం ఇక్కడ ప్రజా పరిపాలన ఏర్పడాలని ఇంకా అరుస్తూ ఉన్నారు. వీరి కోరికలను మన్నించి శ్రీ నెహ్రూ ప్రశాంతతను భంగపరిచారు. ★


గళ్లనుడికట్టు-63



అడ్డం

1. ముందు ఇది చూసుకోకుండా ఏమిటి?
3. —కథ!
5. రాశి, లగ్నం, కుదిరితే రాయి పరిపోతుంది.
6. తల్లక్రిందులుగా వాడుకలో తోటకాచేవాడిని పొట్టి చేయండి!
8. మనుమడిని చూస్తే ఆచారం కనిపిస్తుంది.
9. మిమ్మల్ని మర్యాద లేకుండా గింజచేసి పారేస్తే ఏంచేస్తారు?
11. ద్వీపమేనేమో!
13. అధిక్రపసంగం కావాలి.
16. వర్ణకాలం.
17. ఒకేసారి! (చిందర వందర)
19. రక్త—
21. అయ్యో! ఏమిటి?
24. దీపావళి రాత్రి వెలిగే వాటిలో ఒకటి.
26. ఎప్పుడూ ఉన్న స్వప్నమే!
27. శ్రీ కృష్ణ జన్మస్థానము
30. కరటక దమనకుల జాతి.
32. మా మనుమడు కాకపోయినా మీ మాతులుడు!
34. 'వేగియుబుకు' పురుగులు (తలలో)
35. వింత తిరుడు (సమయముకోసం చూడండి)
37. చలవకాకపోతే మరొకటి.
38. గంటె.
39. గడువు సుదినమును దాటినచో అసాధ్యమైన గుణము లభించును!

62-వ గళ్లనుడికట్టుకు జవాబు



నిలువు

1. ధర.
2. ఒక యుగమున కొక టూరుడు.
3. అడిలో సగంతీసిమారిస్తే ఎండు!
4. పుష్పము
5. పాడుపడినది.
7. మాలతిన్నగా వేసుకున్న కాళిదాసునాటకం నాయిక.
8. ఏమరుపాటు గుప్తమైనదా?
10. —మంచం.
12. మంచి రుచిని సూచించే ఉత్తరం.
13. అలజడి మధ్య తీస్తేగాని అధికమయ్యేట్లు లేదు.
14. తిన్న ఇంట్లో లెక్కపెట్టకూడనిది!
15. క్రిందనుంచి ఆ రోజులోనే ప్రదేశం.
16. సర్పము రాదు!
18. ఊరక, పొట్టిచేసే ఆయాసం సూచిస్తే?
20. కలగా పులగమైపోయిన తాడిచెట్టు.
21. కిరటం
22. వాటా కాని మధ్య పెద్ద త్రాసు—క్రింద నుంచి.
23. మళ్ళీ తల్లక్రిందులుగా ఇల్లు.
24. మమ్ము
25. విజయనగరం మొదటిరాజులలో ఒకరు.
26. తల్లక్రిందులయిన దండ!
28. నృపులు.
29. హరితవర్ణంలో పచ్చ ఎక్కడ?
31. కల నడుమ చిన్న నలుసు.
33. సరిగమలలో పురుష వాచకం
34. నగరం హారంలో నరకంన్నా మించనది.
36. తల్లక్రిందులయితే వాని—ఏమైనట్లు?
37. ధనం కాదు సుమా!

★

ఆరోజు భర్త తప్పతాగి తూలుతూ ఇంటికివచ్చాడు. భార్య అతనిని పుద్దేశించి.

"నేనెన్నిసార్లు చెప్పాలండీ! ఈ వెధవ అలవాట్లు మానుకోకపోతే నే నురిపోసుకుని చచ్చిపోతాను" అని బెదిరించింది.

భర్త:-"చాల్లే ఫూరుకో. ప్రతిసారి ఈ విధంగానే చెప్తున్నావ్. ఒక్కసారన్నా మాట నిలబెట్టుకోలేదు!"

సారథి (మద్రాసు-20.)

అనుమానం

అతను అసలే అనుమానపుమనిషి. దానికి తగట్టు అతనికి ఆరుమాసాలలో పక్షవాతం వస్తుందని చేయి చూచిన ఓ జ్యోతిష్కుడు చెప్పాడు. ఇహ ఆనాటినుంచి అతడు సరిగా తిండి కూడా తినక క్రుశించిపోయాడు.

ఒకరోజు రాత్రి అతను ఒక స్నేహితునితో కలిసి హరికథకు వెళ్ళాడు. హరికథ జోరుగా సాగుతోంది. కథకుడు మధ్యమధ్య పిట్ట కథలు చెప్తూ, శ్రోతలను కడుపుబ్బ నవ్విస్తున్నాడు. ఉన్నట్టుండి మన పెద్దమనిషి వెక్కి, వెక్కి ఏడ్వటం ప్రారంభించాడు. అందరూ తెల్లబోతూ "ఏమిటని?" అడిగారు. అతని మిత్రుడు అతన్ని ఓదార్చి "ఏమిటని?" అడిగాడు. వెంటనే అతను, మిత్రుణ్ని కౌగలించుకొని "ఏం చెప్పనురా? అనుకొన్నంతా అయిపోయింది ... జ్యోతిష్కుడన్నట్టుగా నాకు పక్షవాతం వచ్చేసింది." అన్నాడు బావురుమంటూ. "ఏమిట్రా?" నీకేమిటి పక్షవాతం?...!...!" అన్నాడు మిత్రుడు ఖంగారుగా.

"నిజంరా! పావుగంటనుంచీ నా ఎడం కాలు, గోకి, గిల్లినా ఏం చేసినా...నొప్పికల్గలేదు. మరి...అది పక్షవాతం గాక మరేమంటావ్?...! అన్నాడు గగ్గోలుగా అతడు. "ఒరే! యిడియట్...! ఇందాకట్నించీ నువ్వుగిల్లింది, నా కాలురా! పరిహాసానికి అలా చేస్తున్నావనుకొన్నాను...!" నవ్వాపుకొంటూ అన్నాడా మిత్రుడు.


ఎగ్గోని శ్యామసుందర్ (గుత్తి)

పొట్టికథ

ఎప్పుడూ ఇంతే—92 శంకర్



Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



గ్రామ దేవ మూర్తి
చిత్రకారుడు.— శ్రీ బి. రంగయ్య (నారాయణరావుపేట.)

Regd. No. M 4479 ANDHRA SACHITRA VĀRA PATRIKA.

